PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 246 | విజయవాడ, బుధవారం 10 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Wednesday 10 April 2024 | Rs

కుటుంబాలపై అప్పుల భారం

- తగ్గిన పొదుపు సామర్థ్యం
- 47 ఏళ్ల కనిష్ట స్థాయికి చేరిక
- మోతిలాల్ ఓస్వాల్ రిపోర్ట్

3

ఉత్కంఠ పోరులో సన్‌రైజర్స్ గెలుపు

- పంజాబ్ కింగ్స్‌పై రెండు పరుగులు తేడాతో విజయం

8

మెడలో మామిడాకులు, చేతిలో కంచంతో నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు, కార్మికులు

ఉగాది నాడూ పస్తులే!

- 'అనంత' కార్పొరేషన్ క్లాప్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కార్పొరేషన్

'వేతనాలు ఇవ్వకుండా పండగ పూట పస్తులుంచారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి?' అంటూ క్లాప్ డ్రైవర్లు ఉగాది రోజున మంగళవారం ఆందోళనకు దిగారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మామిడాకులు మెడలో వేసుకొని, ప్లేట్లు చేతిలో పట్టుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు పట్టణ కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడారు. గతంలో రెడ్డి ఏజెన్సీ ద్వారా క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలు చెల్లించేవారని, అయితే వారు ఎనిమిది నెలల వేతన బకాయిలు చెల్లించకపోవడంతో కార్మికులు అప్పట్లో ఆందోళన చేపట్టారని గుర్తు చేశారు. బకాయి వేతనాలు చెల్లించేలా చూస్తామని, ఇకపై కార్పొరేషన్ ద్వారా వేతనాలు ఇస్తామని కార్పొరేషన్ కమిషనర్ హామీ ఇవ్వడంతో కార్మికులు విధుల్లో చేరారని వివరించారు. పాత బకాయిలు అందకపోగా, మళ్లీ వేతనాలు పెండింగ్ పెట్టడంతో క్లాప్ ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మలేరియా కార్మికులకు తాజాగా నాలుగు నెలలు, కోవిడ్, మలేరియా గ్యారేజ్ కార్మికులకు తాజాగా మూడు నెలల వేతన బకాయిలు ఉన్నాయని, పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వేసవి వడగాడ్పుల తరువాత సాధారణ రుతుపవనాలు!

- చల్లని కబురందించిన స్కైమెట్

2

మే 5 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులు (ఆర్మీ, నేవీ, డిఫెన్స్) తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పిస్తుంది. రాష్ట్రానికి సంబంధించి సర్వీస్ ఓటర్లు 67,393 మంది ఉన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు మే నెల 5, 6, 7 తేదీల్లో నియోజకవర్గ స్థాయి ఫెసిలిటేషన్ సెంటర్లో తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నారు. ఇందులో మే 5న పిఒ, ఎపిఒ, మైక్రో అబ్జర్వర్లు, 6న ఒపిఒలు, 7న పోలీసులు, ఎవిఇఎస్, ప్రైవేటు వ్యక్తులు (ఎన్నికల విధుల్లో ఉండేవారు) ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో 8వ తేదీన పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాల్సి ఉంటుంది.

22లోగా పోస్టల్ బ్యాలెట్ ప్రతిపాదనలు

పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ప్రతిపాదనలను ఆయా శాఖల నుంచి ఈ నెల 22లోగా జిల్లా ఎన్నికల అధికారులకు అందజేయాలని నోడల్ అధికారులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని స్పెషల్ ఓటర్లు, సర్వీస్ ఓటర్లు, ఓటర్స్ ఆన్ ఎలక్షన్ డ్యూటీ, ఎలక్ట్రోస్ సబ్జెక్ట్ టూ ప్రిసెంటివ్ డిటెక్షన్, ఓటర్స్ ఇన్‌క్లూడింగ్ ఓటర్స్ ఎక్స్ ఎసెన్షియల్ సర్వీసెస్ (ఎవిఇఎస్) అనే ఐదు కేటగిరీలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఎన్నికల కమిషన్ కల్పిస్తోంది.

పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు ఇలా..

తొలుత ఫారమ్-12 పూర్తి చేసి, ఆధార్, ఎన్నికల డ్యూటీ ఆర్డర్, ఐడి జత చేసి ఓటున్న నియోజకవర్గం హెడ్ క్వార్టర్‌లో తహశీల్దారుకు ఇవ్వాల్సి ఉంటుంది. ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారు. 13-ఎ డిక్లరేషన్‌తోపాటు ఫారమ్-13డి సూచనలు, బ్యాలెట్ ఇస్తారు. ఫారమ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాల్సి ఉంటుంది. 13-ఎ పూర్తి చేసి, ఓటు వేసే ఉద్యోగి సంతకంతో మిగతా 2లో

ధరాఘాతం

దేశ వ్యాప్తంగా జనం విలవిల ● భారీగా పెరుగుతున్న ఖర్చులు ● పెరగని ఆదాయం

- ఆర్‌బిఐ కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వే వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న ధరలతో దేశవ్యాప్తంగా ప్రజానీకం సతమతమౌతున్నారు. పెరుగుతున్న ధరలకు తోడు ఆదాయం పెరగకపోవడం, ఖర్చులు గతంతో పోలిస్తే భారీగా పెరుగుతుండటంతో ప్రజల పరిస్థితి ఘోరంగా మారుతోంది. పెరుగుతున్న ధరలను అదుపులోకి తీసుకురావాల్సిన కేంద్ర ప్రభుత్వానికి ఈ విషయమే పట్టకపోవడంతో భవిష్యత్తులోనూ ధరలు తగ్గుతాయని ప్రజలు భావించడం లేదు. ఈ సంవత్సరమంతా ఇలాగే పెరుగుతాయని, వచ్చే ఏడాది కూడా పెరుగుదల కొనసాగుతుందని దేశ వ్యాప్తంగా అధికశాతం మంది ప్రజానీకం భావిస్తున్నారు. రానున్న సంవత్సరంలోనూ ఆదాయంలోనూ పెద్దగా మార్పు ఉండదని, అదే సమయంలో ఖర్చులు మరింతగా పెరుగకతప్పదన్నది అత్యధిక మంది అభిప్రాయం. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోనూ పెరుగుదల అంతంతమాత్రమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముందున్నది కూడా కష్టకాలమేనని దేశవ్యాప్తంగా అత్యధిక మంది నమ్ముతున్నారు. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వే (సిసిఎస్)లో ఈ విషయాలు పేర్కొంది.

ధరలపై ఇలా...

ధరలు పైపైకే పోతున్నాయి. తాజా సర్వే ప్రకారం 89.2శాతం మంది ధరలు పెరగుతూనే ఉన్నాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత ఏడాది ఇదే నెలలో చేసిన సర్వేలో 93.8శాతం మంది ధరలు పెరుగుతున్నాయన్న ఆందోళనను వ్యక్తం చేశారు. ఆ తరువాత వీరి సంఖ్య కొంత మేర తగ్గింది. అయినప్పటికీ, దేశ వ్యాప్తంగా 89శాతానికన్నా ఎక్కువమంది ధరాఘాతానికి గురవుతున్నారు. అంటే గత ఏడాదితో పోలిస్తే 4.6శాతం మందిమాత్రమే ధరలు పెరుగుదల విషయంలో తమ అభిప్రాయాన్ని మార్చుకున్నారు. ఈ నామమాత్రపు తగ్గుదలనే మోడీ అనుకూల మీడియా భారీగా చూపిస్తోంది. ధరల విషయంలో ప్రజలు సానుకూలంగా ఉన్నారని ప్రచారం చేస్తోంది. తాజా సర్వే ప్రకారం రానున్న సంవత్సరంలో కూడా ధరలు పెరుగుతాయని 78శాతం మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చుక్కలు దాటిన నిత్యావసరాలు

నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు దాటుతున్నాయి. తాజా సర్వే ప్రకారం 84.5శాతం మంది నిత్యావసర వస్తువుల ధరలు పైపైకే పోతున్నాయని అభిప్రాయపడ్డారు. 13శాతం మంది నిత్యావసర వస్తువుల ధరలు నిలకడగా ఉన్నాయని, 2.5శాతం మంది తగ్గాయని అభిప్రాయపడ్డారు. రానున్న సంవత్సరంలోనూ వీటి ధరల పెరుగుదల కొనసాగుతుందని 82.5శాతం మంది అభిప్రయాపడ్డారు.

ఆందోళనకరంగా ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణంపై కూడా దేశ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. 77 శాతం మంది ద్రవ్యోల్బణం పెరుగుతోందన్న అందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది కూడా ఇదే పరిస్థితి ఉంటుందన్న అభిప్రాయాన్ని 76.7 శాతం మంది చెప్పారు. దీంతో రోజువారి వ్యవహారాల్లో తామే చేసే ఖర్చులు మరింత పెరుగుతాయన్న ఆందోళన ప్రజానీకంలో వ్యక్తమవుతోంది. తమ వ్యయం పెరిగిందని 73 శాతం మందికిపైగా అభిప్రాయపడగా, వచ్చే ఏడాది కూడా వ్యయం పెరుగుతుందని 74 శాతం వరకు అభిప్రాయపడడం గమనార్హం.

ప్రజలు ఆందోళన చెందుతున్న అంశాలు



కేంద్ర మంత్రి అఫిడవిట్‌పై దర్యాప్తు

- నిజానిజాల నిగ్గు తేల్చండంటూ సిబిడిటిని ఆదేశించిన ఇసి
- 2021లో మంత్రి ఆదాయం 680 రూపాయలేనట!
- జూపిటర్ కేపిటల్ కంపెనీ ఊసే లేదు
- సిపిఐ(ఎం), కాంగ్రెస్ వేర్వేరుగా ఫిర్యాదు



Any other assets such as value of claims/interest	Rs.5,00,400/- As per annexure No 5	Rs.5,95,978/- As per annexure No 11
Gross Total value	Rs. 9,25,55,404/-	Rs. 12,47,00,408

	Description	Self	Spouse	HUF	Dependent-1
A.	Moveable Assets (Total value)	Rs.13,69,18,637/-	Rs.12,47,00,408/-	NA	NA
B.	Immovable Assets				
I	Purchase Price of self-acquired immovable				

చంద్రశేఖర్ చరాస్తుల వివరాలను చూపించే పత్రంలో వాటి స్థూల విలువ రూ.9.25కోట్లుగా చూపించారు. మరో అనుబంధ పత్రంలో వాటి విలువ రూ.13.69కోట్లుగా చూపించారు. అంటే రూ.4.43కోట్లు తేడా వుంది.

న్యూఢిల్లీ : న్యూఢిల్లీ : తిరువనంతపురం లోక్‌సభ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా బరిలోకి దిగిన కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారంటూ ఫిర్యాదులు రావడంతో కేంద్ర ఎన్నికల సంఘం దీనిపై దర్యాప్తునకు ఆదేశించింది. అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాలకు, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అసల ఆస్తుల విలువకు తేడా ఏమైనా ఉన్నదీ లేనిదీ పరిశీలించి చెప్పాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి)ని ఎన్నికల సంఘం మంగళవారం ఆదేశించింది. మంత్రి తన ఆస్తిపాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పేర్కొనకుండా దాచిపెట్టారని అంతకుముందు సిపిఐ(ఎం), కాంగ్రెస్ వేర్వేరుగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. 2021లో తన ఆదాయం కేవలం రూ.680 మాత్రమేనని కేంద్ర మంత్రి ఆ అఫిడవిట్‌లో పేర్కొనడంపై ఈ పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. అంతేకాదు, జుపిటర్ కేపిటల్ హోల్డింగ్ కంపెనీకి వ్యవస్థాపకుడిగా ఆ కంపెనీ తన వెబ్‌సైట్‌లో స్పష్టంగా పేర్కొంటుండగా, ఆయన అఫిడవిట్‌లో ఆ కంపెనీ గురించిన ప్రస్తావనే లేదు. తప్పుడు వివరాలతో అఫిడవిట్‌ను సమర్పించినట్లైతే ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 125ఎ కింద కఠిన చర్యలు ఎదుర్కొనాల్సి వుంటుంది. నామినేషన్ పత్రాల్లో లేదా అఫిడవిట్‌లో సమాచారం దాచిపెట్టిన పక్షంలో ఆరు మాసాల వరకు జైలు శిక్ష, లేదా జరిమానా లేదా రెండూ వర్తిస్తాయి. ఈ నెల 5న చంద్రశేఖర్ తనకు రూ.28కోట్ల విలువ చేసే ఆస్తులు వున్నట్లు నామినేషన్‌తోబాటు దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. చరాస్తుల విలువ రూ.13,69,18,637 కోట్లు కాగా, ఆయన భార్య ఆస్తుల విలువ రూ.12,47,00,408కోట్లుగా వుంది. ఇందులో చేతిలో వున్న నగదు, బ్యాంకుల్లో డిపాజిట్ల వివరాలు, బ్యాంకింగేతర ఫైనాన్షియల్ కంపెనీలు, సహకార సొసైటీలు, అలాగే బాండ్ల రూపంలో పెట్టుబడులు, డిబెంచర్లు, మ్యూచువల్ ఫండ్లల్లో, కంపెనీల్లో యూనిట్లు, షేర్లు, ఇతర ఆర్థికపరమైన పెట్టుబడులు వున్నాయి. అలాగే ఆయన చరాస్తుల్లో 1942 మోడల్ రెడ్ ఇండియన్ స్కౌట్ కారు కూడా వుంది. కర్ణాటకలో రిజిస్టర్ అయిన ఈ వాహనాన్ని 1994లో రూ.10వేలకు కొనుగోలు మిగతా 2లో

'మహా'లో కుదిరిన సీట్ల సర్దుబాటు

- శివసేన 21, కాంగ్రెస్ 17, ఎన్‌సిపి 10 స్థానాల్లో పోటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్రలో ఇండియా వేదికలో ప్రధాన భాగస్వామ్యపార్టీలుగా ఉన్న శివసేన, కాంగ్రెస్, ఎన్‌సిపి మధ్య సీట్ల సర్దుబాటు కుదిరింది. మొత్తం 48 లోక్‌సభ స్థానాలకు గాను మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన పార్టీ - 21,కాంగ్రెస్- 17, శరద్ పవర్ సారథ్యంలోని నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) 10 సీట్లలో పోటీ చేసేందుకు ఈ మూడు పార్టీల మధ్య అంగీకారం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సాంగ్లీలో శివసేన (ఠాక్రే) పోటీ తిరిగి పోటీ చేస్తుంది. భివాండిలో ఎన్‌సిపి నిలబడుతుంది. ముంబాయి ఉత్తర లోక్‌సభ స్థానం కాంగ్రెస్‌కు కేటాయించారు.

ఈ సందర్భంగా శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ, బిజెపిని ఓడించడమే ఇండియా బ్లాక్ లక్ష్యమని అన్నారు. మోడీ తమ పార్టీని 'నకిలీ శివసేన'గా పేర్కొన్నారని, దోపిడీ దొంగల పార్టీ నాయకుడు తమను ఫేక్ అనడం నవ్వుతెప్పిస్తోందన్నారు. బిజెపిని ఓడించాలనే లక్ష్యాన్ని సాధించడానికి 'విశాల దృక్పథంతో' ఉండాలని నిర్ణయించుకున్నట్లు కాంగ్రెస్ నేత నానా పటోలే తెలిపారు.

సీట్ల సర్దుబాటు ఒప్పందంలో భాగంగా జల్గావ్, పర్భానీ, నాసిక్, పాల్ఘడ్, కళ్యాణ్, థానే, రాయ్‌గఢ్, మావల్, ఉస్మానాబాద్, రత్నగిరి-సింధు దుర్గ్, బుల్దానా, హత్కనంగ్‌కలే, ఔరంగాబాద్, షిర్డీ, సాంగ్లీ, హింగోలీ, యావత్మాల్-వాషిమ్, ముంబై సౌత్, ముంబై సౌత్ సెంట్రల్, ముంబై నార్త్ వెస్ట్, ముంబై నార్త్ ఈస్ట్ సీట్లను శివసేన (ఠాక్రే)కు కేటాయించారు. కాంగ్రెస్ నందుర్‌బార్, ధులే, అకోలా, అమరావతి, నాగ్‌పూర్, భండారా-గోండియా, గడ్చిరోలీ-చిమూర్, చంద్రాపూర్, నాందేడ్, జాల్నా, ముంబై నార్త్ సెంట్రల్, ముంబై నార్త్, పూణే, లాతూర్, షోలాపూర్, కొల్హాపూర్, రామ్‌టెక్ స్థానాల్లో పోటీ చేస్తుంది. బారామతి, షిరూర్, సతారా, భివాండి, దిండోరి, మాఢా, రావర్, వర్ధన్, అహ్మద్‌నగర్ సౌత్, బీడ్ స్థానాల్లో ఎన్‌సిపి(శరద్ పవర్) పోటీ చేయనుంది.

మరో చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- మదనపల్లి (అన్నమయ్య జిల్లా)

మల్లికార్జున (ఫైల్)

అప్పుల బాధతో మరో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నారు. అన్నమయ్య జిల్లాకు చెందిన చేనేత కార్మికుడు అప్పుల బాధతో సోమవారం అర్ధరాత్రి బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... మదనపల్లి పట్టణం నీరుగట్టువారిపల్లిలోని మాయబజార్లో చేనేత కార్మికుడు జి.మల్లికార్జున (42) ఉంటున్నారు. మగ్గంనేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మగ్గం నిర్వహణకు, ముగ్గురు కుమార్తెల వివాహాలకు అప్పులు చేశారు. అసలు, వడ్డీ కలిపి రూ.14 లక్షలకు చేరుకుంది. అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య మాధవి ఉన్నారు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అనంతపురం జిల్లా నార్పల మండలం కేసేపల్లి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు నాగానంద సోమవారం ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే.

వలంటీర్లకు రూ.10 వేలు వేతనం

- త్వరలో మేనిఫెస్టో విడుదల
- ఉగాది వేడుకల్లో టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



తాము అధికారంలోకి రాగానే వలంటీర్ల పారితోషికం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. వలంటీర్లలో సమర్థత, శక్తి ఉన్నాయని, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వారి భవిష్యత్తును నిర్మిస్తామని తెలిపారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం జరిగిన ఉగాది వేడుకల్లో చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. వలంటీర్ల జీవితాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుకుంటున్నారని విమర్శించారు. ఈ వ్యవస్థను ఉపయోగించి రాజకీయ లబ్ధి పొందాలని చూశారని పేర్కొన్నారు. తప్పుడు పనులు చేసి జైలుకుపోయి జీవితాలు పాడు చేసుకుంటారో? రాష్ట్రాభివృద్ధిలో భాగమవుతారో? వలంటీర్లు తేల్చుకోవాలన్నారు. జగన్‌ను నమ్మి మోసపోవద్దని, అతను మరలా అధికారంలోకి రారని అన్నారు. జగన్‌కు సంపద సృష్టించడం చేతకాదన్నారు. సంపద సృష్టించి ప్రజల ఆదాయం తాను పెంచుతానని, అప్పుల భారం లేకుండా మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు అందిస్తానని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే పింఛను రూ.4 వేలకు పెంచుతామని, పెంచిన వాటిని ఏప్రిల్ నుంచే అమలు చేస్తామని అన్నారు. వికలాంగులకు పింఛను రూ.6 వేలకు పెంచుతామని గుర్తుచేశారు. ఇవన్నీ చేయాలంటే కేంద్ర సహకారం అవసరమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా త్వరలో కూటమి మేనిఫెస్టో విడుదల చేస్తామని ప్రకటించారు. జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలకు కారం, చేదు మాత్రమే మిగిలాయని విమర్శించారు. రాష్ట్రంలో భూగర్భ జలాలు ఇంకిపోయాయని, జలాశయాల్లో నీళ్లు లేవని అన్నారు. కర్నూలు జిల్లాలో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ప్రజలకు తాగునీరు ఇవ్వలేని ముఖ్యమంత్రి మూడు రాజధానులు కడతారా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టిడి జనార్ధన్, మాజీ మంత్రులు నన్నపనేని రాజకుమారి, నెట్టెం రఘు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్సీ అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

- పిటిషన్ కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు
- సుప్రీంకు వెళ్లనున్న ఆప్ నేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించలేదు. మద్యం పాలసీ కేసులో 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)' తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు మంగళవారం కొట్టేసింది. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నారు. బహుశా బుధవారం నాడు పిటిషన్ వేసే అవకాశముంది. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి నష్టం చేసేందుకే సరిగ్గా ఎన్నికల సమయంలో ఇడి తనను అరెస్టు చేసిందని కేజ్రీవాల్ వాదించారు. దీనిని కోర్టు తోసిపుచ్చింది. కేంద్ర ప్రభుత్వం చేతిలో సాధనంగా మారిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ కేజ్రీవాల్‌ను మార్చి 21న అరెస్టు చేసింది. ఆయన ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. మద్యం పాలసీలో మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆయనపై ఇడి నేరాభియోగం మోపింది. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ గతవారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా ఈ కేసులో వాద ప్రతివాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

జిందాల్ ప్రవేశంతో నష్టాల కొలిమి

వికటించిన కేంద్రం ఆర్థిక చిట్కాలు ● అగాథంలో 'విశాఖ ఉక్కు'

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అష్టదిగ్బంధంలోకి నెట్టేసే కుట్రలు కొనసాగిస్తోంది. ప్లాంట్‌లోని విభాగాలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ వచ్చిన కేంద్రం... తాజాగా ఐరన్, కోక్‌ల విషయంలో జిందాల్‌పై ఆధారపడేలా చేసి మరింత నష్టాల కూపంలోకి ప్లాంట్‌ను తోసేసే కుట్రలకు తెగబడింది. 2021 జనవరి 20న కేంద్రంలోని బిజెపి సర్కారు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం వ్యూహాత్మక అమ్మకం చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పటి నుంచి విశాఖలోనూ, రాష్ట్రంలోనూ ఉద్యమం కొనసాగుతోంది. 2022 జనవరిలో బ్లాస్ట్ ఫర్నేస్-3ను మూసేసి 'మీ డబ్బులు మీరే తెచ్చుకుని ప్లాంట్‌ను బతికించుకోండి' అన్న... మోడీ సర్కారు ఆదేశాలకు స్టీల్ యాజమాన్యం సై అంటూ జిందాల్‌కు స్వాగతం పలికింది. 2023లో జిందాల్‌ను ప్లాంట్‌లోకి మోడీ తెచ్చారు. ఆ తర్వాత ఉత్పత్తి పూర్తిగా కుంటుపడింది. రాయబరేలిలోని రూ.2 వేల కోట్ల ఫోర్జ్ వీల్ ఫ్యాక్టరీ (స్టీల్‌ప్లాంట్‌కు చెందినది)ని సైతం రూ.19 కోట్లకు అమ్మేశారు. ఆ డబ్బులు ఇంతవరకూ ప్లాంట్‌కు రాలేదు. ఎప్పుడొస్తాయో తెలియదు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఒక్క రూపాయి కూడా కేంద్రం ఇవ్వకుండా, అప్పు కూడా బ్యాంకుల నుంచి పుట్టనివ్వకుండా ప్రభుత్వ ధనమంతా ప్లాంట్‌కే ధారపోసినట్లు బిజెపి ప్రచారం చేస్తోంది. ప్రజలను తప్పుదోవపట్టించి కార్మిక పోరాటాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు కొనసాగిస్తోంది. కరోనా కాలం రెండేళ్లలో కేవలం రూ.800 కోట్లు మాత్రమే స్టీల్ అమ్మకాలు జరిగాయి. ఆనాడెప్పుడూ కార్మిక, ఉద్యోగుల జీతాలకు ఇబ్బంది రాలేదు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.2,500 కోట్లు స్టీల్ అమ్మకాలు జరిగినా జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, అధికారులు జీతాలకు సైతం నోచుకోని తాజా పరిస్థితులపై అందరూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'కోల్ ' బదులు కోక్ కొంటూ...

ఇతర దేశాల నుంచి కోల్ దిగుమతి చేసుకుని కోక్ తయారు చేసుకోవడం ప్లాంట్‌లో ఆనవాయితీగా ఉండేది. మోడీ ప్రభుత్వ నిర్ణయంతో మిగతా 2లో

గెలిపిస్తే..
గిరి గొంతులను చట్టసభలో వినిపిస్తా

సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స

ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స, ఎమ్మెల్యే అభ్యర్థి గంగరాజు, సురేంద్ర

ప్రజాశక్తి - పెదబయలు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపిస్తే గిరిజన వాసుల గళాన్ని చట్ట సభలో వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిపిఎం అరకు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలోని పలు గ్రామాల్లో అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి దీసరి గంగరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్రలతో కలిసి ఆయన మంగళవారం ప్రచారం నిర్వహించారు. రూఢకోట, బడంబీర్, పెద్దలోవ, దూళిపుట్టు, నందిమెట్ట, గొర్రెలమెట్ట, గిద్దలమెట్ట, గోమంగి, థాంగుల తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రచారానికి స్పందన లభించింది. ఎక్కడికక్కడ గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల అప్పలనర్స మాట్లాడుతూ జిఒ నెంబర్ 3 పునరుద్ధరణకు వైసిపి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నమూ చేయకపోవడం దాని అసమర్థతకు నిదర్శనమన్నారు. జిఒ 3 రద్దుతో వేలాది మంది గిరిజన యువతీ యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయారని తెలిపారు. జిఒ 3 అంశం టిడిపికీ పట్టలేదని, ఆదివాసీల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపి పనిచేయలేదని విమర్శించారు. వైసిపి, టిడిపిలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టేనని తెలిపారు. గిరిజనుల సమస్యలను పట్టించుకోని వారిని ఓటుతో ఓడించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు జంపరంగి సునీల్ కుమార్, కె.శరబన్న, పి.బుజ్జిబాబు, జీనాబంధు, గల్లెల నారాయణ పాల్గొన్నారు.

'ఉక్కు' ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు తగవు

పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు తగవని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీ కరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1153వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ చరిత్రలో ఉద్యోగులకు 50 శాతం జీతాలు వేయడం ఇదే ప్రథమమన్నారు. గతంలో ప్లాంట్‌కు ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ఉద్యోగుల వేతనాలను పూర్తిగా చెల్లించేవారన్నారు. అటువంటిది కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతూ 50 శాతం జీతాలు మాత్రమే చెల్లించడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగంలోని స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటేనే ఉద్యోగుల భవిష్యత్తుకు రక్షణ ఉంటుందని తెలి పారు. అటు నిర్వాసితులకు, ఇటు ఉద్యోగులకు న్యాయం జరిగేలా పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ, నాయకులు శ్రీనివాసరాజు, సైన్‌బాబు, జె.రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు 134 మండలాల్లో వడగాడ్పులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం 134 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, మరో 11 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ నెల 11న 16 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 92 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం నాడు తీవ్ర వడగాడ్పులు వీచే మండలాలు మన్యం జిల్లాలో 2, శ్రీకాకుళంలో 8, విజయనగరం జిల్లా వేపాడ ఉన్నాయి. వడగాడ్పులు వీచే మండలాల్లో శ్రీకాకుళంలో 17, విజయనగరంలో 25, అల్లూరి సీతారామరాజులో 10, విశాఖపట్నంలో 3, అనకాపల్లిలో 16, కాకినాడలో 10, కోనసీమలో 9, తూర్పుగోదావరిలో 19, పశ్చిమ గోదావరిలో 4, ఏలూరులో 7, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలో 2, పల్నాడు, అమరావతి మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు.

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీని ఈ నెల 23 వరకు కోర్టు పొడిగించింది. ఢిల్లీ మద్యం విధానం మనీలాండరింగ్ కేసు దర్యాప్తు కొనసాగుతోందని.. కవిత బయట ఉంటే దర్యాప్తును ప్రభావితం చేస్తారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వాదనలు వినిపించింది. జ్యుడిషియల్ కస్టడీని మరో 14 రోజులు పొడిగించాలని కోరింది. మరోవైపు కస్టడీ పొడిగింపు కోరేందుకు ఇడి వద్ద కొత్తగా ఏమీ లేదని కవిత తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. జ్యుడిషియల్ కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు హాలులో భర్త, మామను కలిసేందుకు జడ్జి అనుమతినివ్వడంతో.. వారు కవితను కలిశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

- ఆత్మహత్య చేసుకున్నవారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలి
- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి- మంగళగిరి (గుంటూరు జిల్లా)

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్ట శివ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లా నార్పల మండలం కేసపల్లి గ్రామానికి చెందిన నాగానంద (44), అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన జి.మల్లికార్జున (42) సోమవారం ఆత్మహత్య చేసుకున్నారని, వారు చేనేత మగ్గంపై ఆధారపడే వారని తెలిపారు.

కాంగ్రెస్ రెండో జాబితా విడుదల

- టెక్కలి బరిలో కిల్లి కృపారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేయనున్న అభ్యర్థుల రెండో జాబితా విడుదలైంది. ఆరు లోక్‌సభ, 12 శాసన సభ స్థానాలకు అభ్యర్థులను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల వైసిపి నుంచి పార్టీలో చేరిన కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణిని టెక్కలి శాసన సభ నియోజకవర్గ అభ్యర్థిగా అదేవిధంగా పూతలపట్టు శాసనసభ అభ్యర్థిగా ఇటీవల చేరిన ఎంఎస్ బాబును ప్రకటించారు.



లోక్‌సభ అభ్యర్థులు

నియోజకవర్గం	అభ్యర్థి పేరు
విశాఖపట్నం	సత్యనారాయణరెడ్డి
అనకాపల్లి	వేగి వెంకటేష్
ఏలూరు	కావూరి లావణ్య
నరసరావుపేట	గర్నేపూడి అలెగ్జాండర్ సుధాకర్
నెల్లూరు	కొప్పుల రాజు
తిరుపతి(ఎస్సి)	చింతా మోహన్

శాసన సభ అభ్యర్థులు..

టెక్కలి	కిల్లి కృపారాణి
భీమిలి	అడ్డాల వెంకట వర్మ రాజు
విశాఖపట్నం సౌత్	వాసుపల్లి సంతోష్
గాజువాక	లక్కరాజు రామారావు
అరకు వ్యాలీ(ఎస్టి)	శెట్టి గంగాధరస్వామి
నర్సీపట్నం	రూతులశ్రీరామమూర్తి
గోపాలపురం(ఎస్సి)	ఎస్ మార్టిన్‌లూథర్
ఎర్రగొండపాలెం(ఎస్సి)	బి అజిత్ రావు
పర్చూరు	నల్లగొర్ల శివశ్రీలక్ష్మీ జ్యోతి
సంతనూతలపాడు(ఎస్సి)	పాలపర్తి విజేష్‌రాజ్
గంగాధర నెల్లూరు(ఎస్సి)	డి రమేష్ బాబు
పూతలపట్టు	ఎంఎస్ బాబు

కాంగ్రెస్ కార్యాలయంలో ఉగాది వేడుకలు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రకార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో ఉగాది వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, వి గురునాధం, ప్రధాన కార్యదర్శులు పివై కిరణ్, కుర్షీద, లీగల్ సెల్ చైర్మన్ జంధ్యాల శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

వేసవి వడగాడ్పుల తరువాత

సాధారణ రుతుపవనాలు!

చల్లని కబురందించిన స్కైమెట్

న్యూఢిల్లీ : ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో అల్లాడనున్న భారత్‌కు స్కైమెట్ చల్లని కబురు తీసుకొచ్చింది. వేసవి ముగియగానే సాధారణ రుతుపవనాలు వచ్చే అవకాశముందని ప్రైవేట్ వాతావరణ హెచ్చరికల సంస్థ స్కైమెట్ మంగళవారం తెలిపింది. సాధారణం కన్నా అధికంగా ఈసారి వేసవికాలంలో వడగాడ్పులు ఉంటే అవకాశం ఉన్నందున, ఆ తర్వాత కొంత ఊరట లభిస్తుందని అది పేర్కొంది. సాధారణంగా జూన్-సెప్టెంబరు వర్షాకాల సీజను. ఈ నాలుగు మాసాల్లో సగటున 868.6 మిల్లిమీటర్ల వర్షపాతం అంటే 102శాతం దాకా వర్షాలు కురిసే అవకాశముందని భావిస్తున్నట్లు స్కైమెట్ తెలిపింది. ఏప్రిల్-జూన్ మధ్య దేశంలోని వివిధ ప్రాంతాల్లో నాలుగు నుండి 8 రోజుల పాటు వడగాడ్పులు వీయడం సాధారణంగా జరుగుతుంది. కానీ, ఈ సారి అది 10 నుండి 20 రోజుల దాకా ఉండొచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. భారతదేశంలో సాగు నీటి వసతి లేని దాదాపు సగం వ్యవసాయ భూముల్లో వరి, జొన్న, చెరకు, పత్తి, సోయా బీన్స్ వంటి పంటలు ఏటా జూన్ నుండి సెప్టెంబరు మధ్య వర్షాలపైనే ప్రధానంగా ఆధారపడతాయి. "ఎల్‌నినో చాలా వేగంగా లా నినాకు మారుతుందని, లా నినా సంవత్సరాల్లో రుతుపవనాల కదలిక చాలా బలంగా వుంటుందని స్కైమెట్ మేనేజింగ్ డైరెక్టర్ జతిన్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ, పశ్చిమ, వాయవ్య ప్రాంతాల్లో ఈసారి తగిన మోతాదులో మంచి వర్షాలు పడతాయని స్కైమెట్ అంచనా వేసింది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు ఉత్తర భారత దేశ ధాన్యాగారంగా ప్రసిద్ధిగాంచాయి.

ఇబ్బందులుంటే మార్పు, చేర్పులుంటాయ్

- టిడిపి అధినేత చంద్రబాబు స్పష్టీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించినా..తమ కూటమి అభ్యర్థల విషయంలో ఏ నియోజకర్గంలోనైనా ఇబ్బందులు వస్తే మార్పు, చేర్పులుంటాయని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ప్రజల నుంచి విరాళాలు కోరుతూ ప్రత్యేకంగా రూపొందించిన tdpforandhra.com వెబ్‌సైట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. తన వంతుగా రూ.99,999 విరాళాన్ని పంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా తమకు వీలైనంత సాయం అందించాలని కోరారు. ఈ సందర్భంగా బిజెపి, టిడిపి, జనసేన కూటమి అభ్యర్థుల విషయంలో అసంతృప్త సెగలు, నిరసనలపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ 'కూటమి అభ్యర్థుల విషయంలో ఎక్కడైనా ఏవైనా ఇబ్బందులుంటే అభ్యర్థుల మార్పు, చేర్పులు ఉంటాయ్' అని తెలిపారు. సిఐడి అధికారులు హెరిటేజ్‌కు సంబంధించిన పత్రాలను తగలబెట్టారన్న కథనాలపై స్పందిస్తూ వైసిపి ప్రభుత్వానికి నూకలు చెల్లాయని, ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోతుందని అన్నారు. కాగా హెరిటేజ్ ఫైళ్ల ఘటనపై రాష్ట్ర డిజిపి సమగ్ర విచారణ చేపట్టాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఫైళ్లను సిఐడి డిజి కొల్లి రఘురామిరెడ్డి దహనం చేయించారని ఆరోపించారు.

టిడిపి గూటికి సీతంరాజు

బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు

సుధాకర్‌తో పాటు విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు టిడిపిలో చేరారు. టిడిపి కార్యాలయంలో చంద్రబాబు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వివిధ సంఘాల నాయకుల భేటీ

వివిధ సంఘాలకు చెందిన నాయకులు టిడిపి కార్యాలయంలో మంగళవారం చంద్రబాబును కలిశారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రఫి, ప్రధాన కార్యదర్శి మీరాబాబు, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఫరూఖ్ షుబ్లీ, కరీముల్లా, మాల మహానాడు నేతలు గోళ్ల అరుణ్‌కుమార్, గుజ్జర్లపూడి చారువక, అన్నవరపు కిషోర్ తదితరులు చంద్రబాబును కలిసి టిడిపికి మద్దతుగా ఉంటామని తెలిపారు.

పెన్షనర్ల మరణాలపై ఎన్‌హెచ్‌ఆర్‌సికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీ సందర్భంగా చోటుచేసుకున్న మరణాలను రాజకీయం చేసి వైసిపి ఓట్లు రాబట్టుకునేందుకు యత్నిస్తోందని జాతీయ మానవ హక్కుల సంఘానికి (ఎన్‌హెచ్‌ఆర్‌సి) టిడిపి ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ నేత, మాజీ ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్‌తో కూడిన బృందం మంగళవారం ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్మన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రాను కలిసి ఫిర్యాదు చేసింది. అనంతరం కనకమేడల మాట్లాడుతూ పింఛన్‌దారులను ఆఫీసులకు పిలిచి, ఎలాంటి వసతి, సదుపాయాలు కల్పించకుండా వైసిపి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందన్నారు. దానివల్లే 33 మంది వృద్ధులు మరణించారని పేర్కొన్నారు. కాగా తమ ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్మన్ సానుకూలంగా స్పందించి ఈ ఘటనలపై నివేదిక పంపాల్సిందిగా రాష్ట్ర అధికారులను ఆదేశించారని ఆయన తెలిపారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన రఘురామ కృష్ణరాజు

ప్రజాశక్తి-పిఠాపురం(కాకినాడ జిల్లా)



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పవన్‌కల్యాణ్‌ను నరసాపురం ఎంపి, టిడిపి నేత రఘురామకృష్ణరాజు మంగళవాకం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉగాది సందర్భంగా పవన్ కల్యాణ్ పిఠాపురంలో ఇల్లు తీసుకుని గృహ ప్రవేశం చేస్తున్న సందర్భంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా, చివరకు జగనే ఇక్కడికి వచ్చి బస చేసినా పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌దే గెలుపు అని, ఆయన 65 వేల మెజార్టీతో విజయఢంగా మోగిస్తారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అరాచకం చేస్తున్న వ్యక్తిని సాగనంపేందుకు కూటమిని ఏర్పాటు చేసిన వ్యక్తి పవన్ కల్యాణ్ అని కొనియాడారు. తాను ఎక్కడ నుంచి పోటీ చేస్తానో, ఎమ్మెల్యేగానా, ఎంపిగానా అనేదానిపై మరో 48 గంటల్లో స్పష్టత ఇస్తానన్నారు. తాను ఎక్కడ నుంచి పోటీ చేసినా ప్రచారం చేయాలని పవన్‌ను కోరానన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా క్షేత్రంలో, చట్ట సభల్లో ఉంటానని తెలిపారు.

జనసేన పాలకొండ అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ

పాలకొండ నియోజకవర్గ అభ్యర్థిని జనసేన ప్రకటించింది. టిడిపి నుంచి ఇటీవల పార్టీలో చేరిన నిమ్మక జయకృష్ణను అభ్యర్థిగా వెల్లడించింది. ఈ మేరకు జనసేన అధ్యక్షులకు రాజకీయ కార్యదర్శి పి హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నియోజకవర్గం నుంచి టికెట్ కోసం ఆశావహులు ఎక్కువగా ఉండటంతో పలు దఫాలుగా జనసేన పక్షాన సర్వేలు జరిగాయని, ఇందులో జయకృష్ణకు అత్యధికంగా ప్రజల మద్దతు లభించిందని తెలిపారు. పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆయనను అభ్యర్థిగా ఖరారు చేశారని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి అఫిడవిట్‌పై దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. రూ.3.25కోట్ల విలువ చేసే బంగారం, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు వున్నాయి. ఇక స్థిరాస్తుల్లో రూ.5,26,42,640కు కొనుగోలు చేసిన స్థిరాస్తి వుంది. దీని ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు రూ.14,40,00,000గా వుంది. ఇవి కాకుండా అదనంగా ఆయనకు, భార్యకు వివాదంలో వున్న కొన్ని ఆస్తులు వున్నాయి. చంద్రశేఖర్‌కు రూ.19,41,92,894, ఆయన భార్యకు రూ.1,63,43,972 మేరా అప్పులు వున్నాయి. వీటిల్లో బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు, తదితరాల నుండి తీసుకున్న రుణాలు కూడా వున్నాయి. 2022-23లో తన ఆదాయ పన్ను రిటర్న్‌లో తన మొత్తం ఆదాయం రూ.5,59,200గా వున్నట్లు చంద్రశేఖర్ చెప్పారు. కానీ, 2021-22లో ఈ మొత్తం కేవలం రూ.680గా వుంది.

ఏడేళ్ళలో వంద శాతం పడిపోయిన ఆదాయం

2016-17, 2022-23 మధ్య కాలంలో రాజీవ్‌చంద్రశేఖర్ వార్షిక ఆదాయం దాదాపు వంద శాతమూ కుంచించుకుపోగా, ఆయన భార్య అంజు చంద్రశేఖర్ ఆదాయం ఏకంగా 500శాతం పెరిగింది. 2018లో రాజ్యసభ, 2024లో లోక్‌సభ ఎన్నికలకు గానూ ఆయన సమర్పించిన అఫిడవిట్ల వివరాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

2018, 2024 మధ్య కాలంలో ఆయన చరాస్తుల విలువ 66శాతం మేరా అంటే రూ.27.98కోట్లు నుండి రూ.9.25కోట్లకు తగ్గిపోయింది. అదే సమయంలో ఆయన అప్పులు సున్న నుండి రూ.19.41కోట్లకు పెరి గాయి. ఏడు ఆర్థిక సంవత్సరాల్లో చంద్రశేఖర్ ఆదాయం రూ.28కోట్ల నుండి రూ.5.5లక్షలకు పడిపోయినట్లు ఆదాయపన్ను రిటర్న్ వివరాలు తెలుపుతున్నాయి. అదే సమయంలో ఆయన భార్య ఆదాయం రూ.21.44 లక్షల నుండి రూ.1.2కోట్లకు పెరిగింది.

2018లో చంద్రశేఖర్ అందచేసిన అఫిడవిట్ ప్రకారం, చంద్రశేఖర్ స్థూల ఆదాయం రూ.28.27కోట్లు వుంది. ప్రధానంగా జూపిటర్ కేపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి వచ్చే వేతనం, బెంగళూరులోని కోరమంగళలో గల భవనానికి వచ్చే అద్దెలు, వ్యాపారంలో వచ్చే లాభాలు, రాజ్యసభ ఎంపిగా తన వేతనం, నియోజకవర్గ అలవెన్స్, ఆఫీస్ వ్యయం కింద వచ్చే అలవెన్స్, రోజువారీ అలవెన్స్, డివిడెండ్ ఇన్‌కం, పన్ను రహిత బాండ్ల నుండి, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ యూనిట్ల నుండి వచ్చే వడ్డీ,. మైనర్ పిల్లలకు సంబంధించిన ఆదాయం, బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుండి వచ్చే వడ్డీ ఇవన్నీ కలిపి ఈ ఆదాయంగా చూపించారు.

ఆయన స్థిరాస్తుల స్థూల విలువ కూడా పొంతన లేకుండా వుంది. చరాస్తుల వివరాలను చూపించే పత్రంలో వాటి స్థూల విలువ రూ.9.25కోట్లుగా చూపించారు. కానీ మరో అనుబంధ పత్రంలో వాటి విలువ రూ.13.69కోట్లుగా చూపించారు. అంటే రూ.4.43కోట్లు తేడా వుంది. కానీ ఆయన భార్య చరాస్తుల విలువ మాత్రం ఒక్కలాగే రూ.12.47కోట్లుగా వుంది. బిజెపి అభ్యర్థి రాజీవ్ చంద్రశేఖర్ మాత్రం తన అఫిడవిట్ సరైనదేనని సమర్థించుకున్నారు.

ఫొటో : టివి రమణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో 'ఉగాధి' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలి

- రైతు సంఘాల కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత చాలా ఉందని మాజీ మంత్రి, ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు వ్యాఖ్యానించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో అధికారంలో ఉన్న బిజెపి రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయకపోవటమే కాక.. అంబానీ-అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేలా చట్టాలను మార్పు చేసిందని ఆరోపించారు. దీంతోపాటు 144 కార్మిక చట్టాలను ఎత్తివేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు, ఎపికి ప్రత్యేక హోదా వంటి అనేక హామీలను తుంగలోకి తొక్కిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న అనేక సంస్థలు, పార్టీలు, వ్యక్తులపై కేసులు పెట్టి జైల్లోకి పంపుతోందని ఆగ్రహించారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం బిజెపి కనుసన్నల్లోనే అన్ని చట్టాలనూ అమలు చేస్తోందని ఆరోపించారు. విద్యుత్ చట్టం అమలులో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించిందన్నారు. రైతులు పండించిన పంటకు డబ్బులివ్వటంలో, పంటపోతే నష్టపరిహారాలు చెల్లించటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వడ్డే పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేనను, నియంతృత్వంతో వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించి, ఇండియా కూటమిని, వామపక్షాలను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, చుండూరు రంగారావు, కెవిపి ప్రసాద్, డి హరనాథ్ పాల్గొన్నారు.

'మార్గదర్శి' డిపాజిట్లపై సమగ్ర పరిశీలన

- హైకోర్టుకు రిఫర్ చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మార్గదర్శిపై విచారణను కొట్టేస్తూ గతంలో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. డిపాజిట్లపై సమగ్ర పరిశీలన జరగాల్సిన అవసరం ఉందని, ఇందుకుగానూ నిజాలు నిగ్గు తేల్చాలంటూ తెలంగాణ హైకోర్టుకు మార్గదర్శి డిపాజిట్ల కేసు రిఫర్ చేస్తూ తీర్పు ఇచ్చింది. మార్గదర్శి అక్రమాలకు సంబంధించిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. 'డిపాజిట్లపై సమగ్ర పరిశీలన జరగాలి. పబ్లిక్ నోటీసు ఇచ్చి.. ఇంకా ఎవరైనా డిపాజిటర్లకు మనీ ఇంకా తిరిగి ఇవ్వలేదా? అనేది తెలుసుకోవాలి. ఇందుగానూ హైకోర్టు మాజీ జడ్జి ఒకరిని నియమించాలి. ఎపిలో కూడా డిపాజిటర్లు ఉన్నారు. కాబట్టే అనుమతినిచ్చాం. మేము మెరిట్స్‌లోకి వెళ్ళడం లేదు. మేము తెలంగాణ హైకోర్టుకు రిఫర్ చేస్తున్నాం. రెండు, మూడు నెలల్లో డిపాజిట్లపై సమగ్ర పరిశీలన జరపాలి. ఆర్‌బిఐ కూడా ఈ ప్రక్రియలో పాలుపంచుకోవాలి. ఉండవల్లి అరుణకుమార్ కూడా హైకోర్టుకు సహకరించాలి. తెలంగాణ, ఎపి ప్రభుత్వాలు, ఆర్‌బిఐ, అలాగే.. ఉండవల్లి ఈ కేసులో వాదనలు వినిపించాలి. ఆరు నెలల్లో ఈ కేసు విచారణ తెలంగాణ హైకోర్టు పూర్తి చేయాలి. ఈ కేసుపై మేము ఎలాంటి వ్యాఖ్యలు చేయబోం. తెలంగాణ హైకోర్టులో వాదనలు వినిపించండి' అని ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది.

మే 5 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

(మొదటిపేజీ తరువాయి)

పాటు గెజిటెడ్ అధికారి సంతకం కూడా చేయించాల్సి ఉంటుంది. ఫెసిలిటేషన్ సెంటర్‌లో గెజిటెట్ ఆఫీసరు అందుబాటులో ఉండేలా ఇసి చర్యలు తీసుకుంటుంది. 13-బి కవర్ ఎ, పూర్తి చేసిన అనంతరం టిక్ చేసిన బ్యాలెట్‌ను అందులో పెట్టి సీల్ వేయాలి, అనంతరం 13-సి కవర్ బిలో కవర్‌ఎ, 13 -ఎ డిక్లరేషన్‌లను ఉంచి సీల్ చేసి కవర్‌పై వివరాలు రాయాల్సి ఉంటుంది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బాక్స్‌లో పోస్టల్ బ్యాలెట్‌ను వేయడంతో ఈ ప్రక్రియ పూర్తవుతుంది.

నియామక పత్రంతోపాటు ఫారం -12 జారీ

పిఒ, ఎపిఒ, ఒపిఒలకు ఈ నెల 6 నుంచి 8 వరకు రిటర్నింగ్ అధికారుల ద్వారా నియామకపత్రంతో పాటు ఫారం-12 జారీ చేశారు. పిఒ, ఎపిఒలు ఈ నెల 12, 13 తేదీల్లో జరిగే శిక్షణ సమయంలో పూర్తి చేసిన ఫారమ్-12ను సంబంధిత ఆర్‌ఒలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఒపిఒలు శిక్షణ సమయంలో ఈ నెల 15న నింపిన ఫారమ్‌ను సంబంధిత ఆర్‌ఒలకు సమర్పించాల్సి ఉంటుంది. ఆర్‌ఒ, పిఆర్‌ఒ, ఒపిఒల నియోజకవర్గాల ఫారమ్ -12ను వేరు చేయాలి. వాటిని జిల్లాల్లోని సంబంధిత నియోజకవర్గం ఆర్‌ఒకు అప్పగించాలి. ఈ నెల 15న జిల్లాల నోడల్ అధికారికి పోస్టల్ బ్యాలెట్ అందజేయాల్సి ఉంటుంది. పోలీస్ డిపార్టుమెంట్ నోడల్ అధికారి ఫారం-12/12 డిని ఈ నెల 10లోపు సంబంధిత ఆర్‌ఒకు సమర్పించాల్సి ఉంటుంది. ఇతర జిల్లాలకు చెందిన ఫారం -12/12డిని జిల్లా నోడల్ అధికారికి (పోస్టల్ బ్యాలెట్‌లు) అందజేయాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ పేర్కొంటోంది. ఇతర ఎసెన్సియల్ సర్వీస్ డిపార్టుమెంట్లు ఈ నెల 12లోగా ఫారం-12డిని జిల్లా స్థాయి నోడల్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. వారు నియోజకవర్గాల వారీ వాటిని వేరు చేసి జిల్లాల్లోని సంబంధిత ఆర్‌ఒలకు అందజేయాలి. ఇతర జిల్లాలకు చెందిన ఫారం-12డిని వేరు చేసి డిఇఒకు అందజేయాల్సి ఉంటుంది. సంబంధిత జిల్లా ఆర్‌ఒలకు ఫారమ్ -12/12డిని పంపడంతోపాటు ఆర్‌ఒల నుంచి పోస్టల్ బ్యాలెట్‌లను సేకరించి ప్రత్యేక మెసెంజర్ ద్వారా అభ్యర్థించే జిల్లాలకు పంపాలి. మైక్రో అబ్జర్వర్ల కోసం ఫారం-12ను శిక్షణ సమయంలో సేకరిస్తారు.

జిందాల్ ప్రవేశంతో నష్టాల కొలిమి

(మొదటిపేజీ తరువాయి)

నేరుగా జిందాల్ దగ్గర కోక్ కొనుక్కోవడం మొదలైంది. ప్లాంట్‌కు కోకోవెన్ బ్యాటరీలు ఐదు ఉన్నా వీటిల్లో ఉత్పత్తి తగ్గించుకుని జిందాల్ నుంచి నేరుగా కోక్ కొనుగోలు చేయాలనే నిర్ణయించడం వల్ల టన్నుకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు అదనపు భారం ప్లాంట్‌పై పడుతోంది. వాస్తవానికి 420 కుషింగ్స్ రోజుకు తయారు చేసుకునే కెపాసిటీ స్టీల్‌ప్లాంట్‌కు ఉంది. ఇప్పుడు ఇక్కడ ఉత్పత్తిని 60 శాతానికిపైగా తగ్గించుకుని జిందాల్‌పై పూర్తిగా ఆధారపడేలా కేంద్రం చేసిన నిర్ణయంతో ప్లాంట్ ఆర్థిక పరిస్థితి దినదినగండంగా మారింది. ఎన్‌ఎండిసి నుంచి ఐరన్ ఓర్‌ను ప్లాంట్ తీసుకునేది. ఎన్‌ఎండిసితో ప్లాంట్‌కు కాంట్రాక్టు ఉంది. రోజుకు ఎనిమిది ర్యాకులు కావాలి. జిందాల్ ఎంట్రీ తర్వాత సరాసరి ఐదు ర్యాకులు కూడా రావడం లేదు. కేంద్రం ఇవ్వనీవ్వడం లేదు. ఒక ర్యాకులో నాలుగు వేల టన్నుల ఐరన్ ఓర్ ఉంటుంది. ఐరన్ ఓర్ ప్లాంట్‌కి లేదు కాబట్టి పెల్లెట్స్ వాడాలన్న కేంద్రం ఆదేశాలను స్టీల్ యాజమాన్యం పాటిస్తోంది. ఇది కూడా జిందాల్ నుంచే కొనుగోలు చేస్తున్నారు. ఐరన్ ఓర్ ధర రూ.5 వేలు. అయితే, రూ.12 వేలకు స్టీల్‌ప్లాంట్ పెల్లెట్స్ కొంటోంది. ఇది మరో భారంగా ప్లాంట్‌కు పరిణమించింది. అంటే, కోల్ బదులు కోక్ కొంటూ... ఐరన్ ఓర్ బదులు పెల్లెట్స్ కొంటూ భారం పెంచారు. ఈ రెండింటి ద్వారా జిందాల్‌కు కోట్ల రూపాయలను కేంద్రం, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కలిసి దోచిపెడుతున్నాయి. బ్లాస్ట్ ఫర్నేస్-3లోకి జిందాల్ ఎంట్రీ ఇవ్వడానికిగానూ కుదుర్చుకున్న కాంట్రాక్టు ప్రకారం మరలా 90 వేల టన్నులను ప్లాంట్ ఇవ్వడంతో మరింత అగాథంలోకి ఉక్కు కర్మాగారం నెట్టబడుతోంది.

తెలంగాణ విజిలెన్స్ డిజి రాజీవ్ రతన్ హఠాన్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీనియర్ ఐపిఎస్, తెలంగాణ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్ హఠాన్మరణం చెందారు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మంగళవారం ఉదయం రాజీవ్‌కు ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు ఆయనను గచ్చిబౌలిలోని ఎఐజి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మృధుస్వభావి, వివాదరహితుడుగా ముద్రపడిన రాజీవ్ రతన్ మరణ వార్త విని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డిజిపి రవిగుప్త, సీనియర్ ఐపిఎస్‌లు ఆస్పత్రికి వెళ్లి రాజీవ్ రతన్‌కు నివాళు లర్పించారు. బుధవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1991 ఐపిఎస్ బ్యాచ్ అధికారి అయిన రాజీవ్ రతన్ కరీంనగర్ ఎస్‌పిగా, హైదరాబాద్ రేంజ్ డిఐజి, అగ్నిమాపక శాఖ డిజిగా పనిచేశారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. మరో ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ పొందాల్సి ఉండగా గుండెపోటుతో కన్నుమూశారు.

కుటుంబాలపై అప్పుల భారం

- తగ్గిన పొదుపు సామర్థ్యం
- 47 ఏళ్ల కనిష్ట స్థాయికి చేరిక
- మోతిలాల్ ఓస్వాల్ రిపోర్ట్

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రజల పొదుపు సామర్థ్యం పడిపోవడం.. అప్పుల భారం పెరగడంతో దేశంలో ఆర్థిక సంక్షోభ చాయలు నెలకొన్నాయి. బిజెపి ప్రభుత్వ విధానాలతో ప్రజల పొదుపు సామర్థ్యం దాదాపు ఐదు దశాబ్దాల కనిష్టానికి పడిపోయింది. ఆదాయాలు, పొదుపు తగ్గడం రుణాల భారం పెరగడంతో భారత కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయిందని ఓ కీలక సంస్థ రిపోర్ట్‌లో తేలింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో కుటుంబాల అప్పు స్థాయి 40 శాతానికి చేరిందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోతిలాల్ ఓస్వాల్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. మరోవైపు పొదుపు సామర్థ్యం జిడిపిలో 5 శాతానికి దిగజారి.. అతి కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) సెప్టెంబర్ 2023లోని అంచనా ప్రకారం.. 2022-23లో కుటుంబాల నికర విత్త పొదుపు స్థాయి జిడిపిలో 5.1 శాతానికి పడిపోయింది. ఇది 47 ఏళ్ల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. దీన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఖండించడం మరింత విమర్శలకు దారి తీసింది. నివాసాలు, వాహనాలు వంటి ఆస్తులను కొనుగోలు చేయడానికి రుణాలు తీసుకోవడం వల్ల కుటుంబాలు గతంలో కంటే తక్కువ ఆర్థిక ఆస్తులను కలిగి ఉన్నాయని ఆర్థిక శాఖ పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ ప్రకటించిన 2022-23 జాతీయాదాయం సవరించిన అంచనాల్లో.. కుటుంబాల పొదుపు స్థాయి జిడిపిలో 5.3 శాతానికి తగ్గి.. 47 ఏళ్లలోనే కనిష్ట స్థాయికి దిగజారింది. మరోవైపు కుటుంబాల అప్పుల స్థాయి జిడిపిలో 38 శాతానికి ఎగిశాయి. 2020-21లో ఇది రికార్డ్ స్థాయిలో 39.1 శాతంగా ఉంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రమాద ఘంటికలకు సంకేతం.

గుదిబండగా వ్యక్తిగత రుణాలు..

అవసరాల కోసం తీసుకుంటున్న వ్యక్తిగత రుణాలు కుటుంబాలకు గుదిబండగా మారుతున్నాయి. "డిసెంబర్ 2023 నాటికి కుటుంబాల అప్పులు జిడిపిలో 40 శాతానికి పెరిగి కొత్త గరిష్ట స్థాయికి చేరుకునే సూచనలు కనిపిస్తున్నాయి. బ్యాంకుల డేటా ఆధారంగా అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణాలు వేగంగా పెరిగి కుటుంబాల అప్పులను మరింత పెంచనున్నాయి. ఆ తర్వాత సురక్షిత రుణాలు, వ్యవసాయ రుణాలు, వ్యాపార రుణాలు వేగంగా పెరుగుతాయి." అని మోతీలాల్ ఓస్వాల్ రీసెర్చ్ అనలిస్ట్‌లు నిఖిల్ గుప్తా, తనీషా లధా విశ్లేషించారు.

మోతిలాల్ ఓస్వాల్ రిపోర్ట్ ప్రకారం.. 2022-23లో ప్రధానంగా ఆదాయాల వృద్ధిలో బలహీనతలు కుటుంబాల పొదుపు శక్తిని దెబ్బతీశాయి. అదే విధంగా వినియోగ వ్యయాలు, భౌతిక పొదుపు పెరుగుదల సేవింగ్స్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. 2023-24లోనూ ప్రయివేటు వినిమయం, కుటుంబాల పెట్టుబడుల్లో వృద్ధి బలహీనంగా కనబడింది. కుటుంబాల వార్షిక అప్పులు 5.8 శాతానికి ఎగిసే అవకాశం ఉందని మోతిలాల్ ఓస్వాల్ పరిశోధకులు అంచనా వేశారు. ఇది స్వాతంత్య్ర వచ్చిన తర్వాత అత్యధికంగా నమోదు కానుందన్నారు. కేంద్రంలో మోడీ సర్కార్ రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ అప్పులూ అమాంతం పెరిగిన విషయం తెలిసిందే. వాటి చెల్లింపులకు ప్రజలపై అనేక భారాలు మోపడం, ధరలు పెంచడం, హెచ్చు నిరుద్యోగం, ప్రజల ఆదాయాలు పడిపోవడం తదితర అంశాలు కుటుంబాలను అప్పుల పాలు చేస్తున్నాయనే విమర్శలు అనేకం ఉన్నాయి.

నేడు 134 మండలాల్లో వడగాడ్పులు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం 134 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, మరో 11 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ నెల 11న 16 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 92 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం నాడు తీవ్ర వడగాడ్పులు వీచే మండలాలు మన్యం జిల్లాలో 2, శ్రీకాకుళంలో 8, విజయనగరం జిల్లా వేపాడ ఉన్నాయి. వడగాడ్పులు వీచే మండలాల్లో శ్రీకాకుళంలో 17, విజయనగరంలో 25, అల్లూరి సీతారామరాజులో 10, విశాఖపట్నంలో 3, అనకాపల్లిలో 16, కాకినాడలో 10, కోనసీమలో 9, తూర్పుగోదావరిలో 19, పశ్చిమ గోదావరిలో 4, ఏలూరులో 7, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలో 2, పల్నాడు, అమరావతి మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దవడుగూరు (అనంతపురం జిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రచేడు గ్రామానికి చెందిన చిన్నపుల్లన్న (46) తనకున్న ఎకరం పొలంతోపాటు మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేస్తున్నారు. ఇటీవల ఇంటి నిర్మాణం కూడా చేపట్టాడు. పంట సాగు, ఇంటి నిర్మాణం కోసం దాదాపు రూ.8.50 లక్షల వరకు అప్పులు చేశారు. పంట సాగులో అనుకుంత దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. చేసిన అప్పులు తీర్చలేనన్న మనస్తాపంతో సోమవారం రాత్రి అందరూ నిద్రించిన తరువాత ఇంట్లో పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మంగళవారం మృతి చెందారు. చిన్న పుల్లన్నకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

మాజీ మంత్రి ఫరూక్‌కు తప్పిన ప్రమాదం

- గేదెల మందను ఢీకొట్టిన కారు
- ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - పాణ్యం/నంద్యాల కలెక్టరేట్

నంద్యాల శాసనసభ నియోజకవర్గ అభ్యర్థి, మాజీ మంత్రి ఎన్ఎండి.ఫరూక్‌కు పెను ప్రమాదం తప్పింది. గోదెల మందను ఆయన వాహనం ఢీకొన్నడంతో గాజు ముక్కలు తగిలి స్వల్ప గాయాలయ్యాయి. ఫరూక్ అనుచరుల కథనం ప్రకారం... నంద్యాల నుంచి కర్నూలుకు మంగళవారం ఫరూక్ కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో పాణ్యం మండలం తమ్మరాజుపల్లె వద్ద రోడ్డు దాటుతున్న గేదెల మందను కారు ఢీకొట్టింది. ఎయిర్‌బెలూన్ ఓపెన్ కావడంతో పెనుప్రమాదం తప్పింది. కారు ముందు అద్దాలు పగిలి గాజు ముక్కలు గుచ్చుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. 108 సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రయివేట్ ఇంటెన్సివ్ ట్రామా కేర్‌కు తరలించారు. డ్రైవర్ గౌస్‌తో పాటు ఆ కారులోని మరో ఇద్దరికి ఎలాంటి గాయాలూ కాలేదు. చికిత్స పొందుతున్న ఎన్ఎండి ఫరూఖ్‌ను మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, నంద్యాల ఎంపి అభ్యర్థి బైరెడ్డి శబరి, పాణ్యం టిడిపి అభ్యర్థి గౌరుచరితారెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమాబ్రహ్మానందరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.

రాష్ట్ర ప్రజలకు శుభాలు, విజయాలు సిద్ధించాలి

- ఉగాది వేడుకల్లో సిఎం జగన్ దంపతులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెంలో బస చేసిన శిబిరంలోనే మంగళవారం ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. 'మేము సిద్ధం' బస్సు యాత్ర సోమవారం రాత్రి వినుకొండ మీదుగా గంటావారిపాలేనికి చేరుకుంది. రాత్రి ఆ గ్రామంలోనే ముఖ్యమంత్రి బస చేశారు. ఈ శిబిరం వద్దకు ఆయన సతీమణి భారతి వచ్చారు. ఈ శిబిరంలోనే ఉగాది వేడుకలు నిర్వహించుకున్నారు. రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు, విజయాలు సిద్ధించాలని, ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు జరగాలని ముఖ్యమంత్రి దంపతులు ఆకాంక్షించారు. వేదపండితులు అందజేసిన ఉగాది పచ్చడిని ఆరగించారు. ఈ కార్యక్రమంలో నర్సరావుపేట లోక్‌సభ వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్, వినుకొండ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు. గొంతు సమస్యలతో బాధపడుతున్న సిఎం జగన్ సోమవారం రాత్రి నుంచి ఎవ్వరినీ కలవలేదు. మంగళవారం ఉగాది వేడుకల్లో మాత్రమే పాల్గొని ఆ తర్వాత విశ్రాంతి తీసుకున్నారు. బుధవారం ఉదయం శావల్యాపురం నుంచి జగన్ మళ్లీ యాత్ర ప్రారంభించి పిడుగురాళ్ల చేరుకుని మధ్యాహ్నం 3.30 గంటలకు అయ్యప్ప నగర్ వద్ద బహిరంగ సభలో పాల్గొంటారని, సత్తెనపల్లి మండలం దూళిపాళ్లలో రాత్రి బస చేస్తారని ఎమ్మెల్సీ తలశిల రఘురాం తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఉగాది పచ్చడి అందజేస్తున్న వేద పండితుడు

రుణమాఫీ రైతులకు వరం

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న వ్యవసాయ రుణమాఫీ పథకం రైతులకు వరమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా వేంపల్లెలోని తన స్వగృహంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం ప్రారంభమైందని చెప్పారు. పదేళ్ల అరణ్యవాసం ముగిసి రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రాబోతున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకం మహిళలకు వరమన్నారు. గ్యారంటీ పథకాలు కాంగ్రెస్ పార్టీకి విజయ సోపానాలని తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని బస్సు న్యాయ యాత్రకు విరామం ఇచ్చినట్లు చెప్పారు. వైఎస్ షర్మిల ఈ నెల 12న పులివెందుల, 13న జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. కాంగ్రెసు చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుండి అపూర్వ స్పందన వస్తోందని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ప్రారంభమైందని తెలిపారు.

శ్రీవారి ఆలయంలో వేడుకగా ఉగాది

ప్రజాశక్తి - తిరుమల, శ్రీశైలం

తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం వేడుకగా జరిగింది. మంగళవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేశారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయం వెలుపల ఇఒ ఎవి.ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో టిటిడి చైర్మన్, డిఎల్ఒ వీర్రాజు, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఆలయ డెప్యూటీ ఇఒ లోకనాథం, విజిఒ నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా ఆకట్టుకున్న ఫల - పుష్ప అలంకరణలు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకొని టిటిడి ఉద్యానవనం విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప అలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందుకోసం పది టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్‌ఫ్లవర్స్ ఉపయోగించారు. శ్రీవారి ఆలయం లోపల ఆపిల్, ద్రాక్ష, బత్తాయి, నారింజ, కర్బూజ, మామిడి, చెరకు, విభిన్న రకాల పండ్ల గుత్తులు, అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలతో శ్రీవారి ఆలయాన్ని ఆకర్షణీయంగా రూపొందించారు. శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభం చెంత పుచ్చకాయలతో చెక్కిన దశావతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయోధ్య రామాలయం, బాల రాముడి సెట్టింగ్, నవధాన్యాలతో రూపొందించిన మత్స్య అవతారం యాత్రికులను ఆకర్షించాయి.

వైభవంగా శ్రీశైల మల్లన్న రథోత్సవం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. రథోత్సవం ముందుభాగాన్న కోలాటం, చెక్కభజన, పగటివేషాల ప్రదర్శన, బుట్ట బొమ్మలు, గొరవయ్య నృత్యం, తప్పెట చిందు, కర్ణాటక జాంజ్ వీరగాసి కొమ్ము వాయిద్యం, కన్నడ డోలు, నంది కోలు సేవ కంచుడోలు, వంటి వివిధ రకాల నృత్య ప్రదర్శనలతో క్షేత్రంలోని రథశాల వద్ద నుంచి నంది గుడి వరకు, తిరిగి నంది గుడి నుంచి రథశాల వరకు లక్షలాది మంది యాత్రికుల నడుమ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎస్‌పి కె.రఘువీరారెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయం ఎదుట ఫల, పుష్పాలతో రూపొందించిన భూలోక వైకుంఠం

చేబ్రోలులో పవన్ నూతన గృహ ప్రవేశం

- ఉగాది వేడుకల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో కూటమి ప్రభుత్వం రాబోతోంది అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నూతన నివాస గృహప్రవేశం చేశారు. అనంతరం టిడిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్ఎన్.వర్మ, బిజెపి ఇన్‌ఛార్జ్ కృష్ణంరాజు, జనసేన కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌తో కలసి ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచాగ శ్రవణం చేశారు. అనంతరం పవన్ మాట్లాడుతూ... పిఠాపురం నుంచే మార్పు మొదలు కాబోతుందన్నారు. ఈ ఏడాది అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సరం రైతుకు క్షేమం కలిగించాలని, యువతకు ఉపాధి అవకాశాలు చూపాలని, మహిళలు నిర్భయంగా తిరిగేలా చూడాలని, ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందాలని, వ్యాపారులకు మంచి లాభాలు అందించాలని ఆకాంక్షించారు. తనకు ఇంటిని అద్దెకిచ్చిన యజమానులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు, ఉపాధ్యక్షులు బి. మహేందర్ రెడ్డి, పార్టీ నేతలు వేములపాటి అజయ్‌కుమార్, మర్రెడ్డి శ్రీనివాస్, కల్యాణం శివశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకల్లో పాల్గొన్న పవన్‌కల్యాణ్

రూ.13.60 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - యంత్రాంగం

రణస్థలంలో పోలీసుల తనిఖీలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు మంగళవారం పలుచోట్ల చేపట్టిన వాహన తనిఖీల్లో పెద్దమొత్తంలో తరలిస్తున్న నగదును పట్టుకున్నారు. సరైన పత్రాలు లేని నగదును సీజ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని పైడిభీమవరం వద్ద తనిఖీల్లో రూ.6.75 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన కాంట్రాక్టరు సతీష్ రెడ్డి అనపర్తి నుంచి కోటబొమ్మాళికి కారులో వెళ్తున్నారు. పోలీసులు కారును తనిఖీ చేయగా రూ.6.75 లక్షల నగదు పట్టుబడింది. ఇందుకు సంబంధించిన ఎటువంటి రశీదులు, ఆధారాలు చూపకపోవడంతో ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జె.ఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు. ఏలూరు జిల్లా కామవరపుకోట వద్ద వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.2.15 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఇన్‌ఛార్జి కె.బాబూరావు తెలిపారు. రావికంపాడుకు చెందిన ఒక వ్యక్తి నుండి రూ.60 వేలు, పాత గండిగూడెం గ్రామానికి చెందిన ఒక మహిళ వద్ద రూ.1.55 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. తగిన ఆధారాలు చూపకపోవడంతో ఆ నగదును సీజ్ చేశారు. కొయ్యలగూడెం మండలం రామాంజనేయపురం గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వస్తుండగా కొవ్వూరు రోడ్డులోని పాతబస్టాండ్ సెంటర్‌లో రూ.1.20 లక్షల నగదును పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. పెదవేగి మండలం విజయరాయి సమీపంలోని బలివే అడ్డరోడ్డు వద్ద వాహన తనిఖీల్లో 1.35 లక్షల నగదు పట్టుబడింది. అనపర్తి నుంచి ధర్మాజీగూడెం మీదుగా ఏలూరువైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న చందురెడ్డి, శంకర్రావు అనే ఇద్దరు వ్యక్తుల దగ్గర ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. లింగపాలెం మండలానికి చెందిన పాస్టర్ ఏలియ్య కారులో తరలిస్తున్న రూ.1.50 లక్షలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన సొమ్మును ఏలూరు జిల్లా ట్రెజరీలో జమ చేశామని, సంబంధీకులు సరైన ఆధారాలు చూపిస్తే ఆ నగదును తిరిగి ఇచ్చేస్తామని పెదవేగి తహశీల్దార్ సూర్యప్రభ తెలిపారు.

టిడిపిలో గుర్తింపు లేదు

- వైసిపిలో చేరుతున్నా
- మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి (అన్నమయ్య జిల్లా)

తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపు రావడంలేదని మాజీ ఎమ్మెల్యే అర్.రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాయచోటి ఎమ్మెల్యే టికెట్ ప్రకటన విషయంలో అందర్నీ సమన్వయం చేయడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. టికెట్ ప్రకటించి 45 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు తనను తెలుగుదేశం పార్టీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. టిడిపి కార్యక్రమాలను గడప గడపకూ తీసుకెళ్లానని తెలిపారు. డబ్బులున్న వారికే పార్టీలో స్థానం ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి చంద్రబాబు గ్యారంటీ లేదు, ష్యూరిటీ లేదని విమర్శించారు. తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు, లోకేష్ పార్టీ సంప్రదాయాలను మంట కలిపారని ఆరోపించారు. తాను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జితోపాటు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు.

మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

విదేశాల్లో వ్యాపారాలకు ఓలా గుడ్‌బై..

బెంగళూరు : ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఓలా క్యాబ్స్ ఇతర దేశాల్లోని తన కార్యకలాపాల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత ఏప్రిల్ ముగింపునకల్లా బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లోని తన వ్యాపారాన్ని మూసివేయనుంది. దీనిపై అక్కడి వినియోగదారులకు సమాచారం అందిస్తోంది. పూర్తిగా భారత్ మార్కెట్‌పై దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఆయా దేశాల్లో ఎదురవుతున్న పోటీ నేపథ్యంలో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

పెంపుడు జంతువులకు వైద్య బీమా

- హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో వెల్లడి

ముబయి : పెంపుడు జంతువులకు వైద్య బీమాను అందిస్తున్నట్లు హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో తెలిపింది. వాటి సంరక్షణకు వైద్య పరీక్షల నుంచి శస్త్రచికిత్సలు, ఔషధాలను అందించే సమగ్ర బీమా పథకం 'పాస్ ఎన్ క్లాస్'ను ప్రారంభించినట్లు పేర్కొంది. ఏప్రిల్ 11న జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవానికి ముందస్తుగానే ఈ పత్యేకమైన ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. దేశంలో పెంపుడు జంతువుల సంరక్షణ మార్కెట్ ఏటా 13 శాతం పైగా పెరుగుతోందని అంచనా వేసింది.

వాట్సాప్‌లో టాటా ఎఐఎ చెల్లింపు పరిష్కారాలు

ముంబయి : జీవిత బీమా రంగంలో తొలి సారి తాము వాట్సాప్ ప్లాట్‌ఫారమ్‌లో ప్రీమియం చెల్లింపు సేవలను అందుబాటులోకి తెచ్చామని టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఎఐఎ) తెలిపింది. గతంలో యుపిఐ ఆధారిత లావాదేవీలకు మాత్రమే పరిమితం చేయబడిన టాటా ఎఐఎ వినియోగదారులు ఇప్పుడు వాట్సాప్‌లో అనేక రకాల చెల్లింపు పద్ధతులను ఉపయోగించవచ్చని పేర్కొంది. వాట్సాప్ ఉపయోగించి పాలసీదారులు ఇప్పుడు క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్ ద్వారా సులభంగా పునరుద్ధరణ చెల్లింపులను చేయవచ్చని వెల్లడించింది. వాట్సాప్‌లో 27 సేవలను అందిస్తోన్నట్లు పేర్కొంది.

న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాసు) ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్ లో)

దివాలా మరియు దివాలా కోడ్ 2016 క్రింద ఇ-వేలం విక్రయ నోటీసు

వేలం తేది మరియు సమయం : బుధవారం, 15 మే, 2024 ఉ.11 గం. నుండి 1 గం. వరకు.

దివాలా మరియు దివాలాకోడ్, 2016 యొక్క సెక్షన్ 33 క్రింద 12 సెప్టెంబరు, 2023వ తేది ఆర్డరు **మెసెర్స్.న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాసు) ప్రైవేట్ లిమిటెడ్** గౌరవనీయులైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్, చెన్నై బెంచ్ లిక్విడేషన్ కొరకు ఆదేశించినట్లు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది. కార్పొరేట్ డెబ్టార్ యొక్క లిక్విడేటర్‌గా శ్రీ.రామకృష్ణన్ సదాశివన్‌ను నియమించబడ్డారు. ఈ నోటీసు లిక్విడేటర్ నిర్వహించిన వేలం విక్రయానికి సంబంధించినది.

దయచేసి గమనించండి : ఆస్తుల యొక్క అమ్మకం ఇ-వేలం ద్వారా **"ఎక్కడ ఉన్నది అక్కడే", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఏదైనా ఉంది ప్రాతిపదికన" మరియు "రిసోర్స్ లేకుండా ప్రాతిపదికన" ఖచ్చితంగా నిర్వహించబడుతుంది. తదుపరి, ఇ-వేలం యొక్క వివరణాత్మకమైన నిబంధనలు మరియు షరతులు మరియు ఆన్‌లైన్ వేలం విక్రయానికి సంబంధించిన ఇతర వివరాలను కలిగి ఉన్న వేలం ప్రక్రియ మెమోరాండం వెబ్‌సైట్ https://nbld.nesl.co.in/app/login** వద్ద అందుబాటులో ఉన్నాయి లేదా దిగువ పేర్కొన్న లిక్విడేటర్ ఇ మెయిల్ చిరునామాను సంప్రదించవచ్చు. తదుపరి స్పష్టీకరణల కొరకు సంబంధిత పార్టీలు లిక్విడేటర్‌ని ఇ మెయిల్ **nucleussatellitecomm@gmail.com** (లేదా) **sadasivanr@gmail.com** లో సంప్రదించవచ్చు.

వేలం వేయబడుతున్న ఆస్తుల షెడ్యూల్ :

లాట్ నం.	ఆస్తి	రిజర్వు ధర (రూ.)	ఇఎమ్‌డి (రూ.)	ఇంక్రిమెంటల్ బిడ్ (ఐఎన్ఆర్)
A	కార్పొరేట్ డెబ్టార్ అమ్మకం-మెసెర్స్. న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాసు) ప్రైవేట్ లిమిటెడ్ గా కన్సెమ్ కి వెళ్లింది. గమనిక : ఫిక్స్‌డ్ డిపాజిట్లు, నగదు మరియు బ్యాంక్ బ్యాలెన్స్‌లు మరియు ప్రభుత్వ సంస్థలు మరియు / లేదా ఇతర చట్టబద్ధమైన అథారిటీల నుండి స్వీకరించాల్సిన ఏవైనా వాపసులు/ప్రోత్సాహకాలు మరియు అన్ని/ఏదైనా వ్యాజ్యాల నుండి వచ్చే ఏదైనా ఆదాయాలు విక్రయించబడుతున్న ఆస్తుల నుండి మినహాయించబడతాయి.	22,53,00,000	2,25,00,000	5,00,000
B	లీజుహోల్డ్ స్థలం మరియ ఫ్యాక్టరీ భవనం మరియు ప్లాంట్ మరియు మిషనరీ యొక్క స్థిరాస్తుల విక్రయం మరియు జాబిత	22,53,00,000	2,25,00,000	5,00,000
C	ప్లాంట్ మరియు మిషనరీ మరియు జాబిత	5,90,00,000	59,00,000	2,00,000
D	ఫ్యాక్టరీ భవనం మరియు లీజ్‌హోల్డ్ స్థలం యొక్క స్థిరాస్తుల అమ్మకం	16,63,00,000	1,66,00,000	5,00,000

రిజర్వు ధరకు అదనంగా వర్తించే జిఎస్‌టి వసూలు చేయబడుతుంది

గమనిక : 1. వేలం వేయబడుతున్న అన్నీ ఆస్తుల స్థానం ఇక్కడ ఉన్నాయి : శ్రీసిటీ, ప్లాట్ నం.465, సిట్రస్ డ్రైవ్, మోపురుపల్లి, వరదయ్యపాలెం మండలం, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-517541. 2. ప్రాధాన్యతా క్రమం : 1. లాట్ ఎ, 2. లాట్ బి, 3. లాట్ సి మరియు 4. లాట్ డి.

వేలం టైమ్‌లైన్స్ :

క్ర.సం.	ఈవెంట్ వివరణ	తేది
1	వేలం ప్రకటన జారీ	10 ఏప్రిల్, 2024
2	భావి బిడ్డరుదారు ద్వారా కెవైసి పత్రాలు మరియు 29ఎ అర్హత పరిమాణాల సమర్పణ	10 ఏప్రిల్, 2024 నుండి 30 ఏప్రిల్ 2024 వరకు
3	అర్హత కలిగిన బిడ్డర్ యొక్క ప్రకటన (అర్హత పత్రాలు మరియు సమర్పించిన కెవైసి ఆధారంగా)	2 మే, 2024న లేదా అంతకు ముందు
4	వేలం క్రింద ఉన్న ఆస్తుల తనిఖీకు అర్హత కలిగిన బిడ్డరుదారు కొరకు సమయం	3 మే, 2024 నుండి 9 మే, 2024 వరకు (లిక్విడేటర్ అనుమతి వ్యవధితో ఉ.10 గం. నుండి సా.5 గం. వరకు)
5	అర్హత పొందిన బిడ్డరుదారు ద్వారా బిడ్ పారం మరియు ఇఎమ్‌డి సమర్పణ కొరకు చివరి తేది	11 మే, 2024
6	ఇ-వేలం తేది	15 మే, 2024

గమనిక : విజయవంతమైన వేలం బిడ్డరుదారు కోసం చెల్లింపు టైమ్‌లైన్‌లు విజయవంతమైన వేలం బిడ్డరుదారు లిక్విడేటర్ లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేసిన తేదీ నుండి 90 రోజులలోపు మిగిలిన అమ్మకం పరిశీలనను అందిస్తారు. 30 రోజుల తర్వాత కానీ 90 రోజుల ముందు చేసిన చెల్లింపులకు 12% వడ్డీని ఆకర్షిస్తారు. లెటర్ ఆఫ్ ఇంటెంట్ తేదీ నుండి 90 రోజులలోపు చెల్లింపు అందకపోతే అమ్మకం రద్దు చేయబడుతుంది.

సం/-
రామకృష్ణన్ సదాశివన్
IBBI/IPA-001/IP-P00108/2017-18/10215
లిక్విడేటర్-న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాసు) ప్రైవేట్ లిమిటెడ్
రిజిస్టర్డ్ మెయిల్ : **sadasivanr@gmail.com**
కరెస్పాండెన్స్ మెయిల్ : **nucleussatellietcomm@gmail.com**
చిరునామా : పాత నం.22, కొత్త నం.28, మెనోద్ వీధి, పురసవాకం, చెన్నై-600 007.
మొబైల్ నం.: 94444 55982

తేది : 10 ఏప్రిల్ 2024
ప్రదేశం : చెన్నై

- పాచికలతో బిజెపి
- కలివిడిగా కాంగ్రెస్
- తొలిదశ ఎన్నికలకు పార్టీల మోహరింపు

ఎడారి రాష్ట్రం ఎటు!

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్... ఈ ఎడారి రాష్ట్రంలో పాగా వేసేందుకు బిజెపి, కాంగ్రెస్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అందుకనుగుణంగా వ్యూహాలు రచిస్తున్నాయి. బిజెపి కుల, విభజన పాచికతో ఎన్నికలకు వెళ్తుండగా, కాంగ్రెస్, ఇండియా ఫోరం పార్టీలు రైతుల సమస్యలు, ఉపాధి, ధరల పెరుగుదల, ఆదివాసీ హక్కులు, దళితులపై దాడులు వంటి అంశాలతో ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. దేశంలోనే అత్యంత ఎక్కువ నిరుద్యోగం ఉన్న రాష్ట్రాల్లో 28.5 శాతంతో రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది. ఎన్నికల్లో ఇదే ప్రధానాంశంగా మారింది. రాజస్థాన్‌లో ఉన్న 25 లోక్‌సభ స్థానాల్లో ఏప్రిల్ 19, ఏప్రిల్ 26 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. 12 స్థానాలకు తొలి దశలో, 13 స్థానాలకు రెండో దశలో పోలింగ్ జరగనుంది.

కమలానికి అన్ని సీట్లు అసాధ్యం

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో లభించిన విజయంతో బిజెపి లోక్‌సభ ఎన్నికలకు వెళుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో తెచ్చుకున్నన్ని సీట్లు మళ్లీ ఆసిస్తోంది. గత ఎన్నికల్లో 25 స్థానాలకు 24 బిజెపి, ఎన్‌డిఎ పార్టీ ఆర్‌ఎల్‌పి 1 స్థానాన్ని కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేశారు. రామమందిరం, కుల సమీకరణాలతో ఎన్నికలకు వెళ్తున్న బిజెపికి గత ఎన్నికల ఫలితాలు రాకపోవచ్చన్నది విశ్లేషకుల అభిప్రాయం. గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ ఘోరంగా విఫలం అయింది. ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు వచ్చింది. గత లోక్‌సభ, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత కాంగ్రెస్, ఇండియా ఫోరంలో భాగంగా ఉన్న సిపిఎం, ఆర్‌ఎల్‌పి, బిఎపి పార్టీలతో కలిసి చేస్తోంది. రాజస్థాన్‌లో ఇండియా ఫోరం బలోపేతం అయింది. ఫోరానికి సానుకూల ఫలితాలు తెచ్చే పరిణామం ఇది.

ఎవరు ఎన్ని స్థానాల్లో..

రెండు దశల నామినేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత, మొత్తం 25 లోక్‌సభ స్థానాల్లో బిజెపి 25 స్థానాల్లో పోటీ చేయగా, ఇండియా ఫోరంలో భాగంగా కాంగ్రెస్ 22, సిపిఎం 1, ఆర్‌ఎల్‌పి 1, బిఎపి 1 స్థానంలో పోటీ చేస్తున్నాయి. 2019లో ఎన్‌డిఎలో ఉన్న ఆర్‌ఎల్‌పి, రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ కూటమి నుంచి బయటకు వచ్చింది. ప్రస్తుత ఎన్నికల్లో ఇండియా ఫోరం తరపున ఆ పార్టీ బరిలోకి దిగింది.

సం'కుల' సమరం

1993 నుండి, రాజస్థాన్‌లో ప్రతి ఐదేళ్లకు బిజెపి, కాంగ్రెస్ మధ్య అధికారం మారుతూ వస్తోంది. ఈ కాలంలో కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్ మూడుసార్లు, బిజెపికి చెందిన వసుంధర రాజే రెండుసార్లు సిఎంగా ఉన్నారు. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బిజెపి వసుంధర రాజేను కాదని, ఆమె స్థానంలో భజన్‌లాల్ శర్మను ముఖ్యమంత్రిని చేశారు. దీంతో బిజెపిలో అంతర్గతంగా విభేదాలు నెలకొన్నాయి. జాట్, రాజ్‌పుత్, బ్రహ్మణ వంటి అగ్రవర్ణాలు, గుజ్జర్, యాదవ్, సంఘీ వంటి వెనుకబడిన తరగతుల సామాజిక వర్గాలు, మీనా వంటి షెడ్యూల్ తెగలు, ఎస్‌సి ఓటర్లు ఉన్నారు. జాట్లు రాజకీయాలను శాసిస్తారు. అందుకే ప్రధాన పార్టీలు బిజెపి, కాంగ్రెస్ ఆ సామాజిక వర్గానికే పగ్గాలు అప్పగిస్తాయి. జాట్ సామాజిక వర్గానికి చెందిన సతీష్ పునియా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా, గోవింద దోస్టార కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండేవారు. అయితే 2023 మార్చిలో బిజెపి సతీష్ పునియాను తొలగించి మరో అగ్రవర్ణానికి చెందిన సిపి జోషికి పార్టీ పగ్గాలు అందించింది. జాట్‌కు చెందిన జగదీప్ ధన్‌ఖర్‌ను బిజెపి ఉపరాష్ట్రపతి చేసింది. రాజస్థాన్ రాజకీయాలపై గుజ్జర్లు ప్రభావం చాలా ఎక్కువ ఉంటుంది. సాధారణంగా గుజ్జర్లు కాంగ్రెస్‌కి మద్దతుగా ఉంటారు. అయితే గుజ్జర్ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ సచిన్ పైలట్‌ను ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించడంతో అసెంబ్లీ ఎన్నికల్లో గుజ్జర్లు బిజెపికి ఓటు వేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గుజ్జర్లు మళ్లీ కాంగ్రెస్ వైపు వచ్చారు. అగ్ర వర్ణాల ఓటర్లు 18-20 శాతం ఉంటారు. ఒబిసిలు 45-50 శాతం ఉంటారు. రాష్ట్రంలోని ఒక్కొక్క ప్రాంతంలో కొన్ని సామాజిక తరగతుల ప్రభావం ఉంటుంది.

అటు ఇటయ్యారు

చురు సిట్టింగ్ ఎంపి రాహుల్ కస్వాన్‌కు బిజెపి టిక్కెట్టు ఇవ్వలేదు. దీంతో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ఆయనకు చురు టిక్కెట్టు ఇచ్చింది. ఇప్పుడు బిజెపి నుంచి పారాలింపిక్ ప్లేయర్ దేవేంద్ర ఝఝరియాను పోటీ చేస్తున్నారు. సొంత పార్టీపైనే రాహుల్ కస్వాన్ పోటీ చేస్తున్నారు. కోటాలో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రహ్లాద్ గుంజాల్ ను నిలబెట్టారు. గుంజాల్ ప్రస్తుతం బిజెపి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కూడా సొంత పార్టీపైనే పోటీ చేస్తున్నారు. దుంగార్‌పూర్-బన్స్వారా సీటులో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన మహేంద్రజిత్ మాల్వియాతో కాంగ్రెస్ తలపడుతోంది. మాల్వ్య కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరడంతో బిజెపి ఆయనను అభ్యర్థిగా నిలిపింది.

బరిలో ఆరుగురు ఎమ్మెల్యేలు

అల్వార్ నుంచి ఎమ్మెల్యే లలిత్ యాదవ్, దౌసా నుంచి మురారీ లాల్ మీనా, ఝుంఝును నుంచి బ్రిజేంద్ర ఓలా బరిలోకి దిగారు. నాగౌర్ లోక్‌సభ స్థానం నుంచి ఆర్‌ఎల్‌పి ఎమ్మెల్యే హనుమాన్ బెనివాల్, బన్స్వారా స్థానం నుంచి బిఎపి ఎమ్మెల్యే రాజ్‌కుమార్ రోట్ పోటీ చేస్తున్నారు. స్వతంత్ర ఎమ్మెల్యే రవీంద్ర భాటి కూడా బార్మర్-జైసల్మేర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.



ముక్కోణపు పోటీ

బార్మర్ లోక్‌సభ స్థానానికి బిజెపి కేంద్రమంత్రి కైలాష్ చౌదరి, కాంగ్రెస్ నుంచి ఉమేరామ్ బనివాల్, స్వతంత్ర ఎమ్మెల్యే రవీంద్ర సింగ్ భాటి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులకు సవాల్ విసిరారు. దుంగార్‌పూర్-బన్స్వారాలో బిజెపి తన అభ్యర్థిగా కాంగ్రెస్ మాజీ మంత్రి మహేంద్రజిత్ సింగ్ మాల్వియాను బరిలోకి దించగా, కాంగ్రెస్ అరవింద్ దామోర్‌కు టికెట్ ఇచ్చింది. బిఎపి ఎమ్మెల్యే రాజ్‌కుమార్ రోట్ పోటీలో ఉన్నారు. ఇక్కడ కూడా ముక్కోణపు పోటీ జరుగుతుంది.

తగ్గుతున్న స్వతంత్ర అభ్యర్థులు

- కార్పొరేటీకరణే కారణం

ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థుల పోటీ నానాటికీ తగ్గుతోంది. అందుక్కారణం ఎన్నికలు కార్పొరేటీకరణ కావడమే. అర్థ, అంగబలం ఉన్నవారే పోటీ చేసే పరిస్థితులు కల్పిస్తున్నారు. కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నారు. అధికారాన్ని అడ్డగోలుగా వాడుతున్నారు. దాంతో ఇండిపెండెంట్లు పోటీకి ముందుకురావట్లేదు. ప్రజాస్వామ్యంలో అందరికీ అవకాశాలుండాల్సి ఉండగా, డబ్బు ప్రభావంతో కొందరు మాత్రమే అందిపుచ్చుకునే పరిస్థితులు దాపురించాయి. దీంతో గెలుపు సంగతేమో పోటీకే భయపడుతున్నారు స్వతంత్రులు. 1952 తొలి సార్వత్రిక ఎన్నికల్లో అత్యధికంగా 36 మంది స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. 1991లో ఒకేఒక్క స్వతంత్ర ఎంపి గెలిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో నలుగురు స్వతంత్రులు గెలుపొందగా ఈసారి వారి సంఖ్య తగ్గిపోనుంది.

బిజెపి ఆకర్ష్

కర్ణాటక మండ్య నియోజకవర్గం నుంచి సుమలత అంబరీష్, మహారాష్ట్ర అమరావతి నుంచి నవనీత్ రవి రాణా, దాద్రా నగర్ హవేలీ నుంచి మోహన్‌బాయ్ దెల్కర్, అస్సాం కోక్రాజార్ నుంచి యబా కుమార్ శరానియా గెలుపొందారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేతో వివాదం పెట్టుకున్న నవనీత్‌ను పిలిచి బిజెపి టిక్కెట్ ఇవ్వడంతో ఆమె ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా కాకుండా బిజెపి నుంచి పోటీ చేయనున్నారు.

గతంలో సుమలతను బిజెపి బలపరిచినప్పటికీ ఆమె స్వతంత్రంగా పోటీ చేశారు. తాజాగా ఆమె బిజెపిలో చేరారు. కర్ణాటకలో మిత్రపక్షమైన జనతాదళ్ (సెక్యులర్)కు సీటు కేటాయించడంతో ఆమెకు చోటు దక్కలేదు. దీంతో మండ్యలో కాంగ్రెస్, జెడిఎస్ మధ్య పోటీ నెలకొంది. దాద్రా నగర్‌హవేలి నుంచి గెలిచిన స్వతంత్ర ఎంపి మోహన్ దెల్కర్ 2021లో వివాదాస్పద పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్నారు. దెల్కర్ మరణానంతరం మధ్యంతర ఎన్నికల్లో ఆయన సతీమణి కలాబెన్ శివసేన తరఫున బిజెపిపై గెలిచారు. ప్రస్తుతం కలాబెన్‌ను బిజెపిలో చేర్చుకుని ఆమెకు ఈ టిక్కెట్టును కేటాయించింది.

కోకరఝర్... స్పెషల్

అస్సాం కోకరఝర్ నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. 2009 మినహా 1977 నుంచి స్వతంత్ర అభ్యర్థులు మాత్రమే ఈ స్థానంలో ఎన్నికవుతున్నారు. షెడ్యూల్ కులాలకు ఈ సీటు రిజర్వు చేయబడింది. 1991లో 10వ లోక్‌సభలో ఒకేఒక్క స్వతంత్ర ఎంపి సత్యేంద్ర నాథ్ బ్రోమో చౌదరి కూడా కోకరఝర్ నుంచే ఎన్నుకోబడ్డారు. 1998 నుంచి 2004 వరకు ఈ నియోజకవర్గం నుంచి సన్సుమా కుంగూర్ స్వతంత్ర ఎంపిగా గెలిపొందారు. అయితే 2009లో ఆయన బోడో పీపుల్స్ ఫ్రంట్ నుంచి పోటీచేశారు. 2014, 2019 ఎన్నికల్లో కోకరఝర్ నుంచి నబా కుమార్ శరానియా స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నుకోబడ్డారు. శరానియా షెడ్యూల్ తెగ హోదాను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను గౌహతి హైకోర్టు కొట్టివేసింది.

బ్రిటీష్ హయాంలోనే ఓటు హక్కుకై వనిత పిడికిలి

పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించాలని ఏళ్లతరబడి మహిళా ఉద్యమ కార్యకర్తలు పోరాటం చేశారు. వారిలో సరోజినీ నాయుడు, ఎస్. అంబుజమ్మాళ్, అనిబిసెంట్, కమలాదేవి చటోపాధ్యాయ, మేరీ పూనెన్ లూకోస్, బేగం హస్రత్ మోహాని, సరళాబాయి నాయక్, ధన్వంతి రామారావు, ముత్తులక్ష్మీ రెడ్డి, మంగళమ్మాళ్ సదాసివియర్, హేరాబాయి టాటా ఉన్నారు. వీరంతా 19వ శతాబ్దంలో మద్రాసులోని అడియార్‌లో 'వుమెన్స్ ఇండియన్ అసోసియేషన్' అనే సంఘాన్ని స్థాపించారు. ఈ సంఘం ద్వారా మహిళలకు ఓటు హక్కు కల్పించాలని దేశమంతా విస్తృతమైన ప్రచారం చేశారు. వీరి డిమాండ్లను బ్రిటీష్ పార్లమెంటు ప్రజాప్రాతినిధ్య చట్టం 1918 ఆమోదించింది. 30 ఏళ్లకు పైబడిన మహిళలకు ఓటు హక్కు కల్పించింది. బ్రిటీష్ ప్రభుత్వంలో కేవలం ఓటు హక్కు కోసమే కాకుండా ఎన్నికల్లో పోటీ చేసేందుకు మహిళలు పోరాటం చేశారు. మాలతి పట్వర్ధన్ రాజకీయాల్లో లింగ సమానత్వం కోసం చట్టపరంగా పోరాటం చేశారు. ఆమె బాంబే, మద్రాస్ హైకోర్టులో పిటిషన్లు వేశారు. సౌత్‌బరో ఫ్రాంచైజ్ కమిటీ మోంటాగు చెమ్స్‌ఫోర్డ్ సంస్కరణల ప్రకారం ఎన్నికల నిబంధనల్లో మార్పు చేసింది. 1919-1929 మధ్య మహిళల పోరాటానికి జాతిపిత మహాత్మాగాంధీతోపాటు పలువరు స్త్రీవాదులు మద్దతు ఇచ్చారు. ఉద్యమాలు ఊపందుకోవడంతో మహిళలకు శాసనసభ సభ్యురాలిగా ఉండే హక్కును కల్పించే విధంగా ఎన్నికల నియమాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంట్ భారత ప్రభుత్వానికి అనుమతినిచ్చింది. దీంతో మొట్టమొదటిసారిగా ఉద్యమ కార్యకర్త అయిన కమలాదేవి ఛటోపాధ్యాయ 1926లో మద్రాస్ ప్రావిన్షియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి పోటీ చేశారు. ఆమె స్వల్ప తేడాతో ఓడిపోయారు. 1927లో జవహర్‌లాల్ నెహ్రూ పురుషులతో సమానంగా స్త్రీలకు ఎలాంటి షరతులు లేకుండా ఓటు హక్కు కల్పించాలని నివేదిక ఇచ్చారు. అలాగే రౌండ్ టేబుల్ సమావేశాల్లోనూ మహిళల ఓటు హక్కు వయో పరిమితిని తగ్గించాలని డిమాండ్లు ముందుకొచ్చాయి. దీంతో 21 ఏళ్లకు మహిళలకు ఓటు హక్కు కల్పించేలా సవరించారు. 1937లో జరిగిన ఎన్నికల్లో 10 మంది మహిళలు సాధారణ నియోజకవర్గాల నుంచి ఎన్నికయ్యారు, 41 మంది రిజర్వ్‌డ్ నియోజకవర్గాలకు, ఐదుగురు ప్రావిన్షియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లకు నామినేట్ అయ్యారు. కోట్లాది మహిళల ఉద్యమాల ఫలితం భారత దేశ స్వాతంత్ర్యానంతరం 1950లో పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కును కల్పిస్తూ రాజ్యాంగాన్ని రూపొందించారు. రాజ్యాంగంలోని 60 (1) సవరణ చట్టం 1989 21 ఏళ్ల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించింది.

- ఎలక్షన్ డెస్క్

- ఇక అంతా ఏఐ ప్రభావమే...!
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను విస్తృతంగా వినియోగిస్తున్న పార్టీలు
- ఓటర్లను ఆకర్షించేందుకు రకరకాల విన్యాసాలు

ఎన్నికల్లో కృత్రిమ మేధ!

2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో సెల్ఫీలు, హోలోగ్రాములకు ప్రాధాన్యత లభించింది. 2019 నాటికి ప్రచారంలో డిజిటల్ మీడియా వినియోగం అధికమైంది. ఇప్పుడు మనం తొలిసారిగా కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం చూపబోతోంది. పరిశోధనలకు, స్క్రిప్టు ప్రసంగాలకు ఈ పరిజ్ఞానాన్నే ఎక్కువగా వినియోగిస్తున్నారు. అందుకు రాజకీయ పార్టీలు నిపుణులను నియమించుకుంటున్నాయి. ఓ బృందం ఆరు గంటల్లో చేసే పనిని ఛాట్‌జీపీటీ కేవలం పది నిమిషాల్లో చేసేస్తోందని కోల్‌కతాకు చెందిన అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీ 'స్టాండర్డ్ పబ్లిసిటీ' యజమాని కల్యాణేశ్వర్ సర్కార్ చెప్పారు.

స్క్రిప్ట్ ప్రసంగాలను రూపొందించడం వల్ల సమయం ఆదా అవడమే కాదు. గ్రామీణ ప్రజల కోసం ఓ రాజకీయ పార్టీ ప్రసంగాన్ని రూపొందించాలని అనుకున్నదనుకోండి. దానిపై ముందుగానే ఛాట్‌జీపీటీ కసరత్తు చేస్తుంది. ప్రసంగించాల్సిన ప్రదేశం చరిత్ర ఏమిటి, అక్కడ ఎలాంటి ప్రజలు నివసిస్తారు, వారి నాయకులు ఎవరు, వారి సంస్కృతీ సంప్రదాయాలు ఎలా ఉంటాయి, మతపరమైన నమ్మకాల మాటేమిటి, వారిని వేధిస్తున్న ప్రధాన సమస్య ఏమిటి వంటి సమాచారాన్ని మొత్తం ఛాట్‌జీపీటీ సేకరిస్తుంది. ఎన్నికల ప్రచారంలో కృత్రిమ మేధను ఉపయోగించకపోతే అభ్యర్థులు ఏదో షరా మామూలు సాదాసీదా ప్రసంగాలను తయారు చేసుకుంటారు. అన్ని చోట్లా దానినే వల్లె వేస్తుంటారు. ఇప్పుడు దేశంలోని మారుమూల ప్రాంతంలో కూడా ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉంది. కాబట్టి ఎక్కడికక్కడ ప్రసంగాలను మారుస్తూ ఓటర్లను ఆకట్టుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఛాట్‌జీపీటీ ఎంతగానో ఉపకరిస్తుంది. అయితే తాము కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని ఉపయోగించడం లేదని బీజేపీ, మరికొన్ని పార్టీలు పైకి చెబుతున్నాయి. కొంత ఫీజు చెల్లిస్తే ఎవరైనా ఫిల్టర్‌ను కొనుగోలు చేయవచ్చునని, దాని ద్వారా స్క్రిప్టు ప్రసంగాలు రూపొందించవచ్చునని నిపుణులు అంటున్నారు. అనువాదాలకు సంబంధించి బీజేపీ ఇప్పటికే కృత్రిమ మేధకు సంబంధించిన పరికరాన్ని ఉపయోగిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కూడా తక్కువేమీ తినలేదు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆడియో సందేశాలను వివిధ భాషల్లోకి అనువదించేందుకు కృత్రిమమేధను ఉపయోగించుకుంటోంది.

తటస్థులే లక్ష్యంగా...

2022 ముందు వరకూ ఏఐని ఎవరూ ఊహించలేదు. ఇప్పుడు అంతా ఆ పరిజ్ఞానం మయమే. ఓటర్లలో రెండు రకాల వారుంటారు. ఎవరికి ఓటు వేయాలో ముందుగానే నిర్ణయించుకునే వారు ఒకరైతే నిర్ణయానికి రాలేకపోతున్న వారు మరొకరు. ఈ రెండో రకం ఓటర్లను ఏఐ లక్ష్యంగా చేసుకుంటుంది. వారి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పోస్టులను, లైకులు, కామెంట్లను పరిశీలిస్తుంది. ఆ తర్వాత వారిని ప్రభావితం చేసే ప్రయత్నం ప్రారంభిస్తుంది. అంతేకాదు...సమాచారాన్ని ఏఐ మదింపు చేస్తుంది. విజేతలెవరో జోస్యం చెబుతుంది. సామాజిక మాధ్యమాలలో కనిపించే ఒపీనియన్ పోల్స్‌లో ప్రవేశించి, ఫలితాన్ని తారుమారు చేస్తుంది కూడా.

ఫేక్ వీడియోలు కూడా...

అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే ఏఐ సాయంతో రూపొందించిన ఫేక్ వీడియోలు కూడా మనకు కన్పిస్తుంటాయి. ఉదాహరణకు కుమారుడు స్టాలిన్ నాయకత్వాన్ని కరుణానిధి ప్రశంసించడం వంటివి ఫేక్ వీడియోలే. ఏఐని మత కోణంలో కూడా ఉపయోగించుకుంటున్నారని నిపుణులు అంటున్నారు.

అడ్డుకోవడం కష్టమే

140 కోట్ల జనాభా ఉన్న భారత్‌లో ఫేక్ వార్తలు, కథనాలు నిప్పు కంటే వేగంగా వ్యాప్తి చెందుతాయి. వాటిని అడ్డుకోవడం అసంభవం. అలాంటివి తప్పనిసరిగా ఎన్నికలపై ప్రభావం చూపుతాయి. ఏఐతో ప్రమాదం ఉన్న దేశాల జాబితాలో భారత్ మొదటి స్థానంలో ఉన్నదని ప్రపంచ ఆర్థిక వేదిక రూపొందించిన గ్లోబల్ రిస్క్ నివేదిక తెలిపింది. రాబోయే రెండు సంవత్సరాలలో దుష్ప్రచార వ్యాప్తి పెరిగిపోతుందని హెచ్చరించింది. ఎన్నిక జరగడానికి 24 గంటల ముందు ఏదైనా నియోజకవర్గంలో ఓ తప్పుడు వీడియో ప్రచారంలోకి వస్తే దానిని కనిపెట్టడం కష్టమని, అది కచ్చితంగా ఓటింగ్‌పై ప్రభావం చూపుతుందని నిపుణులు తెలిపారు.

- ఎలక్షన్ డెస్క్

కలం బాణాలు

రాష్ట్ర ప్రయోజనాల కోసమే బిజెపి పొత్తు.. చంద్రబాబు

తాటిచెట్టు ఎక్కేరట
దూడగడ్డి కోసం
ఎపినే వంచించిన
బిజెపి సహవాసం

హోదాకే ఎగనామం
మొన్న వీరపోరాటం
అధికారం ఆశతోటి
మోడీకా దాసోహం?

వైనాట్ 175-వైసీపీ నినాదం

ఆశకైనా వుండొద్దా
జగనన్నా హద్దు
అన్నీ మాకేనంటూ
మరీ ఓవరొద్దు

కాస్త అటూఇటుగైనా
వచ్చేనా విజయం
హోరాహోరీ సమరం
కడదాకా సంశయం

పాకిస్థాన్ కోసం కాంగ్రెస్ ప్రణాళిక -బిజెపి

రాత్రి పగలు అదేపనిగ
మతోన్మాద భాష
హిందూ ముస్లిం పేరిట
విడగొట్టే ధ్యాస

పాకిస్థాన్ గోలేమిటి
ఎలక్షన్ల మోడీ
చరిత్రలో గాయాలను
కెలుకుట ఏం పాడి?

- తెర

ఒడిశా రాజకీయాల్లో ఇద్దరు తండ్రులు డైలమా



ఒడిశా రాజకీయాల్లో ఆసక్తికర సంఘటనలు నెలకొంటున్నాయి. కుమారుల ఎన్నికల విజయం కోసం ఇద్దరు తండ్రులు తపన పడుతున్నారు. అయితే తండ్రులు ఒకపార్టీలో ఉంటే.. కుమారులు మరో పార్టీలో పోటీ చేస్తున్నారు. దీంతో ఆ పార్టీ నిబంధనలు ఉల్లంఘించి మరీ తండ్రులు కుమారుల విజయం కోసం ప్రచారం చేయడం గమనార్హం. ఒడిశాలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ సీనియర్ సురేష్ చంద్ర రౌత్రేకి కాంగ్రెస్ పార్టీ ఇటీవల షోకాజ్ నోటీసులిచ్చింది. ఆ పార్టీ తరపున కాకుండా.. వేరే పార్టీ తరపున ప్రచారం చేయకూడదని ఆయనకు నోటీసులిచ్చింది. ఈ నోటీసులకు రౌత్రే తాను ఏ పార్టీ తరపున ప్రచారం చేయనని సమాధానమిచ్చారు. అయితే సమాధానమిచ్చిన మరుసటిరోజే ఆయన తన కుమారుడు విజయం కోసం ప్రజల్లోకి వెళ్లి గెలిపించమని అభ్యర్థించారు. ప్రత్యేకించి ఓ పార్కులో తన కుమారున్ని గెలుపు కోసం ప్రచారం చేశారు. రౌత్రే కుమారుడు మన్మత్ రౌత్రే బిజెపి పార్టీ టికెట్‌పై భువనేశ్వర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి దిగారు. కుమారుని గెలుపు కోసం కాంగ్రెస్‌ని కాదని.. ఆయన బిజెపి తరపున ప్రచారం చేస్తున్నారు.

బిజెపి నేత నాలుగుసార్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అయిన మోహపాత్ర కూడా తన కుమారుడు కోసం ప్రచారం చేస్తున్నారు. ఈయన కుమారుడు అరబింద మోహపాత్ర 2024 ఎన్నికల్లో పట్కురా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిజెడి (బిజు జనతా దళ్) టికెట్‌పై పోటీ చేస్తున్నారు.

కడపలో రాజకీయ కాక

- సీట్లు నిలబెట్టుకొనేందుకు వైసిపి పావులు
- కూటమికి తప్పని అభ్యర్థుల మార్పులు
- సానుభూతి ఎజెండాతో వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

వైఎస్ఆర్ జిల్లా ఏడు అసెంబ్లీ, కడప పార్లమెంటు స్థానాన్ని కలిగి ఉంది. కడప వైసిపి తరపున డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, టిడిపి తరపున ఆర్ మాధవి, కాంగ్రెస్ అభ్యర్థిత్వం తేలలేదు. కాంగ్రెస్ తరపున మాజీ మంత్రి ఖలీల్‌బాషా కుమారుడు సోహైల్, ప్రముఖ సంఘ సేవకుడు సలావుద్దీన్ పోటీ చేసే అవకాశం ఉంది. కడప అసెంబ్లీలో 2.72 లక్షల ఓటర్లలో 90 వేలు ముస్లిములు, 10 వేలు దూదేకుల ఓటర్లు మూడింట ఒక వంతుకుపైగా ఉన్నప్పటికీ ముస్లిమేతర టిడిపి అభ్యర్థి ఆర్ మాధవి నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది. కమలాపురంలో టిడిపి అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి, వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్‌రెడ్డి, సిపిఐ పోటీ చేసే అవకాశం ఉంది. టిడిపి తరపున బరిలో దిగుతున్న పుత్తా చైతన్యరెడ్డి స్థానంలో ఆయన తండ్రి పుత్తా నరసింహారెడ్డి బరిలో దిగుతారనే ఊహాగానాలు ఉన్నాయి. టికెట్ మాత్రం పుత్తా నరసింహారెడ్డి కుమారుడు చైతన్యరెడ్డికి కేటాయించారు. ఇటీవల చోటుచేసుకున్న ఫ్యాక్షన్ నేపథ్యంలో టిడిపి నాయకుడు కాశీభట్ల సాయినాథ్ శర్మ వైసిపిలో చేరడంతో చైతన్యరెడ్డికి ఎదురుగాలి వీచే అవకాశం ఉంది. మైదుకూరులో వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, టిడిపి తరపున టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతో గెలిచే అవకాశాలు ఉన్నాయి. ప్రొద్దుటూరులో వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి, టిడిపి తరపున సీనియర్ నాయకులు నంద్యాల వరద రాజులరెడ్డి బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తరపున అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఎదురుగాలి ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఇటీవల ఎమ్మెల్యే బంగారు దుకాణాలపై ఐటి దాడులు చేయించారనే ఆరోపణల నేపథ్యంలో వ్యాపారులందరూ టిడిపి వైపు మొగ్గు చూపిస్తున్నారు. అయినప్పటికీ హోరాహోరీ పోటీ ఎదుర్కోవాల్సి వస్తోంది. జమ్మలమడుగులో వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంవి సుధీర్‌రెడ్డి, కూటమి తరపున బిజెపి నుంచి మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

ఓటు బదిలీపైనే కూటమి ఆశ

టిడిపి ఓట్ల బదిలీపై జయాపజయాలు ఆధారపడి ఉన్నాయని చెప్పొచ్చు. ఫ్యాక్షన్ నియోజకవర్గమైన జమ్మలమడుగులో వైసిపి, టిడిపి గుర్తులపైనే ఓటర్లకు అవగాహన ఉంది. ఉన్నఫళంగా టిడిపికి వృద్ధులు, వీరాభిమానుల ఓట్లు బదిలీ తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఫలితంగా కమలం గెలుపునకు తీవ్రంగా శ్రమించాల్సి రావొచ్చు. టిడిపి టికెట్ విషయంలో చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, బాబాయ్ మాజీ మంత్రి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డితో చివరి వరకు పోటీ పడ్డారు. కూటమి బిజెపి అసెంబ్లీ అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డి పేరును ప్రకటించింది. అయినప్పటికీ భూపేష్‌రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలనే ఊగిసలాట నడుస్తోంది. పులివెందులలో వైసిపి తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టిడిపి తరపున బి.టెక్ రవి, కాంగ్రెస్ తరపున మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయనే ఊహాగానాలు ఉన్నాయి. వేంపల్లి మండల టిడిపి నాయకులు ఎస్‌వి సతీష్‌రెడ్డి వైపిపిలో చేరారు. టిడిపి అభ్యర్థి బి.టెక్ రవి గెలవలేనిపక్షంలో వైఎస్ జగన్ మెజార్టీని గణనీయంగా తగ్గించాలనే ప్రయత్నం జరుగుతోంది. ఇందులో ఎంతో కొంత సఫలత ఉండొచ్చు. ఎందుకంటే కాంగ్రెస్ తరపున పార్లమెంటుకు వైఎస్ షర్మిల, అసెంబ్లీ స్థానానికి వివేకా సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మ పోటీ చేసే అవకాశాలు ఉండటంతో సెంటిమెంట్ ఓటు ఏ మేరకు నమోదవుతుందో వేచి చూడాల్సి ఉంది.

బద్వేల్ రిజర్వుడ్ నియోజకవర్గంలో వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే సుధ, కూటమి తరపున బిజెపి అభ్యర్థి రోశన్న పోటీ చేయనున్నారు. బలమైన వైసిపి అభ్యర్థిని కూటమి తరపున బరిలో దిగుతున్న కొత్త అభ్యర్థి రోశన్నకు ఏ మేరకు సాధ్యమవుతుందో తెలియడం లేదు. కాంగ్రెస్ తరపున గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి మూడు వేల ఓట్లకుపైగా సాధించిన ఎన్‌డి విజయజ్యోతి నిలబడుతున్నారు.

ఎజెండాపైకి వివేకా హత్య

వైసిపి, కూటమి అభ్యర్థులిద్దరిలో మెరుగైన వ్యక్తిత్వం కావడంతో కాంగ్రెస్ ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పొచ్చు. పార్లమెంటుకు వైసిపి తరపున సిట్టింగ్ ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, టిడిపి తరపున చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ తరపున వైఎస్ షర్మిల పోటీ చేయనున్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బద్వేల్ మినహా మిగిలిన కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు. కాంగ్రెస్ తరపున కడప పార్లమెంటు బరిలో పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పోటీ చేస్తుండటమే కారణమని తెలుస్తోంది. అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలో బలమైన అభ్యర్థులు బరిలో నిలిపితే ఓటింగ్ పెరిగే అవకాశం ఉందనే ఉద్దేశం, ఇండియా ఫోరంలో చర్చించి సముచిత నిర్ణయం తీసుకోవాలనే ఉద్దేశంతో వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ నుంచి పోటీ

- చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్

ప్రజాశక్తి-వేటపాలెం (బాపట్ల జిల్లా)

టిడిపి, వైసిపిలతో తనకు ఎలాంటి విభేదాలూ లేవని, తన వ్యక్తిగత అభిప్రాయాలు, నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి చీరాల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్ళపల్లిలోని తన స్వగృహంలో కార్యకర్తలు, నాయకులతో ఆయన మంగళవారం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. తన ఉద్దేశాన్ని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ..టిడిపిలో తనకు సముచిత స్థానం అందించి ఎంతో గౌరవించారని, అది చిరస్థాయి వరకు నిలిచి ఉంటుందన్నారు. పర్చూరు వైసిపి అభ్యర్థిగా ఉండాలని సిఎం జగన్ పట్టుబట్టారని, చీరాల నియోజకవర్గ అభివృద్ధి దృష్ట్యా నాయకులు, కార్యకర్తల నిర్ణయం మేరకు తాను వైసిపికి రాజీనామా చేశానని అన్నారు. తాను రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీతోనే ప్రయాణిస్తూ నియోజకవర్గంలో పోటీ చేస్తానని చెప్పారు. త్వరలోనే పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిలతో సంప్రదించి చీరాల నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి అధికారికంగా పార్టీలో చేరతానని తెలిపారు. పోలీసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. చిన్న పొరపాటు చేసినా వారు ఉద్యోగాలు వదులుకోవాల్సి వస్తుందని అన్నారు. సభలో వేటపాలెం, చీరాల జడ్‌పిటిసి సభ్యులు బండ్ల తిరుమల దేవి, ఆకురాతి పద్మిని పాల్గొన్నారు.

కురుపాంలో త్రిముఖపోటీ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇవన్నీ అరకు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. ఈ నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ వైసిపికి చెందినవారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ వైసిపి వారినే అభ్యర్థులుగా ప్రకటించింది. మూడు నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులను ఖరారు చేసింది. పాలకొండ నియోజకవర్గం జనసేనకు కేటాయించారు. పాలకొండ, పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేశారు. కురుపాంలో సిపిఎం పోటీచేయడంతో త్రిముఖపోటీ ఏర్పడింది. మిగిలిన మూడు చోట్ల ప్రధాన పోటీ టిడిపి, వైసిపి మధ్య ఉంటుంది.

వైసిపి వర్సెస్ టిడిపి

పార్వతీపురం వైసిపి అభ్యర్థిగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఉన్నారు. గెలుపే లక్ష్యంగా చాలా కాలం నుంచి జనాలకు తాయిలాలు అందిస్తున్నారు. పార్టీలో ఆయన్ని బంహిరంగంగా విభేదించేవారు లేకపోవడంతో నియోజకవర్గంలో ఏకచత్రాధిపత్యం సాగుతోంది. ఐదేళ్లలో రూ.కోట్లకు పడగలెత్తారనే ప్రచారం ఉంది. కొందరు నాయకులు అభ్యర్థి తీరుపై లోపల్లోపల గుర్రుగానే ఉన్నారు. టిడిపి నుంచి కీలక నాయకులకు ఆయనతో లాలూచీ వ్యవహారాలు ఉన్నాయి.

టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర రాజకీయాలకు కొత్త. సాలూరు నియోజకవర్గంలో వైసిపి తరపున స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర తిరిగి ఆ పార్టీ తరపున పోటీచేస్తున్నారు. ఆయన గతంలో ఇక్కడి నుంచి నాలుగు సార్లు విజయం సాధించారు. పార్టీలో టికెట్ కోసం పోటీ పడేవారూ లేరు. కొంతమంది నాయకులతో అంతర్గత విభేదాలున్నా చక్కబెట్టుకుంటున్నారు. టిడిపి తరపున పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి పోటీలో ఉన్నారు. కులవివాదంతో పోటీ అర్హత కోల్పోయిన ఆర్‌పి భంజ్‌దేవ్ ప్రతి ఎన్నికల్లోనూ ప్రత్యేక గ్రూపును నడుపుతుండడంతో టిడిపి నష్టాన్ని చూడాల్సి వస్తోంది. అధిష్టానం ఈ గ్రూపులను ఒకటి చేశాయి. ఆర్థిక వనరులు పెద్దగా లేకపోవడంతో సంధ్యారాణి పార్టీపైనే ఆశలు పెట్టుకున్నారు.

కురుపాంలో ముక్కోణం

కురుపాంలో వైసిపికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప-శ్రీవాణి ఆ పార్టీ తరపున పోటీలో ఉన్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో ఎమ్మెల్యేపై తీవ్రంగా ఆగ్రహిస్తున్నారు. శ్రీవాణిపై అసంతృప్తి ఉన్నప్పటికీ, దాన్ని టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి అనుకూలంగా మలుచుకోలేకపోతున్నారు. దీనికితోడు గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దత్తి లక్ష్మణరావు కొంతమంది గిరిజనేతర నాయకులతో ఒక గ్రూపును నడుపుతున్నారు.

ఎన్నికలు దగ్గరపడుతున్నప్పటికీ వీరు కలవలేదు. టిడిపి తరపున అత్యంత శక్తిమంతమైన నేతగా వున్న మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు వృద్ధాప్యంలో వున్నారు. గతంలో టిడిపి తరపున తన మేనల్లుడు జనార్ధన్ థాట్రాజ్ పోటీలో ఉండడం వల్ల పుష్ప-శ్రీవాణిని ఢీకొట్టేలా పనిచేశారు. ఈసారి విజయరామరాజు కుటుంబీకులు పోటీలో లేరు. అంతర్గతంగా ఆయన కోడలు పుష్పశ్రీవాణికి సహకరించే అవకాశాలు ఉన్నాయి. అందుకు తగ్గట్టే విజయరామరాజు కూడా ఇప్పటికీ టిడిపి కేడర్‌కు దిశానిర్దేశం చేయలేదు. ఇదే నియోకవర్గం నుంచి సిపిఎం రంగంలోకి దిగుతోంది. సిపిఎం అభ్యర్థిగా మండంగి రమణ పోటీలో ఉన్నారు. నాగూరు కేంద్రంగా వున్న ఇదే నియోజకవర్గంలో 2004లో సిపిఎం విజయం సాధించింది. నాటి నుంచి జనాన్ని అంటిపెట్టుకుని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసింది. ఈ నేపథ్యంలో కురుపాంలో త్రిముఖ పోటీ నెలకొంది.

వైసిపి, టిడిపిలో విభేదాలు

పాలకొండలో వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే విశ్వసరాయ కళావతి ఉన్నారు. ఈమె 2009లో ప్రజారాజ్యం తరపున పోటీచేసి ఓడిపోయారు. ఆ తరువాత వరుసగా రెండు సార్లు వైసిపి తరపున గెలిచారు. టిడిపి నుంచి ఇటీవల జనసేన పార్టీలో చేరిన నిమ్మక జయ కృష్ణకు ఆ పార్టీ టికెట్ ప్రకటించింది.

ఇటీవల టిడిపి నుంచి జనసేనలోకి వెళ్లిన తేజోవతి కూడా టికెట్ ఆశించారు. వైసిపికి చెందిన స్థానిక ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబు, ఎమ్మెల్యే కళావతికి మధ్య విభేదాలున్నాయి.

అరకు పార్లమెంటు పరిధిలోనే..

పార్వతీపురం మన్యం జిల్లా అంతా అరకు పార్లమెంటు పరిధిలోనే ఉంది. వైసిపి అభ్యర్థిగా తనూజారాణి, కూటమి ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎంపి కొత్తపల్లి గీత, ఇండియా ఫోరం తరపున సిపిఎం అభ్యర్థి అప్పలనర్స పోటీ చేస్తున్నారు. గతంలో ఇదే స్థానం నుంచి ఎంపిగా గెలిచిన గీతపై మన్యం జిల్లా వ్యాప్తంగా వ్యతిరేకత ఉంది. వ్యతిరేక ఓట్లు సిపిఎంకు అనుకూలంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపితో సిపిఎం పోటీపడుతోంది.

ఆ ప్రాంత ప్రజానీకం తీర్పు

రాష్ట్ర ప్రజల నాడికి దర్పణం..

- గత 40 ఏళ్లుగా అక్కడ గెలిచిన పార్టీదే రాష్ట్రంలో అధికారం
- కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అటు సినిమా అయినా, ఇటు రాజకీయమైనా ఆ ప్రాంత వాసులు ఆదరిస్తే అది పక్కా హిట్. గత నాలుగు దశాబ్దాలుగా రాజకీయానికైనా, సినిమాకైనా అక్కడి ప్రజానీకం ఇస్తున్న తీర్పే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిబింబిస్తూ వస్తోంది. అక్కడి ప్రజల నాడే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజల నాడికి దర్పణంగా నిలుస్తూ ఉంటోంది. ఏదైనా ఒక కొత్త సినిమా విడుదల అయితే నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు ఇక్కడి ప్రజల రెస్పాన్స్‌నే మొదటిగా తీసుకుని ఆ సినిమా హిట్టా? ఫట్టా? అని నిర్ణయించేవారు. ఈ మల్టీఫ్లెక్స్‌లు, శాటిలైట్ స్క్రీనింగ్ రాకముందు వరకూ ఇక్కడి ప్రేక్షకుల ఆదరణనే పరిగణనలోకి తీసుకునేవారు. ఇక రాజకీయపరంగానూ ఆ ప్రాంత ప్రజలు ఇచ్చిన తీర్పును బట్టే రాజ్యాధికారం నిర్ణయమతుందంటే ఎటువంటి సందేహం లేదు. అంతటి విశిష్ట లక్షణం కలిగిన ప్రాంతమే కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం-పెడన ఏరియా. పేరుకు రెండు నియోజకవర్గాలు అయినప్పటికీ, ఈ రెండు ప్రాంతాలు అటు భౌగోళికంగా, ఇటు సాంస్కృతికంగా, చారిత్రకంగా, చైతన్యపరంగా ఒకటే. అందుకే ఇక్కడి ప్రజలు ఇచ్చే తీర్పులు ఎప్పుడూ ఒకేలా ఉంటాయి. 1983లో టిడిపి

అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకు ఈ రెండు నియోజకవర్గాల ప్రజలు ఇచ్చిన తీర్పులో ఎటువంటి బేధమూ కనపడదు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మల్లేశ్వరం నియోజకవర్గం పెడన నియోజకవర్గంగా మార్పు చెందింది. ఇక్కడి ప్రజలు ఆయా నియోజకవర్గాల్లో టిడిపిని గెలిపిస్తే.. రాష్ట్రంలో టిడిపి అధికారం చేజెక్కించుకుంటుంది. కాంగ్రెస్‌ను గెలిపించినా లేదా వైసిపిని గెలిపించినా రాష్ట్ర వ్యాప్తంగా వాటి ప్రభంజనమే ఉంటుంది.

అందరిదీ ఒకటే అభిప్రాయం

మచిలీపట్నం, పెడన నియోజకవర్గంలో ఎక్కువగా ఉండే ఓట్లు కాపులు (ఒసి), గౌడ, మత్స్యకార, ఎస్‌సి. వీరితోపాటు యాదవ, వైశ్యులు, ముస్లిములు, ముదిరాజ్, దేవాంగ, పద్మశాలి ఓట్లూ అధికంగానే ఉంటాయి. ఒక విధంగా చెప్పాలంటే ఇక్కడ ఒక్క సామాజిక వర్గం అనే డామినేషన్ లేకుండా అన్ని తరగతుల ప్రజలూ ఉన్నారు. అయితే ఈ రెండు నియోజకవర్గాల్లో పార్టీలు నిలబెట్టే అభ్యర్థులు ప్రధానంగా కాపులు, బిసిలు.

మచిలీపట్నం/ పెడన నియోజకవర్గంలో గెలిచిన పార్టీ

సంవత్సరం	పార్టీ
1983	టిడిపి
1985	టిడిపి
1989	కాంగ్రెస్
1994	టిడిపి
1999	టిడిపి
2004	కాంగ్రెస్
2009	కాంగ్రెస్
2014	టిడిపి
2019	వైసిపి

మచిలీపట్నంలో కాపులు-మత్స్యకారుల అభ్యర్థుల మధ్య పోటీ ఉంటుండగా, పెడనలో కాపు-గౌడ సామాజిక తరగతులకు చెందిన అభ్యర్థుల మధ్య పోటీ ఉంటోంది. మరోవైపు ఈ రెండు నియోజకవర్గాల్లో ఎక్కువ శాతం చేతివృత్తిదారులు, రోజువారీ కూలీలు. దీంతో ఈ రెండు నియోజకవర్గాల ప్రజలు ఇచ్చే తీర్పే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల్లో ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఈ క్రమంలోనే రాబోయే ఎన్నికల్లోనూ ఇక్కడ విజయకేతనం ఎగురవేయాలని టిడిపి-వైసిపి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి.

రాజధాని రభస - 1955 ఎన్నికలు

మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర ప్రాంతం 1953 అక్టోబరు 1న విడిపోయి ఆంధ్రరాష్ట్రంగా అవతరించింది. 1952లో ఎన్నికలు జరిగాక సాధారణంగా ఐదేళ్ల పూర్తయ్యాక అంటే 1957లో ఎన్నికలు జరగాలి. కానీ కొత్త రాష్ట్రం ఏర్పడిన దరిమిలా.. అంతకుముందు మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రప్రాంతం నుంచి ఎన్నికైన శాసనసభ్యులతోనే (కొత్తగా ఎన్నికలు జరపకుండా) ఆంధ్రరాష్ట్ర ప్రత్యేక ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. కర్నూలును రాజధానిగా చేసుకున్నారు. తరువాత కాలంలో ఆంధ్రరాష్ట్రం రాజధాని ఎక్కడుండాలనే దానిపై శాసనసభలో పెద్ద దుమారమే రేగింది. రాష్ట్రం మధ్యలోని విజయవాడ-గుంటూరు మధ్య రాజధానిని ఏర్పరచాలని కమ్యూనిస్టు పార్టీ తమ విధానంగా ప్రకటించింది. ఆ మేరకు కమ్యూనిస్టు శాసనసభా పక్షం విజయవాడ-గుంటూరు మధ్యనే రాజధాని ఏర్పాటు చేయాలని పట్టుపట్టింది. కానీ రాజధాని విషయంలో అధికార కాంగ్రెస్ శాసనసభా పక్షం చీలిపోయింది. ఆ పార్టీ శాసనసభ్యులు కొందరు విశాఖలో పెట్టాలని, మరికొందరు కర్నూల్లోనే ఉంచాలని ప్రాంతీయతత్వంతో చీలిపోయారు. అంతకుముందు విజయవాడ-గుంటూరు మధ్యనే రాజధాని ఏర్పాటు చేయాలనే విషయమై శాసనసభలో ఓటింగ్ జరిగింది. కమ్యూనిస్టులు ప్రతిపాదించిన విజయవాడ-గుంటూరు మధ్య రాజధాని అంశమే నెగ్గింది. అయితే దీనికి అనేక భాష్యాలు తీసి చివరికి విశాఖలోనే పెట్టాలనే ప్రతిపాదనను కాంగ్రెస్ కొత్తగా ముందుకు తెచ్చింది. కాంగ్రెస్ వారితోపాటు మిత్రపక్షాలైన కృషికార్ లోక్ పార్టీ (కెఎల్‌పి), ప్రజాపార్టీ (పిపి) వంటివి మద్దతు పలికాయి. ఈ దశలో కాంగ్రెస్ వారు మధ్యంతర ఎన్నికలకు మొగ్గారు. ఫలితంగా 1957లో జరగాల్సిన ఎన్నికలు 1955లోనే జరిగాయి.

కమ్యూనిస్టు పార్టీకి 33 శాతం ఓట్లు.. 15 సీట్లు

1955 ఫిబ్రవరి 11న ఎన్నికలు జరిగాయి. 167 ఏకసభ్య నియోజకవర్గాలు, 29 ద్విసభ్య నియోజకవర్గాలు కలిపి 196 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 1952నాటి అనుభవాలతో ఉన్న కాంగ్రెస్ తనకు బలమైన సవాల్ విసిరిన కమ్యూనిస్టులను ఎలాగైనా ఓడించేందుకు కంకణం కట్టుకుంది. దుష్ప్రచారాలు, అల్లర్లు వంటి వాటితో ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. కృషికార్‌లోక్

బెజవాడ గోపాలరెడ్డి


నీలం సంజీవరెడ్డి

పుచ్చలపల్లి సుందరయ్య

పార్టీ (కెఎల్‌పి)ని, ప్రజా పార్టీ (పిపి)ని, ప్రజా సోషలిస్టు పార్టీ (పిఎస్‌పి)ని, స్వతంత్రులను తమ మిత్రులుగా చేసుకుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 142 స్థానాలకు పోటీ చేసి 119 స్థానాలు గెలుపొందింది. 39.35 శాతం ఓట్లను సంపాదించింది. కమ్యూనిస్టు పార్టీ ఎవరితోనూ పొత్తు లేకుండా 169 స్థానాలకు పోటీ చేసి 15 స్థానాల్లో విజయం సాధించింది. 31.13 శాతం ఓట్లు సంపాదించింది. ఈ రెండు పార్టీల మధ్య కేవలం 8 శాతం ఓట్లే తేడా ఉన్నా.. సీట్ల సంఖ్యలో భారీగా తేడా వచ్చింది.

వెల్లడైన ఎన్నికల లోపభూయిష్టత

ఎన్‌జి రంగా నేతృత్వంలోని కృషికార్ లోక్‌పార్టీ (కెఎల్‌పి) 37 స్థానాలకు పోటీ చేసి 22 స్థానాలను, 6,25,827 ఓట్లు (7.26 శాతం) సంపాదించింది. ఇక్కడే ప్రజాస్వామ్య ఎన్నికల విధాన లోపభూయిష్టతను వెల్లడిచేసింది. కేవలం 6 లక్షల 25 వేల ఓట్లు తెచ్చుకున్న కెఎల్‌పికి 22 స్థానాలు వచ్చి, 26 లక్షల 85 వేల ఓట్లు తెచ్చుకున్న కమ్యూనిస్టు పార్టీకి కేవలం 15 స్థానాలు మాత్రమే వచ్చాయి. ప్రజాస్వామ్యంలో మైనారిటీ ఓట్లతోకూడా మెజారిటీ ఓట్లు సంపాదించొచ్చని తేటతెల్లమైంది. ఇక ప్రజా సోషలిస్టు పార్టీ (పిఎస్‌పి) 45 స్థానాలకు పోటీ చేసి 13 స్థానాలను గెలుచుకుంది. ఈ పార్టీకి 4,81,666 ఓట్లు (5.58శాతం) వచ్చాయి. ప్రజా పార్టీ (పిపి) 12 స్థానాలకు పోటీ చేసి 5 సీట్లలో నెగ్గింది. 2,40,888 ఓట్లు (2.79 శాతం) సంపాదించింది. ఇండిపెండెంట్లు 177 స్థానాల్లో పోటీ చేశారు. 22 స్థానాల్లో గెలిచారు. 11,88,887 ఓట్లు (13.78శాతం) సాధించారు. భారతీయ జనసంఘం (నేటి బిజెపి)ఎన్నికల్లో ఎలాంటి ప్రభావమూ చూపలేకపోయింది. ఈ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో కృషికార్ లోక్‌పార్టీ, ప్రజా పార్టీ, ప్రజా సోషలిస్టు పార్టీలు ఎంతో ప్రభావం చూపాయి. కెఎల్‌పి పక్షాన గౌతు లచ్చన్న (సోంపేట), కొత్తపల్లి పున్నయ్య (మాజీ స్పీకర్ ప్రతిభా భారతి తండ్రి), పిఎస్‌పి పక్షాన కుసుం గజపతిరాజు, పూసపాటి విజయరామ గజపతిరాజు, కాంగ్రెస్ పక్షాన నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, వేముల కూర్మయ్య, పేట బాపయ్య, చల్లపల్లి రాజా, ఎంఆర్ అప్పారావు తదితర ప్రముఖులు గెలుపొందారు. కమ్యూనిస్టు పార్టీ పక్షాన ఆ పార్టీ అగ్ర నేత పుచ్చలపల్లి సుందరయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, వెల్లంకి విశ్వేశ్వరరావు, గుజ్జుల యల్లమందారెడ్డి తదితర నేతలు గెలుపొందారు.

ముఖ్యమంత్రిగా బెజవాడ గోపాలరెడ్డి, ప్రతిపక్ష నేతగా పుచ్చలపల్లి సుందరయ్య

ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రిగా బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిగానూ, పుచ్చలపల్లి సుందరయ్య ప్రతిపక్ష నాయకుడుగానూ ఎన్నికయ్యారు. 1955లో ఎన్నికలై ఏడాది గడిచాక 1956 నవంబరులో తెలంగాణాను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. దీంతో ఆంధ్ర రాష్ట్రం పేరును 'ఆంధ్రప్రదేశ్'గా మార్చారు. 'విశాలాంధ్ర'గా పేరు పెట్టాలని శాసనసభ్యులు హెచ్చుమంది పార్టీలకు అతీతంగా కోరినా కాంగ్రెస్ పార్టీ 'ఆంధ్రప్రదేశ్' అనే పేరు పెట్టడానికే మొగ్గు చూపింది. కారణం కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' ఏర్పాటు కావాలనే నినాదనం ఇవ్వడమే. భాషా ప్రాతిపదికగా పరిసర రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న తెలుగువారందరినీ ఏకం చేసి రాష్ట్రం ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేసిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత కాంగ్రెస్ మళ్లీ కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేసింది. నీలం సంజీవరెడ్డి 1956 నవంబరు 1 నుంచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈసారి కూడా పుచ్చలపల్లి సుందరయ్యే ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నారు. తెలంగాణకు చెందిన 85 ఏకసభ్య, 19 ద్విసభ్య శాసనసభ సీట్లను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. దీంతో 1957లో ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగమైన తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకంగా ఎన్నికలు జరపాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో భాగమైన తెలంగాణాకు చెందిన శాసనసభ సీట్లు 104 అయ్యాయి. తెలంగాణ ప్రాంతానికి 1957లో ప్రత్యేకంగా ఎన్నికలు జరిపించాల్సి వచ్చినందున ఆ ప్రజా ప్రతినిధుల కాలపరిమితి ముగిసేవరకూ ఆగి 1962లో ఎన్నికలు జరిపారు. ఈ కారణంగా ఆంధ్ర ప్రాంత ప్రజాప్రతినిధుల పదవీ కాలం మరో రెండేళ్లు కొనసాగింది.

1955 ఎన్నికల్లో బలాబలాలు (మొత్తం సీట్లు 196 ఏకసభ్య, ద్విసభ్య కలిపి)

పార్టీ పోటీ గెలుపు ఓట్లుశాతం

పార్టీ	పోటీ	గెలుపు	ఓట్లు	శాతం
కాంగ్రెస్	142	119		39.13
సిపిఐ	169	15	26,85,251	31.13
కెఎల్‌పి	37	22	6,25,827	7.26
పిఎస్‌పి	45	13	4,81,666	5.58
పిపి	12	05	2,40,884	2.79
స్వతంత్రులు	170	22	11,88,887	13.78

సంపాదకీయం

పర్యావరణ పరిరక్షణ..

వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని రాజ్యాంగంలో ప్రత్యేక ప్రాథమిక హక్కుగా, మానవ హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించడం ముదావహం. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, శక్తులు, సంస్థలకు ఈ తీర్పు ఎంతో ఊతం అందిస్తుంది. పర్యావరణవేత్తలకు సుప్రీం తీర్పు ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. వాతావరణ మార్పుల వల్ల విధ్వంసం, నష్టం ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతోంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద కాలుష్య దేశంగా మనదేశం ఉంది. ప్రతి భారతీయుడి జీవిత కాలంలో 5.3 సంవత్సరాలు తగ్గిపోతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందంటే మనందరిపై ప్రభావం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. కార్పొరేట్ల దురాశ, పర్యావరణ అంశాలను ఏమాత్రం పట్టించుకోని కేంద్రప్రభుత్వ తీరు ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

గుజరాత్, రాజస్థాన్‌లో ప్రకృతి సిద్ధంగా జీవిస్తూ, అంతరించిపోతున్న వాటిలో తీవ్రత అధికంగా ఉన్న బట్టమేక పక్షి (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ - జిఎస్‌టి), లెస్సర్ ఫ్లోరికాన్ జాతుల ఆవాసాల్లో విమాన మార్గాలు, విద్యుత్ పంపిణీ లైన్లు ఏర్పాటు చేయడంపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. వాతావరణ మార్పులు, కాలుష్యం తదితర కారణాలతోపాటు అవి ఎగిరే మార్గాల్లో ఉన్న అధిక ఓల్టేజితో కూడిన ఓవర్‌హెడ్ ట్రాన్స్‌మిషన్ లైన్లు వాటి క్షీణతకు ప్రదాన కారణం.

సమానత్వ హక్కును కల్పించే రాజ్యాంగంలోని 14వ అధికరణ, జీవించే హక్కును కల్పించే 21వ అధికరణ ఎంతో ప్రాధాన్యత కలిగినవి. స్వచ్ఛమైన పర్యావరణం లేకపోతే ఈ రెండు హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుంది. వాతావరణ మార్పులు, పర్యావరణ క్షీణత వల్ల ఆహార కొరత, తాగునీటి వనరులకు ప్రమాదం ఏర్పడితే తొలి ముప్పును ఎదుర్కొనేది నిరుపేదలే. ఈ విధంగా వాతావరణ మార్పులకు, మానవ హక్కులకు మధ్య ఎంతో సంబంధం ఉంది. పర్యావరణం, ఆరోగ్యానికి సంబంధించిన హక్కులు హరించుకుపోతే జీవన హక్కు, వ్యక్తిగత సమగ్రత, ఆరోగ్యం, నీరు, గృహ నిర్మాణం, సమాచార హక్కు, భావ వ్యక్తీకరణ హక్కు, ప్రాతినిధ్య హక్కు... ఇలా ఎన్నో హక్కులకు చెల్లుచీటీనే.

వాతావరణ మార్పులు మనదేశంసహా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పరిణామాలకు కారణమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అసాధారణ రీతిలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో తుపానులు, వరదలు వంటి విపత్తుల్లో చిక్కుకుంటున్నాయి. భూతాపాన్ని నియంత్రించడం ద్వారానే ఈ తరహా ప్రమాదాలను రూపుమాపగలమని నిపుణులు చెబుతున్నారు. కార్పొరేట్ల అత్యాస, లాభాల కోసం పోటీ దీనికి ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఒక అధ్యయనం ప్రకారం గత ఏడాది వాతావరణ విపత్తుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా 12 వేల మంది మరణించారు. అమెరికాకు చెందిన జార్జిటౌన్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన నివేదిక ప్రకారం గత 20 ఏళ్లలో వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా 40 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు.

పారిశ్రామిక విప్లవపు పూర్వ సగటు కంటే భూమి దాదాపు 1.2 డిగ్రీల సెల్సియస్ వేడెక్కింది. భూ ఉష్ణోగ్రతలో చోటుచేసుకునే స్వల్ప మార్పు కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. ధనిక దేశాలు, ఆ దేశాల్లోని కార్పొరేట్లు వీటిని ఏ మాత్రం ఖాతరు చేయకుండా వాతావరణ విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. పారిస్ వాతావరణ సదస్సు నిర్దేశించిన రెండు డిగ్రీల సెల్సియస్‌కు భూతాపాన్ని పరిమితం చేయాలన్న లక్ష్యాన్ని అందుకోవడం ప్రశ్నార్థకంగా మారింది. అమెరికా లాంటి ధనిక దేశాలే అందుకు మోకాలడ్డుతున్నాయి. 1.2 డిగ్రీల సెల్సియస్‌కే ప్రకృతి ఆగ్రహం కారణంగా చోటుచేసుకున్న పరిణామాలను చూస్తున్నాం. ఇది మరింత పెరిగితే జరిగే విపరిణామాలను తట్టుకోవడం అసాధ్యం. అటువంటి దుస్థితి రాకుండా ఉండాలంటే లాభార్జనకన్నా, విశ్వ మానవ శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించడమే మార్గం. సుప్రీం నిర్దేశించినట్లు వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావాలపై పోరాటం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు, మానవ హక్కు. వాటిని కాపాడుకునే ఉద్యమంలో అందరూ భాగస్వాములవ్వాలి.

మంచి మాట

ఇవాళ కావాల్సింది సామ్రాజ్యవాదపు బహుళజాతి సంస్కృతి కాదు. ప్రజా బాహుళ్య బహుళ సంస్కృతి. భిన్న సంస్కృతుల సమాహారం ఎప్పుడూ సమిష్టి కృషి ద్వారానే పరిపుష్టం అవుతుంది. గుత్తాధిపత్యానికి, ఏక సంస్కృతి-ఏక స్వామ్యానికి గండి పడుతుంది.

- మిహిర్ భట్టాచార్య

ఆరు నెలల ఇజ్రాయిల్ మారణకాండ

అంతర్జాతీయం

పాలస్తీనా లోని గాజా ప్రాంతంలో 2023 అక్టోబరు ఏడు నుంచి యూదు దురహంకారులు జరుపుతున్న మారణకాండ, దానికి పాలస్తీనియన్ల ప్రతిఘటనకు ఆరు నెలలు దాటింది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల దన్ను చూసుకొని గాజాలో సాగిస్తున్న హత్యాకాండ, విధ్వంసకాండ ఎప్పుడు, ఎలా ముగుస్తుందో తెలియదు. ఈ దారుణాన్ని నివారించలేని పనికిమాలిన సంస్థగా ఐరాస పేరు తెచ్చుకుంది. ఎన్ని కబుర్లు చెప్పినా ఆచరణకు వచ్చేసరికి న్యాయం వైపు ఎవరు నిలిచారో, అన్యాయం, అక్రమాలను ఎవరు సమర్ధిస్తున్నారో లోకానికి వెల్లడైంది. ఇజ్రాయిల్ జరుపుతున్న మారణకాండకు మద్దతు ఇస్తున్న జర్మనీపై అత్యవసరంగా ఆంక్షలు విధించాలని అంతర్జాతీయ కోర్టులో వామపక్ష నేత డేనియల్ ఒర్టేగా అధ్యక్షుడిగా ఉన్న లాటిన్ అమెరికాలోని నికరాగువా దాఖలు చేసిన పిటిషన్‌పై హేగ్ లోని అంతర్జాతీయ న్యాయస్థానం విచారణ ప్రారంభించింది. మారణకాండకు మద్దతు ఇవ్వటమేగాక పాలస్తీనా నిర్వాసితులకు సాయం చేస్తున్న ఐరాస సంస్థకు జర్మనీ నిధులను నిలిపివేసిందని కూడా నికరాగువా పేర్కొన్నది. తక్షణమే గాజాలో దాడులను విరమించాలని, యుద్ధం, నేరాలకు జవాబుదారీ ఎవరో తేల్చాలని తాజాగా ఐరాస మానవ హక్కుల మండలిలో ఒక తీర్మానాన్ని ప్రవేశ పెడితే ఓటింగ్ నుంచి మన దేశం, మరో పన్నెండు తప్పుకున్నాయి. చైనాతో సహా 28 దేశాలు అనుకూలంగా, అమెరికాతో పాటు మరో ఆరు వ్యతిరేకంగా ఓటు వేశాయి.

ఎం. కోటేశ్వరరావు

గాజాలో జరుగుతున్నదేమిటి? తమ మాతృదేశ పునరుద్ధరణ జరగాలన్న పాలస్తీనియన్ల అణచివేత తప్ప మరొకటి కాదు. ఎవరు చేస్తున్నారు? సామ్రాజ్యవాదుల మద్దతుతో వారి చేతిలో పావుగా ఉన్న ఇజ్రాయిల్, అంటే సామ్రాజ్యవాదులే దాడి కారకులు. ఆసుపత్రులు, స్కూళ్లు, నిర్వాసితుల కేంద్రాలు, సహాయ శిబిరాలు, అన్నదానం చేస్తున్నవారు ఎవరు కనిపించినా హతమార్చాలని నెతన్యాహు ఆదేశాలు జారీ చేస్తే ఇజ్రాయిల్ సైనికులు అమలు చేస్తున్నారు. గత ఆరు నెలల్లో 33,175 (ఏప్రిల్ 7వ తేదీ నాటికి) మందిని చంపివేశారు. మరో విధంగా చెప్పాలంటే గాజాలోని ప్రతి 70 మందికి ఒకరిని, రోజుకు 180 మందిని చంపారు. వీరుగాక 75,815 మందిని, రోజుకు 400 మందిని, ప్రతి 30 మందిలో ఒకరిని గాయపరిచారు. విధ్వంసమైన భవనాల గురించి చెప్పనవసరం లేదు. ఇరవై రెండు లక్షల మంది జనాభాలో 19 లక్షల మంది నిరాశ్రయులు కావటం లేదా నెలవులు తప్పారంటే ప్రభావితం కాని కుటుంబం లేదంటే అతిశయోక్తి కాదు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు అమెరికా అన్ని రకాల ఆయుధాలను అందించటమే కాదు, ఎర్ర సముద్రంలోకి తన యుద్ధ నావలను దింపి బాసటగా నిలుస్తున్నది. ఆ ప్రాంత దేశాలు జోక్యం చేసుకోకుండా బెదిరిస్తున్నది.

> ఆరు నెలల మారణకాండ తరువాత వెనక్కు తిరిగి చూసుకుంటే గాజా సర్వనాశనమైంది. అక్కడ బతికి ఉన్నవారు తిరిగి సాధారణ జీవితాలను ప్రారంభించే అవకాశం ఉంటుందా? ఇంకా ఎందరిని బలి తీసుకుంటారనే ప్రశ్నలకు ఇప్పటికైతే సమాధానాలు లేవు. రంజాన్ మాసం తరువాత మరింత పెద్ద ఎత్తున దాడులు జరిపేందుకు ఇజ్రాయిల్ సన్నాహాలు జరుపుతున్నట్లు వార్తలు. అది ఒక్క గాజాకే పరిమితం అవుతుందా లేక మొత్తం మధ్య ప్రాచ్య దేశాలకు విస్తరిస్తుందా అన్నది చూడాల్సి ఉంది.

సామ్రాజ్యవాదుల వర్తమాన రక్త చరిత్రలో విస్మరించరాని దుర్మార్గమిది. కొందరు సైనికులు చేసిన దారుణం కాదిది, వ్యవస్థాపూర్వకమైనది. ఎవరికి ఏది నేర్పితే దాన్నే పాటిస్తారు. ఇజ్రాయిల్ రక్షణ దళాల్లో ప్రతి యువకుడు కొంతకాలం విధిగా పని చేయాలి. ఆదేశించిన దుర్మార్గాలను అమలు చేయాలి. తిరస్కరిస్తే ఏం చేస్తారు? ప్రజాస్వామిక హక్కుని వదలి వేయరు. విదేశాల్లో ఉన్న ఒక యువ ఇజ్రాయిలీ కమ్యూనిస్టు ఈ దళాల్లో చేరేందుకు తిరస్కరించాడు. గాజా మారణకాండను నిరసిస్తూ జరిగిన ప్రదర్శనల్లో పాల్గొని అరెస్టయ్యాడనే కారణాన్ని చూపి అతని పౌరసత్వాన్ని ఇజ్రాయిల్ ప్రభుత్వం రద్దు చేసింది. దేశంలోకి రావటాన్ని నిషేధించింది. రాజ్య అణచివేత, మిలిటరీ విధానాలను నిరసించాలని, అణచివేతను వ్యతిరేకించాలని సోదర ఇజ్రాయిలీలకు అతను రాసిన లేఖలో పేర్కొన్నాడు. మధ్య ప్రాచ్య సోషలిస్టు ఫెడరేషన్‌లో భాగంగా ఇజ్రాయిల్-పాలస్తీనా సోషలిస్టు ఫెడరేషన్ ఏర్పాటు జరిగినపుడే ఈ ప్రాంతంలోని జనాలందరూ సుఖంగా వుంటారని పేర్కొన్నాడు. గాజాలో మారణకాండను విమర్శించినందుకు ఇజ్రాయిల్ పార్లమెంటులోని కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు ఒఫెర్ కాసిఫ్‌ను 2023 అక్టోబర్ 18న 45 రోజుల పాటు సస్పెండ్ చేస్తూ పార్లమెంటరీ నైతిక నియమాల కమిటీ తీర్మానించింది. అయినప్పటికీ ఖాతరు చేయని ఒఫెర్ అంతర్జాతీయ కోర్టులో దక్షిణాఫ్రికా దాఖలు చేసిన కేసును సమర్ధిస్తూ ఒక పిటిషన్‌పై సంతకం చేశాడనే సాకు చూపి ఏకంగా పార్లమెంటు సభ్యత్వాన్నే రద్దు చేసేందుకు పూనుకున్నారు. దానిలో భాగంగా 85 మంది ఎంపీలతో తీర్మానాన్ని ప్రతిపాదించారు. దాన్ని పార్లమెంటరీ కమిటీ జనవరి 30న 14-2 ఓట్ల మెజారిటీతో ఆమోదించింది. దక్షిణాఫ్రికా చర్య కుట్ర అని ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని సమర్ధించటమేనని వర్ణించింది. ఫిబ్రవరి 19న పార్లమెంటులో ఓటింగ్ జరగ్గా అది వీగిపోయింది. నూట ఇరవై మంది సభ్యులకు గాను పదకొండు మంది వ్యతిరేకంగా, 24 మంది ఓటింగ్‌కు దూరంగా ఉండగా 85 మంది అనుకూలంగా ఓటు వేశారు. ఒక సభ్యుడిని తొలగించాలంటే 90 మంది మద్దతు అవసరం. దేశంలో ఎవరూ వ్యతిరేకంగా వుండ కూడదనే దుర్మార్గం తప్ప దీని వెనుక మరొకటి లేదు. పార్లమెంటులోని ఇతర వామపక్ష వాదులకూ ఇదే జరుగుతుందని హెచ్చరించటమే.

ఆరు నెలల మారణకాండ తరువాత వెనక్కు తిరిగి చూసుకుంటే గాజా సర్వనాశనమైంది. అక్కడ బతికి ఉన్నవారు తిరిగి సాధారణ జీవితాలను ప్రారంభించే అవకాశం ఉంటుందా? ఇంకా ఎందరిని బలి తీసుకుంటారనే ప్రశ్నలకు ఇప్పటికైతే సమాధానాలు లేవు. రంజాన్ మాసం తరువాత మరింత పెద్ద ఎత్తున దాడులు జరిపేందుకు ఇజ్రాయిల్ సన్నాహాలు జరుపుతున్నట్లు వార్తలు. అది ఒక్క గాజాకే పరిమితం అవుతుందా లేక మొత్తం మధ్య ప్రాచ్య దేశాలకు విస్తరిస్తుందా అన్నది చూడాల్సి ఉంది. గాజాలో మరణించిన వారందరూ హమాస్ సాయుధులే అన్నట్లుగా ప్రపంచాన్ని నమ్మించేందుకు ఇజ్రాయిల్ చూస్తున్నది. ఒప్పందం ప్రకారం కొందరు బందీలను విడిపించుకోవటం తప్ప హమాస్ వద్ద ఉన్న ఇతర బందీల జాడను కూడా తెలుసుకోలేకపోయింది. చీమ చిటుక్కుమన్నా కనుగొనే నిఘా వ్యవస్థను ఏమార్చి హమాస్ సాయుధులు సరిహద్దులోని ఇజ్రాయిల్ ప్రాంతంపై ఎలా దాడి చేశారన్నది ఇప్పటికీ వీడని రహస్యంగానే ఉండిపోయింది. దాడులు, హత్యాకాండతో పాలస్తీనియన్లను లొంగదీసుకోలేమని గ్రహించిన ఇజ్రాయిల్ వారిని రోగాలు, ఆకలితో మాడ్చి చంపేందుకు పూనుకున్నట్లు తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. గాజా మారణకాండను ఎలా ఆపాలన్న దానికంటే అది కొనసాగితే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, ఈ ఏడాది జరగనున్న ఎన్నికల్లో జో బైడెన్ భవితవ్యం ఎలా ఉండనున్నదో అంటూ అనేక మంది విశ్లేషణల్లో నిమగ్నమయ్యారంటే వారి చర్మం ఎంత మందంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. కొందరైతే హమాస్ చేసిన దుర్మార్గాలంటూ ఇంకా చిలవలు పలవలుగా వర్ణిస్తూ గాజాలో జరుపుతున్న దారుణాలను తక్కువ చేసి చూపేందుకు చూస్తున్నారు.

గాజా మారణకాండ నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించేందుకు సామ్రాజ్యవాదం మార్గాలను వెతుకుతున్నది. మధ్యప్రాచ్యం, పశ్చిమాసియాకు వివాదాన్ని విస్తరించేందుకు అమెరికా చూస్తున్నది. ఇరాన్‌ను ఒంటరిపాటు చేసేందుకు దీర్ఘకాలంగా అనుసరిస్తున్న ఎత్తుగడలకు ఎదురుదెబ్బ తగిలింది. చైనా చొరవతో ఉప్పు నిప్పుగా ఉన్న సౌదీ అరేబియా-ఇరాన్ సాధారణ సంబంధాలను నెలకొల్పుకున్నాయి. సౌదీ-ఇజ్రాయిల్ మధ్య సయోధ్య కుదర్చాలని అమెరికా ఎంతగా చూసినా కుదరలేదు. పాలస్తీనా స్వతంత్ర దేశం ఏర్పడే వరకు సాధారణ సంబంధాలు కుదరవని సౌదీ స్పష్టం చేసింది. గాజాపై దాడులతో అది మరింత వెనక్కు పోయింది. కీలకమైన మధ్య ప్రాచ్య ప్రాంతాన్ని తన చేతుల్లో ఉంచుకోవాలన్న ప్రయత్నాన్ని అమెరికా కొన సాగిస్తూనే ఉంది. ఐరోపాలో రష్యాకు వ్యతిరేకంగా నాటో కూటమిని ఏర్పాటు చేసినట్లే ఇరాన్‌ను దెబ్బ తీసేందుకు అలాంటి మరో కూటమి ఏర్పాటు చేయాలని, దానిలో ఇజ్రాయిల్‌కు కీలక పాత్ర ఉండేట్లు చూడాలన్నది లక్ష్యం. అమెరికా, ఇజ్రాయిల్‌ను గట్టిగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసి కూడా సౌదీ అరేబియా నేతలు ఇరాన్‌తో సయోధ్య కుదుర్చుకోవటం అమెరికా ఊహించినట్లు కనపడదు. ఇరాన్‌కు మద్దతుగా చైనా, రష్యా నిలవటం మరొక కొత్త పరిణామం. ఉక్రెయిన్ వివాదం, గాజా మారణకాండ దాన్ని మరింత పటిష్టం చేసిందని చెప్పవచ్చు. కొందరైతే ఈ కూటమితో అమెరికా ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నదనే వర్ణిస్తున్నారు. ★

కార్మిక హక్కులు కాలరాస్తున్న మిమ్స్ యాజమాన్యం

సమస్య

విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండల కేంద్రంలోని మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (మిమ్స్) యాజమాన్యం ఉద్యోగులు, కార్మికుల హక్కులను కాలరాస్తోంది. ఈ మెడికల్ కాలేజీలో 350 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. మిమ్స్‌లో సిఐటియు అనుబంధ సంఘం 2011లో ఏర్పడిన నాటి నుండి 2011-2013, 2015-2017 సంవత్సరాలలో మొత్తంగా 4 సార్లు వేతన ఒప్పందాలు చేసింది. 2011 అక్టోబర్ నుండి 2020 ఏప్రిల్ వరకు ప్రతి 6 నెలలకు ఒకసారి డిఏను క్రమం తప్పకుండా చెల్లించారు. 2020 కోవిడ్ సమయంలో యాజమాన్యం కొంతమంది ఉద్యోగులను లొంగదీసుకొని మిగిలిన ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసింది. నాటి నుండి నేటి వరకు డిఏలను, వేతన ఒప్పందాన్ని ఎగ్గొట్టింది. సిఐటియు నాయకత్వం లేకపోతే ఉద్యోగుల నోళ్లు నొక్కి భయభ్రాంతులకు గురిచెయ్యవచ్చని యాజమాన్యం భావించి 2020లో 15 మంది కార్మికులను తొలగించి యూనియన్‌ను విచ్ఛిన్నం చేసింది. యాజమాన్యం గతంలో అంగీకరించిన హామీలను అమలు చేయకపోవడంతో ఇద్దరు ఉద్యోగులు యాజమాన్యాన్ని అడిగినందుకు వారిద్దరినీ ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా సస్పెండ్ చేసింది.



టి.సూర్యనారాయణ

దీంతో కార్మికులు విసిగి వేసారి తిరిగి మూడు సంవత్సరాల తరువాత (2024)లో సిఐటియును ఆశ్రయించారు. దీంతో మిమ్స్ కార్మికులు గత్యంతరం లేక అనివార్యంగా ఈ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి విధులను బహిష్కరించే పరిస్థితులను యాజమాన్యం కల్పించింది. 68 రోజులుగా కార్మికులు నిరసన దీక్షలు చేస్తున్నారు.

2019 నుంచి చేయవల్సిన వేతన ఒప్పందం చెయ్యకుండా యాజమాన్యం కార్మికులకు పెంచాల్సిన వేతనాలు ఎగ్గొట్టింది. ఆనాటి నుంచి 7 డిఏలు చెల్లించకుండా బకాయి ఉంది. కార్మికులందరిని పర్మినెంట్ చెయ్యకుండా జాప్యం చేస్తున్నది. మూర్తిరాజు చైర్మన్‌గా వున్నప్పుడు చుట్టుపక్కల గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించేవారు. ప్రజలు, కార్మికులతో మంచి సంబంధాలు ఉండేవి. సిఐటియు ఆధ్వర్యాన 4 వేతన ఒప్పందాలు జరిగాయి. నేడున్న యాజమాన్యం తప్పుడు పద్ధతుల్లో కార్మికులపై కక్షగట్టి వ్యవహరిస్తోంది. దీని మూలంగా గత వారం రోజులుగా మిమ్స్‌లో అన్ని రకాల వైద్య సేవలు ఆగిపోయాయి. యూనియన్ నాయకులతో చర్చించి సమస్యలను పరిష్కరించి ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన యజమాన్యం...యూనియన్ నాయకులతో చర్చ జరపనని కార్మిక చట్టాలను ధిక్కరించి వితండ వాదం చేస్తూ ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందకుండా, వైద్య విద్యార్థులకు చదువు లేకుండా చేస్తోంది. ఆసుపత్రి అనగానే పేషెంట్లు, డాక్టర్లతో హడావిడి కనిపిస్తుంది మనకి ఎక్కడైనా. కానీ మిమ్స్ ఆసుపత్రి మాత్రం గత 67 రోజులుగా పోలీసు పికెట్లు, లాయర్ల మీటింగ్‌లతో నిరంతరం ఉద్రిక్తంగా కనబడుతున్నది.

చట్టాలను అమలు చేయనంటున్న యాజమాన్యం

ట్రేడ్ యూనియన్ చట్టం (1926) ప్రకారం ఏ సంస్థలోనైనా ఏడుగురు సభ్యులుంటే యూనియన్ పెట్టుకునే హక్కు ఉంది. అందులో ఆఫీస్ బేరర్లుగా బయటవారు ఉండటం కూడా అంతే హక్కు. ఈ చట్టాలను అమలు చెయ్యకుండా తన ఇష్టం వచ్చినట్లు చెయ్యాలనుకోవడం చట్టవ్యతిరేకం. మిమ్స్ యాజమాన్యం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలను అమలు చెయ్యడంలేదు. విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఇక్కడ బోధనా సిబ్బంది లేరు. ల్యాబ్ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. హాస్పటల్‌లో ఇచ్చే మందులు నాశిరకం. విద్యార్థులకు బోధించటానికి ఎప్పుడూ రోగులే తగినంతమంది వుండరు. సమస్యల పరిష్కారానికై చర్చలు జరిగిన సందర్భంగా డిసియల్, జెసియల్, డిఎస్‌పి, ప్రజాప్రతినిధుల దగ్గర తమకు కార్మిక చట్టాలతో పనిలేదని, కార్మిక సంఘం నాయకులతో చర్చించబోమని యాజమాన్యం మొండిగా వ్యవహరించింది. వాస్తవానికి 'ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్ట్' (1926) ప్రకారం ఏదైనా సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు సంఘం పెట్టుకునే హక్కుతోపాటు తమకు నచ్చిన యూనియన్‌కు అనుబంధంగా ఉండవచ్చు. ఆ యూనియన్ కమిటీలో బయటివారు సగం మంది ఆఫీస్ బేరర్లుగా వుండవచ్చని ఈ చట్టంలో ఉంది. కానీ నేడు మిమ్స్ యాజమాన్యం కార్మిక చట్టాలను ధిక్కరిస్తూ సమస్యను జటిలం చేస్తున్నది. జనవరిలో ఉద్యోగులంతా పనిచేశారు. పనిచేసిన జనవరి నెల జీతం ఫిబ్రవరి 7 లోపుగా చెల్లించాలని పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్టు (1936) చెప్తున్నది. కానీ నేటికి 70 రోజులు దాటినా జనవరి నెల జీతం చెల్లించలేదు. ఈ నెల 6న స్థానిక శాసనసభ్యులు బడుకొండ అప్పలనాయుడు దగ్గర ఈ నెల 11న జీతాలు చెల్లిస్తానని యాజమాన్యం

అంగీకరించింది. కానీ నేటికి చెల్లించలేదు. సమస్యలు పరిష్కరించమన్న ఉద్యోగులపై కేసులు పెడుతున్న పోలీసులు...తాను ఏ చట్టాన్నీ అమలు చేయను, యూనియన్‌తో చర్చించను, జనవరి నెల జీతం చెల్లించను, బకాయి ఉన్న డిఏలు ఇవ్వను, ఎవ్వరి మాటా విననంటున్న మిమ్స్ యాజమాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ప్రాసిక్యూట్ చేసి చట్టరీత్యా శిక్షించవలసిన పోలీసులు 24 గంటలూ యాజమాన్యానికి కాపలా కాయడమేమిటి?

అడుగడుగునా పోలీసు నిర్బంధం

తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశాంతంగా పోరాడుతున్న ఉద్యోగులపై వారానికొక కేసు పెడుతున్నారు. ఈ ఉద్యమాన్ని ఎలాగైనా విచ్ఛిన్నం చేయాలని, నలుగురు మహిళలతో పాటు యూనియన్ ముఖ్య నాయకులు ఏడుగురుపై ఏప్రిల్ 5వ తేది రాత్రి 10 గంటలకు అరెస్టు చేసి రాత్రంతా పూసపాటిరేగ స్టేషన్లో ఉంచి నాన్ బెయిల్‌బుల్ సెక్షన్లతో అక్రమ కేసులు బనాయించారు. మిమ్స్ దగ్గరున్న టెంట్లను పోలీసులు పీకేశారు. 34 మంది ఉద్యోగులపై బైండోవర్ కేసులు పెట్టారు. గ్రామాల్లో ఉన్న కార్మికుల ఇళ్లకు వెళ్లి అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తీసుకుపోతున్నారు. తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారు. ఈ విధంగా ఇప్పటి వరకు ఇద్దరు సిఐటియు నాయకులను, 24 మంది ఉద్యోగులను జైలుకు పంపించారు. అరెస్టు చేసిన వారిని పరామర్శించేందుకు రాష్ట్ర నాయకులు వస్తే వారిని కూడా అడ్డుకుంటున్నారు. కార్మిక శాఖ పూర్తిగా యాజమాన్యానికి కొమ్ము కాస్తున్నది.

సమ్మె చేస్తున్న మిమ్స్ ఉద్యోగులు ఇప్పటి వరకు అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలుమార్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యాజమాన్యం నుంచి, పోలీసుల నుంచి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కార్మికులు మాత్రం పట్టు విడవక ఐక్యంగా పోరాడుతున్నారు. ఆ పోరాటం విజయవంతం కావాలి.

/ వ్యాసకర్త సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, సెల్ : 9490098973/

కోపాన్ని జయించు...

సెటైర్

"ఉగాది పచ్చడి దివ్యంగా ఉందోయ్! బాగా చేసేవు సుమా! నీకు క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు!"

"అది సరేగాని, ఇంతకీ క్రోధి అంటే ఏమిటండీ ?"

"కరెక్టుగా చెప్పలేను గాని బహుశా క్రోధి అంటే కోపంతో ఉన్నవాడు అని అనుకుంటాను"

"అప్పుడు అందరికీ అర్థం అయ్యేలా కోపిష్టి అని అనొచ్చు కదండీ, ఈ అర్థం కాని పేర్లెందుకు పెట్టారు మన తెలుగు సంవత్సరాలకి?"

"నీకు, నాకు తేలికగా అర్థం అయిపోతే పంచాంగం చూడడానికి ఆ బ్రాహ్మళ్ల దగ్గరికి ఎందుకు వెళ్తాం? వాళ్ళకి సంభావనలూ గట్రా ఎలా ముడతాయి?"

... ఇలా ఉదయాన్నే మా దంపతుల మధ్య సంభాషణ జరుగుతోంది.

ఈసరికి పక్కవాటాలో ఉంటున్న తెలుగు మాస్టారు సూరయ్య గారు రానే వచ్చారు.

మా సంభాషణ కొంత చెవిలో పడింది కాబోలు, వస్తూనే అందుకున్నారు:

"తన కోపమె తన శత్రువు/ తన శాంతమె తనకు రక్ష / దయ చుట్టంబౌ /తన సంతోషమె స్వర్గము/ తన దు:ఖమె నరకమండ్రు తథ్యము సుమతీ" అని మా ఆవిడ ఇచ్చిన ఉగాది పచ్చడి నోట్లో వేసుకున్నారు.

"ఈ క్రోధి నామ సంవత్సరంలో మీరంతా క్రోధాన్ని జయించి స్వర్గ సుఖాలు పొందుదురు గాక!" అని శుభాకాంక్షలు ప్రకటించేరు.

ఈ లోపు పక్కవీధిలో ఉంటున్న లెక్కల మాస్టారు జాన్సన్, సైన్సు మాస్టారు అక్బర్ కూడా వచ్చి చేరేరు. శుభాకాంక్షల వ్యవహారం పూర్తయిన తర్వాత మా సంభాషణ ఇలా సాగింది:

"సూరయ్య గారూ ! నాకు ఎవరి మీదా ఏ క్రోధమూ లేదు. అయితే ఇప్పుడు నేను స్వర్గ సుఖాలతో ఉన్నట్టేనా?" అని నేను అడిగేను. అంతేనన్నట్టు సూరయ్య తలాడించేరు.

"మీకెందుకు కోపం ఉంటుందండీ! పిల్లలిద్దరూ అమెరికాలో సెటిల్ అయిపోయేరు కదా. సొంతిల్లు. వచ్చే ఏడు రిటైర్ అవుతారు. హాయిగా కూచుని పెన్షన్ పుచ్చుకుంటూ గడిపేస్తారు. అప్పుడప్పుడూ విహారయాత్రలకి పోతారు. మీ ఓపిఎస్ వాళ్ళకెందుకూ కోపం?" అని కొత్త పెన్షన్ బ్యాచి జాన్సన్ రుసరుసలాడాడు.

"అదుగో! ఆ కోపమే కూడదన్నాడు సుమతీ శతకకారుడు. కోపగించుకుంటే నీకు ఓపిఎస్ వస్తుందా చెప్పు?" అని సముదాయించబోయేరు సూరయ్య.

"మాకు ఓపిఎస్ రద్దు చేసిన బిజెపి మీద, దానితో జత కట్టిన టిడిపి మీద. జనసేన మీద ఇప్పుడు కోపాన్ని చూపించకపోతే మరెప్పుడు చూపిస్తాం ? సీఎం అయిన ఆర్నెల్లలో ఓపిఎస్‌ను మళ్ళీ తీసుకొస్తాను అని చెప్పిన జగన్ మీద కోపాన్ని ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు చూపిస్తాం? ఇదే కరెక్టు సమయం. ఈ సంత్సరం క్రోధి నామ సంవత్సరం అని కరెక్టుగా పెట్టేరు. వీళ్ళందరి మీదా మా కోపాన్ని చూపిస్తాం. అంతే " అని గట్టిగా ప్రకటించేడు జాన్సన్.

"అంతే అంతే, ఇక్కడే పుట్టి, ఇక్కడే అందరితోనూ కలిసి బతుకుతున్న మా ముస్లింల పౌరసత్వాన్నే ప్రశ్నించే సిఎఎ చట్టాన్ని తెచ్చారు. దేశం కోసం త్యాగాలు చేయడంలో ఎవరికీ తీసిపోని మా దేశభక్తినే ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాదులంటూ, దేశద్రోహులంటూ మా మీద అభాండాలు వేస్తున్నారు. అందుచేత మేం కూడా మా కోపాన్ని ఈ ఏడాది చూపిస్తాం. సిఎఎ తెచ్చిన బిజెపి మీద, దానికి అనుకూలంగా పార్లమెంటులో చేతులెత్తిన వైసిపి, టిడిపిల మీద, సిఎఎ ను బలపరిచిన పవన్ మీద మా కోపాన్ని గట్టిగా చూపిస్తాం. ఇది ఖాయం" అన్నాడు అక్బర్.

ఈ సరికి మా మేనల్లుడు స్టీల్ ప్లాంట్ నుంచి వచ్చేడు. "మన వైజాగ్ స్టీల్‌ని అమ్మేస్తానన్న బిజెపితో చేరిపోయి చంద్రబాబు, పవన్ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలంటే మాకే ఓట్లేయండి అని అడుగుతున్నారే! పేరుకి అసెంబ్లీలో ఓ తీర్మానం చేసేసి దాంతో తన పని అయిపోయిందన్నట్టు, తనకేమీ బాధ్యత లేనట్లు మరోపక్క జగన్ నాటకం ఆడుతున్నాడే! అందరూ కలిసి నాటకాలాడుతున్నారు. మా స్టీల్ ఎంప్లాయిస్‌కి చాలా చాలా కోపంగా ఉంది. ఈ సారి చూపిస్తాం." అని చిందులు తొక్కేడు.

"గ్యాస్ బండ రేటు, కరెంటు బిల్లు చూస్తే వొళ్ళు మండిపోతోంది" అంటూ వొంటింట్లోంచే మా ఆవిడ తన క్రోధాన్ని కూడా సంఘీభావంగా ప్రకటించింది.

"బాగుంది, అందరూ ఈ సారి ఎన్నికల్లో కోపాన్ని చూపించడానికి సిద్ధపడ్డారన్నమాట! ఇంతకీ ఆ కోపాన్ని ఎలా చూపిస్తారు? ఎవరికి ఓటేస్తారు?" అనడిగేను.

అందరూ కాస్సేపు ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. బుర్రలు గోక్కున్నారు. నిజమే. బిజెపి, టిడిపి, జనసేన, వైసిపి - అన్ని పార్టీల మీదా కోపంగానే ఉంది. పోనీ ఎవరికీ ఓటెయ్యకుండా మానేస్తే? లేదా నోటా మీద నొక్కితే? ఏమౌతుంది? మన కోపం మనతోనే ఉండిపోతుంది. మన కోపాన్ని ఎవరూ ఖాతరు చెయ్యరు. మరెలా?

"ఏమిటర్రా ! అంతా చేరి అలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అంటూ వచ్చేరు మా ప్రభాకరం మాస్టారు.

"అతడనేక యుద్ధములందు ఆరియు తేరిన వృద్ధమూర్తి" అన్నట్టు ఉంటాడాయన. ఎమర్జెన్సీ కాలంలోను, ఆ తర్వాత కూడా జైలు నిర్బంధాన్ని అనుభవించిన వాడు. ఆయనకి చెప్పుకున్నాం మా పరిస్థితి. అందరూ చెప్పినది విని ఆయన ఇలా అన్నాడు:

"సుమతీ శతకకారుడు ఎందుకు, ఎలా చెప్పినా, కోపాన్ని జయించడం అంటే అర్థం కోపమే రాకుండా మన్ను తిన్న పాములా ఉండిపోవడం కాదు. కోపం నిప్పు లాంటిది. దానిని అదుపు చేసి సరైన పద్ధతిలో ఉపయోగిస్తే అది మహా శక్తి అవుతుంది.

ఇప్పుడు మనందరికీ కేంద్రంలో, రాష్ట్రంలో పాలిస్తున్న పార్టీలమీద, కేంద్రంలోని పార్టీతో జత కట్టిన రాష్ట్ర ప్రధాన ప్రతిపక్ష పార్టీ మీద, దానికి తోడైన జోకర్ పార్టీ మీద కోపం ఉంది. ఇది చాలా సమంజసమైన కోపం. దీన్నే ధర్మాగ్రహం అంటారు. ఇప్పుడు ఈ ఆగ్రహాన్ని ప్రదర్శించడం ఎలా? అన్నదే మన సమస్య'. ఔనా?"

అందరమూ ఔనన్నాం.

"ఏముందీ? చాలా సింపుల్. అసలు కోపం రంగు ఏమిటి? ఎరుపు. ఔనా?

ఇప్పుడు ఎన్నికల్లో ఆ ఎరుపు రంగు ఎక్కడుందో చూడండి! ఇప్పుడెక్కడుంది అని మాత్రం దాటేయకండి. మీకు నిజంగా కోపం వుంటే అది మన చుట్టూ ఆవరించుకునే వుంది. ఎప్పుడూ మనతోనే ఉంది. టీచర్ల ఓపిఎస్ పోరాటంలో ఉంది. అంగన్వాడీల సమ్మెలో ఉంది. రైతుల ఆందోళనలో ఉంది. నిరుద్యోగుల ఉద్యమాలలో ఉంది. కూలీల ఆకలి కేకల్లో ఉంది. దళితుల, గిరిజనుల, మహిళల ఆక్రోశంలో ఉంది. ఎరుపు ఎక్కడ లేదు అని నేను అడుగుతున్నాను."

అక్కడున్న అందరి కళ్ళల్లో కూడా ఆ ఎరుపు మెరిసింది.

- సుబ్రమణ్యం

ఉత్తుత్తి హామీలే...

- పదేళ్ల పాలనలో అన్ని వర్గాలకూ మొండిచెయ్యే
- ఆందోళనకరంగా పేదరికం, నిరుద్యోగం
- అన్నదాతలకు అందని చేయూత
- మహిళలపై పెరుగుతున్న నేరాలు
- మరోసారి ఓట్ల వేటకు సిద్ధమవుతున్న కమలదళం

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిజెపి తన ఎన్నికల ప్రణాళికను ఆకర్షణీయంగా రూపొందించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో ప్రధానంగా పేదలు, యువకులు, రైతులు, మహిళలపై దృష్టి సారించే అవకాశముంది. నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఆయా వర్గాలపై బిజెపి హామీల వర్షం కురిపించింది. అధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత వాటన్నింటినీ గాలికి వదిలేసింది. బిజెపి పదేళ్ల కాలంలో ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఎన్నికలు తరుముకొచ్చే సరికి పేదలు, అన్నదాతలు, మహిళలు, యువత గుర్తొచ్చారు.



(టైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో)

పాక్, బంగ్లా కంటే పేదరికం అధికం

నీతి ఆయోగ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం గత తొమ్మిదేళ్లలో 24.82 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. పేదరిక నిష్పత్తి 2013-14లో 29.17% ఉండగా 2022-23 నాటికి గణనీయంగా తగ్గి 11.28%కి చేరుకుంది. కోవిడ్ సమయంలో పెరిగిన పేదరికాన్ని ఈ నివేదిక పరిగణనలోకి తీసుకోలేదని నిపుణులు తెలిపారు. వినియోగ పేదరిక రేఖ (అంతర్జాతీయంగా పేదరికాన్ని అంచనా వేసేందుకు అవలంబించే సంప్రదాయ పద్ధతి) సమాచారాన్ని తీసుకోలేదని మరి కొందరు ఎత్తిచూపుతున్నారు. గత ఆరేళ్లుగా దేశంలో వాస్తవ వేతనాల్లో పెరుగుదల కన్పించడం లేదు. అవి స్థిరంగానే ఉన్నాయి. ఈ పరిణామం వినియోగ డిమాండ్‌పై ప్రభావం చూపింది.

ప్రపంచబ్యాంక్ తెలిపిన వివరాల ప్రకారం పేదరిక రేటు, అంతర్జాతీయ దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న ప్రజల దామాషా 2018 వరకూ నిలకడగా తగ్గుతూ వచ్చింది. ఆ తర్వాత పెరుగుదల కన్పించింది. 2020లో... అంటే కోవిడ్ సమయంలో గరిష్ట స్థాయికి చేరింది. 2021లో మళ్లీ తగ్గింది. మన దేశంలో పేదరిక రేట్లు పొరుగున ఉన్న బంగ్లాదేశ్, పాకిస్తాన్‌తో పోలిస్తే బాగా అధికంగా ఉన్నాయి.

అభద్రతలో యువత

యువతకు ఉపాధి కల్పించే విషయంలో మోడీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది. దేశంలో నిరుద్యోగులుగా ఉన్న వారిలో 83% మంది యువతేనని ఇండియా ఎంప్లాయిమెంట్ నివేదిక-2024 తెలిపింది. దీనిని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ (ఐహెచ్‌డి) సంయుక్తంగా రూపొందించాయి. దేశంలోని మొత్తం నిరుద్యోగ యువతలో సెకండరీ, ఉన్నత విద్య అభ్యసించిన వారి సంఖ్య 2000 సంవత్సరం నుండి 2022 నాటికి రెట్టింపు అయింది. రెగ్యులర్ ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య 2018 తర్వాత బాగా తగ్గడం గమనార్హం. యువతలో కొద్దిమంది మాత్రమే సామాజిక భద్రతా పథకాలు, కార్యక్రమాల ద్వారా ప్రయోజనాలు పొందారు. అత్యధికులు మాత్రం అభద్రతతో జీవితాలు నెట్టుకొస్తున్నారు.

నత్తనడకన నడుస్తున్న రైతు పథకాలు

ఇక రైతుల విషయానికి వస్తే వాస్తవానికి వారి అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. వీటిలో 2016లో ప్రారంభించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఒకటి. ప్రీమియంకు సంబంధించి ఇది ప్రపంచంలోనే మూడో అతి పెద్ద పథకం.

ఈ పథకానికి దరఖాస్తు చేస్తున్న అన్నదాతల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే ఉంది. అదే సమయంలో క్లెయిముల చెల్లింపు తగ్గిపోతోంది. 2018-19లో రూ.28,651.8 కోట్ల క్లెయిముల చెల్లింపు జరిగితే 2021-22 నాటికి ఆ మొత్తం రూ.14,716.9 కోట్లకు తగ్గిపోయింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి కార్యక్రమాలు కూడా ఇలాగే నడుస్తున్నాయి. ఆయా పథకాల్లో లబ్దిదారుల సంఖ్య క్రమేపీ పడిపోతోంది. బడ్జెట్ కేటాయింపులు, ఖర్చు కూడా నానాటికి తీసికట్టు నాగంబొట్టు మాదిరిగా తయారయ్యాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యోగాల కల్పన కోసం నానాటికీ డిమాండ్ పెరుగుతుంటే ఉద్యోగాలు పొందిన వారి సంఖ్యలో మాత్రం పెద్దగా పురోగతి కన్పించలేదు. ఉద్యోగాల కోసం డిమాండ్ 41% పెరగ్గా ఇచ్చిన ఉద్యోగాలలో పెరుగుదల కేవలం 38% మాత్రమే.

తగ్గుతున్న మహిళా ఉద్యోగులు

మహిళా సాధికారత విషయంలో కేంద్ర ప్రభుత్వ మాటలకు, చేతలకు మధ్య ఏ మాత్రం పొంతన ఉండడం లేదు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల సంఖ్య అనేక దశాబ్దాలుగా తగ్గుతూ వస్తోంది. గత తొమ్మిది సంవత్సరాల్లో ఈ ధోరణి మరింత అధికమైంది. ప్రపంచబ్యాంక్ సమాచారం ప్రకారం 2012 నాటికి 27% మంది మహిళలు ఉపాధి పొందుతుంటే 2021 నాటికి అది 22.9%కి పడిపోయింది. ఈ తిరోగమన ధోరణి ఆందోళన కలిగించే విషయమే.

మహిళలపై పెరుగుతున్న నేరాలు

జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ఇటీవల విడుదల చేసిన వార్షిక నేర నివేదిక ప్రకారం దేశంలో మహిళలకు భద్రత కరువవుతోంది. 2022లో మహిళలపై నేరాలకు సంబంధించి 4,45,256 కేసులు నమోదయ్యాయి. అంటే ప్రతి గంటకు సుమారు 51 ఎఫ్‌ఐఆర్‌లు నమోదవుతున్నాయన్న మాట. 2020లో 3,71,503 కేసులు నమోదు కాగా, 2021లో వాటి సంఖ్య 4,28,278కి పెరిగింది.

రెండో దశ ఎన్నికల బరిలో 1,210 మంది అభ్యర్థులు

- 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 88 స్థానాలకు ఎన్నికలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల రెండో దశ ఎన్నికల్లో 1,210 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికల రెండో దశలో 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరిగే 88 స్థానాల్లో 1,210 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. 88 స్థానాల్లో 2,633 నామినేషన్లు దాఖలయ్యాయి. దాఖలైన 2,633 నామినేషన్ల పరిశీలన తరువాత 1,428 నామినేషన్లు చెల్లుబాటు అయ్యేవిగా గుర్తించినట్లు తెలిపింది. కేరళలో 20 లోక్‌సభ నియోజకవర్గాల నుంచి అత్యధికంగా 500 నామినేషన్లు, కర్ణాటకలోని 14 స్థానాల నుంచి 491 నామినేషన్లు వచ్చాయి. త్రిపురలో ఒక స్థానం నుంచి 14 నామినేషన్లు వచ్చాయి. మహారాష్ట్రలోని నాందేడ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి గరిష్టంగా 92 నామినేషన్లు వచ్చాయి. కేరళలో 500 నామినేషన్లలో 204 నామినేషన్లను ఆమోదించగా, మిగిలిన వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ తరువాత, 194 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కర్ణాటకలో 247, మహారాష్ట్రలో 204, కేరళలో 194, రాజస్థాన్ 152, ఉత్తరప్రదేశ్‌లో 91, మధ్యప్రదేశ్‌లో 88, అస్సాంలో 61, బీహార్‌లో 50, పశ్చిమ బెంగాల్‌లో 47, చత్తీస్‌గఢ్‌లో 41, జమ్ము కాశ్మీర్‌లో 22, త్రిపురలో 9 మంది బరిలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మరో వంద కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ పారామిలిటరీ ఫోర్సెస్ (సిఎపిఎఫ్)ని మోహరించాలని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖను ఆదేశించినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది.

పోలీస్‌స్టేషన్‌లో టిఎంసి నేతల ధర్నా

న్యూఢిల్లీ : ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న టిఎంసి నాయకులు మందిర్ మార్గ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కూడా ధర్నా కొనసాగించారు. సోమవారం న్యూఢిల్లీలోని ఎన్నికల కార్యాలయం ఎదుట ధర్నాకు దిగడంతో టిఎంసి నాయకులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉన్న ఇడి, సిబిఐ, ఎన్‌ఐఎ, ఐటి చీఫ్‌లను మార్చాలనే డిమాండ్‌తో టిఎంసి నాయకులు ధర్నా చేశారు. రాజ్యసభ సభ్యుడు డెరెక్ ఓ బ్రెయిన్, ఆ పార్టీ నాయకులు మహమ్మద్ నదీముల్ హక్, డోలా సేన్, సాకేత్ గోఖలే, సాగరికా ఘోష్, ఎమ్మెల్యే వివేక్ గుప్తా తదితరులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. మందిర్ మార్గ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం రాత్రే టిఎంసి నాయకుల్ని విడుదల చేశామని, వారు బయటకు వెళ్లడం లేదని ఒక పోలీసు అధికారి చెప్పారు.

మొదటి దశలో 8 శాతమే!

- తగ్గుతున్న మహిళా అభ్యర్థులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల మొదటి దశ పోలింగ్ ఈ నెల 19న జరగనుంది. మొదటి దశలో 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 102 లోక్‌సభ స్థానాల్లో 1,625 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో 134 మంది (8 శాతం) అభ్యర్థులు మాత్రమే మహిళలు ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం అభ్యర్థుల్లో దాదాపు 9 శాతం (726) మంది మహిళలు ఉన్నారు. వీరిలో 78 మంది మాత్రమే 17వ లోక్‌సభకు ఎంపికయ్యారు.

2023 సెప్టెంబరులో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లను రిజర్వ్ చేయాలనే బిల్లును ఆమోదించినప్పటికీ, రాజకీయ పార్టీలు ఎక్కువ మంది మహిళా అభ్యర్థులను నిలబెట్టడానికి సిద్ధపడటం లేదని కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన డేటా స్పష్టం చేస్తుంది. మణిపూర్, నాగాలాండ్, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, త్రిపుర, జమ్మూ కాశ్మీర్‌తో సహా ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒక్క మహిళా అభ్యర్థి కూడా బరిలో లేరు. అరుణాచల్‌ప్రదేశ్‌లో ఒక మహిళా అభ్యర్థిని మాత్రమే నిలబెట్టారు. బీహార్ 3, మధ్యప్రదేశ్ 7, మహారాష్ట్ర 7, మేఘాలయ 2, పుదుచ్చేరి 3, రాజస్థాన్ 12, సిక్కిం 1, ఉత్తరప్రదేశ్ 7, ఉత్తరాఖండ్ 4, పశ్చిమ బెంగాల్‌లో నలుగురు మహిళా అభ్యర్థులు బరిలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల మొదటి దశలో తమిళనాడులో అత్యధిక సంఖ్యలో మహిళా అభ్యర్థులను నిలబెట్టారు.

అక్రమ ట్రస్టుల నుంచి బిజెపికి రూ.614.52 కోట్ల విరాళం!

తిరువనంతపురం : 2021-22 ఒక్క ఏడాదిలోనే కార్పోరేట్లు, వ్యక్తులు, ఎలక్షన్ కమిషన్ (ఇసి) ఆమోదించని అక్రమ ట్రస్టుల నుండి బిజెపి రూ.614.52 కోట్లు సంపాదించింది. ఎలక్టోరల్ బాండ్ల నుండి సంపాదించిన వేలకోట్లకు ఇది అదనమని దేశాభిమాని పత్రిక వెల్లడించింది. 2022 నవంబర్ 7న బిజెపి ఎన్నికల కమిషన్ (ఇసి)కి సమర్పించిన పత్రాల్లో చాలా మంది దాతల పాన్ నెంబర్, చిరునామా లేదు. ప్రతి ఆర్థిక సంవత్సరం రాజకీయ పార్టీలు ఇరవై వేలకు పైగా జమ చేసిన వారి జాబితాను ఇసికి సమర్పించాల్సి వుంది. ఇసి ఆమోదించని ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి బిజెపి విరాళాలను స్వీకరించినట్లు ఆ పత్రాలు చూపుతున్నాయి. వాటిలో ఒకటి జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ ఆఫ్ కేరళ. పది లక్షలు విరాళం అందించిన ఈ ట్రస్ట్ పాన్ నెంబర్, చిరునామా లేవు. వివరణ కోరకుండా బిజెపి సమర్పించిన పత్రాలను ఇసి ఆమోదించడం గమనార్హం. న్యూఢిల్లీలోని బహదూర్ షా జాఫర్ మార్గ్‌లోని హన్స్ భవన్‌లో నమోదైన ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ 2021-22లో బిజెపి రూ.249 కోట్ల విరాళాలను అందించింది. మొత్తంగా 4,985 మంది ప్రముఖుల (వ్యక్తులు, సంస్థలు, ట్రస్టులు) నుండి చెక్‌లు, ఆన్‌లైన్, నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్‌ఇఎఫ్‌టి)ల ద్వారా బిజెపికి నగదు బదిలీ చేశాయి. కేరళకు చెందిన సంస్థలు, వ్యక్తులతో కూడిన 27 మంది ప్రముఖుల నుండి నగదు అందింది. బిజెపికి కోటి రూపాయలు ఇచ్చిన మహ్మద్ మజీద్‌కు సంబంధించిన పాన్ నెంబర్, చిరునామా లేవు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో దేశంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేనంత అవినీతికి పాల్పడింది. సుప్రీంకోర్టు తీర్పుతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) వెల్లడించిన వివరాలతో ఈ అక్రమాలు వెలుగుచూశాయి.

కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రౌస్ ఎవెన్యూ కోర్టు జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది. ఈ నెల 23న తిరిగి ఆమెను కోర్టు ముందు హాజరుపరచాలని ఇడి అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన కవితకు గతనెల 26న రౌస్ ఎవెన్యూ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఆ కస్టడీ సమయం ముగియడంతో మంగళవారం ఆమెను మరోసారి అధికారులు కోర్టు ముందు హాజరుపరిచారు. ఇరువైపులా వాదనలు ముగించిన స్పెషల్ జడ్జి కావేరి బవేజా... తీర్పును కాసేపు రిజర్వు చేశారు. అనంతరం ప్రకటించిన తీర్పులో కవితకు 14 రోజుల కస్టడీ పొడిగిస్తున్నట్లు వెల్లడించారు.

హేమంత్ సోరేన్‌పై కేసులో మూడో వ్యక్తి అరెస్టు

రాంచీ : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌పై విచారణ జరుగుతున్న మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మూడో వ్యక్తిని అరెస్టు చేసింది. ఈ విషయాన్ని అధికారులు మంగళవారం వెల్లడించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద మహమ్మద్ సద్దాంను ఇడి కస్టడీలోకి తీసుకున్నట్లు తెలిపారు. రాంచీలో హేమంత్ సోరేన్ అక్రమంగా ఆక్రమించుకున్న 8.86 ఎకరాల భూమికి సంబంధించిన నకిలీ పత్రాలను సద్దాం సృష్టించాడని ఇడి ఆరోపిస్తుంది. ఈ కేసులో ఇప్పటికే హేమంత్ సోరేన్‌ను, జార్ఖండ్ రెవిన్యూ శాఖ మాజీ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌ను ఇడి అరెస్టు చేసింది.

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

- బొలెరో వాహనం లోయలో పడి 8మంది మృతి

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నైనిటాల్ జిలా బేతాల్‌ఘాట్ వద్ద మంగళవారం తెల్లవారుజామున బొలెరో వాహనం అదుపుతప్పి 200 మీటర్ల గుంతలో పడటంతో అక్కడికక్కడే ఏడుగురు మరణించగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. ప్రమాదం సమయంలో వాహనంలో తొమ్మిది మంది ఉన్నారు. వీరంతా నేపాల్‌కు చెందిన వారు. జల్ జీవన్ మిషన్ కింద పని చేయడానికి వీరంతా ఉంచకోట్‌కు వచ్చారు. పనులు పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి బొలెరో వాహనంలో వెళుతుండగా, వాహనం అదుపుతప్పి 200 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. చీకటి సమయం కావడంతో సహాయ చర్యలకు తీవ్ర ఇబ్బందులు ఎదురైనట్లు పోలీసులు తెలిపారు. మొత్తంగా డ్రైవర్‌తో సహా 8 మంది మృతి చెందినట్లు నిర్ధారించారు.

కాంగ్రెస్‌లో బీరేంద్ర సింగ్ చేరిక

న్యూఢిల్లీ : ఒక రోజు క్రితమే బిజెపికి రాజీనామా చేసిన కేంద్ర మాజీ మంత్రి బీరేంద్ర సింగ్, ఆయన భార్య, మాజీ ఎమ్మెల్యే ప్రేమలత మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుత మోడీ ప్రభుత్వంలో బీరేంద్ర సింగ్ ఉక్కు శాఖ మంత్రిగా పనిచేశారు. మంగళవారం న్యూఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముకుల్ వాస్నిక్ సమక్షంలో బీరేంద్ర సింగ్ కాంగ్రెస్‌లో చేరారు. బీరేంద్ర సింగ్ చేరికతో హర్యానాలో కాంగ్రెస్ మరింత బలపడుతుందని ముకుల్ వాస్నిక్ అన్నారు. ఈ కార్యక్రమంలో హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సర్జేవాలా ఇతర నాయకులు పాల్గొన్నారు. బీరేంద్ర సింగ్ కుమారుడు బ్రిజేంద్ర సింగ్ కొన్ని నెలల క్రితమే కాంగ్రెస్‌లో చేరారు.

రాముడిని కాంగ్రెస్ అవమానించింది : మోడీ

పిలిబిత్ : అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ అనేక ప్రయత్నాలు చేసిందని, ప్రాణ ప్రతిష్ట వేడుక ఆహ్వానాన్ని తిరస్కరించి రాముడిని అవమానించిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని పిలిబిత్‌లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. అయోధ్య వేడుకకు హాజరైన నాయకులపై కాంగ్రెస్ ఆరేళ్ల నిషేధం విధించిందన్నారు. కాంగ్రెస్ తయారు చేసిన మేనిఫెస్టో ముస్లిం లీగ్‌దేనని మోడీ అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రపంచ దేశాల నుంచి భారత్ సహాయం కోరేదని, ఇప్పుడు ప్రపంచానికే భారత్ సహాయం చేస్తుందని అన్నారు. కోవిడ్ సమయంలో ప్రపంచం మొత్తానికి ఔషధాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

తమిళనాడులో 30 ప్రాంతాల్లో ఇడి సోదాలు

చెన్నై : తమిళనాడులోని 30 ప్రాంతాల్లో మంగళవారం ఇడి సోదాలు నిర్వహించింది. వీటిల్లో డిఎంకె మాజీ కార్యకర్త, చిత్ర నిర్మాత జాఫర్ సదిక్ నివాసం, చిత్ర దర్శకుడు అమీర్ కార్యాలయం వంటి ప్రాంతాలు కూడా ఉన్నాయి. బుహారి హోటల్స్ ఓనర్ బుహారి నివాసంలోనూ ఇడి సోదాలు నిర్వహించింది. రూ.2 వేల కోట్ల డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో గత నెలలో జాఫర్ సదిక్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అరెస్టు చేసింది. ఈ కేసును ఎన్‌సిబి, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా విచారణ చేస్తున్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ అధికారుల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ కేసు విచారణ ప్రారంభమైంది.

పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ వాహనాలకు జిపిఎస్

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు మొత్తం 7 దశల్లో జరగనున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. పోలింగ్ కోసం వాడే అన్ని వాహనాలకు జిపిఎస్ లోకేషన్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఎలక్షన్ సిబ్బందికి అవసరమైన సూచనలు చేశామని అన్నారు. ఎన్నికల సంఘం అధికారి మాట్లాడుతూ .... ఇవిఎం సహా ఇతర సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించే సమయంలో, ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిని స్ట్రాంగ్‌రూమ్‌లకు తీసుకొచ్చేవరకు పర్యవేక్షించడానికి జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఉపయోగించనున్నామన్నారు. ఏమైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించామని చెప్పారు. డ్రైవర్లు సహా పోలింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులను ప్రశ్నిస్తామన్నారు.

అభ్యర్థికి గోప్యత హక్కుంది

- ప్రతి విషయాన్నీ వెల్లడించాల్సిన అవసరం లేదు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికీ గోప్యత హక్కు ఉంటుందని, ముఖ్యమైనది అయితే తప్ప ప్రతి విషయాన్నీ అభ్యర్థి వెల్లడించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అభ్యర్థులు తమ గోప్యత హక్కును కాపాడుకోవచ్చునని, అభ్యర్థి తన వ్యక్తిగత జీవితం, గతంలో ఉన్న, ప్రస్తుతం వినియోగిస్తున్న ప్రతి వస్తువు గురించి వెల్లడించాల్సిన అవసరం లేదని తెలిపింది. 'ఒక అభ్యర్థి తనకు లేదా తనపై ఆధారపడిన కుటుంబ సభ్యులు దుస్తులు, పాదరక్షలు, టపాకాయలు, స్టేషనరీ, ఫర్నీచర్ వంటి ప్రతి చరాస్తినీ ప్రకటించాల్సిన అవసరం లేదు' అని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పులో పేర్కొంది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఒక స్వతంత్ర శాసనసభ్యుడు దాఖలు చేసిన అప్పీల్‌లో సుప్రీంకోర్టు ఈ రూలింగ్ ఇచ్చింది. 2019 ఎన్నికల సందర్భంగా ఈ ఎమ్మెల్యే గతంలో విక్రయించిన తన 'చరాస్థులను' గురించి అఫిడవిట్‌లో వెల్లడించనందుకు స్థానిక హైకోర్టు అతనిపై అనర్హత వేటు వేసింది. గత ఏడాది జూలైలో గౌహతి హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అరుణాచల్ ప్రదేశ్ ఎమ్మెల్యే కరిఖో క్రి ఈ పిటీషన్ వేశారు. 2019 మే 23న జరిగిన ఎన్నికలలో కరఖో క్రి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. క్రీ తన కైనెటిక్ జింగ్ స్కూటర్, అంబులెన్స్‌గా ఉపయోగించే మారుతీ ఓమ్నీ వ్యాన్, టీవీఎస్ స్టార్ సిటీ మోటార్ సైకిల్. స్కూటర్‌ను 2009లో స్క్రాప్‌గా విక్రయించారు. మరో రెండు వాహనాలు కూడా విక్రయించారు. వీటితోపాటు క్రి తన భార్య, కుమారుల ఆస్థి వివరాలను కచ్చితంగా వెల్లడించలేదని కొంతమంది హైకోర్టులో పిటీషన్ వేశారు. దీంతో హైకోర్టు అతనిపై నిషేధం విధించింది. దీనిని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును క్రి ఆశ్రయించారు. 'అత్యంత విలువైన ఆస్తులు ఉండి, విలాసవంతమైన జీవన శైలిని ప్రతిబింబిస్తే తప్ప.. అభ్యర్థి, తన కుటుంబ సభ్యుల చరాస్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదు' అని పేర్కొంది. అభ్యర్థి తన ఎన్నికల అభ్యర్థిత్వానికి సంబంధం లేని విషయాల్లో గోప్యతను పాటించే హక్కు ఉందని తెలిపింది.

ఓట్ల క్రాస్ వెరిఫికేషన్‌పై పిటిషన్లను 16న విచారించనున్న సుప్రీం

న్యూఢిల్లీ : ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిపిఎటి)తో పోలైన ఓట్ల క్రాస్ వెరిఫికేషన్ జరపాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లను ఈ నెల 16న విచారించనున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. వివిపిఎటి అనేది స్వతంత్ర ఓటు వెరిఫికేషన్ వ్యవస్థ. తన ఓటు సరిగ్గా పడిందా? లేదా? అని ఓటరు చూసుకోవడానికి ఇందులో వీలు వుంటుంది. దీంట్లో కాగితం స్లిప్ ఇస్తారు. దాన్ని ఓటరు చూసుకోవచ్చు. దాన్ని సీల్డ్ కవర్‌లో పెడతారు. వివాదం తలెత్తిన పక్షంలో దాన్ని తెరిచి చూస్తారు. ఇందుకు సంబంధించిన పిటిషన్లు అన్నింటినీ కలిపి వచ్చే మంగళవారం విచారించనున్నట్లు జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన బెంచ్ తెలిపింది. ఏప్రిల్ 19 నుండి ఏడు దశల్లో లోక్‌సభ పోలింగ్ ప్రారంభం కానుంది. ఎన్‌జిఒ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) దాఖలు చేసిన పిటిషన్‌ను ఇతర వాటితో కలిపి వచ్చే వారం విచారిస్తామని ఏప్రిల్ 3న సుప్రీం తెలిపింది. ప్రస్తుతమున్న పద్ధతి ప్రకారం ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ నుండి ఎంపిక చేసిన ఐదు ఇవిఎంల నుండి వచ్చిన స్లిప్‌లను మాత్రమే లెక్కిస్తున్నారు. అలాకాకుండా, వివిపిఎటి స్లిప్‌లన్నింటినీ పూర్తిగా లెక్కించాలని కోరుతూ అరుణ్ కుమార్ అగర్వాల్ పెట్టుకున్న పిటిషన్‌పై కేంద్రం, ఎన్నికల కమిషన్ నుండి స్పందనలను ఏప్రిల్ 1న సుప్రీం కోరింది. ఇప్పుడు ఆ పిటిషన్లు అన్నింటినీ కలిపి ఏప్రిల్ 16న విచారించనుంది.

రఫాపై దాడికి తేదీ ఖరారు చేశాం : నెతన్యాహు

- చర్చల పునరుద్ధరణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయన్న హమాస్
- గాజాకు అంతర్జాతీయ జర్నలిస్టులు వెళ్లాలి : ఐరాస

గాజా : దక్షిణ గాజాలోని రఫా నగరంపై పదాతిదళంతో దాడికి తేదీని ఖరారు చేశామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్‌నెతన్యాహు చెప్పారు. ఖాన్ యూనిస్ నగరం నుండి ఇజ్రాయిల్ బలగాలు వైదొలగిన నేపథ్యంలో నెతన్యాహు ప్రకటన వెలువడింది. రఫా నగరంలో దాదాపు 14లక్షలమంది నిర్వాసితులైన ప్రజలు తలదాచుకున్నారు. రాఫాపై దాడికి సిద్ధమవడం కోసమే తాము అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రక్షణ అధికారులు తెలిపారు. దీనిపై హమాస్ ప్రతినిధి సమీ అబూ జహ్రీ స్పందిస్తూ కైరోలో కాల్పుల విరమణ కోరుతూ చర్చలను పునరుద్ధరించడంపై ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. ఈజిప్ట్‌లో మధ్యవర్తులు అందజేసిన తాజా కాల్పుల విరమణ ప్రతిపాదనపై సమీక్షిస్తున్నామని తొలుత హమాస్ తెలిపింది. గాజా నగరంలోని జీటూన్ ప్రాంతంలో గత 24గంటల్లో ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు బాంబు దాడులకు దిగడంతో 153మంది చనిపోయారు. తాజా పరిణామాలపై అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ స్పందిస్తూ కాల్పుల విరమణపై హమాస్‌కు ఒక ప్రతిపాదన అందజేశామని, ప్రస్తుతం హమాస్ కోర్టులో బంతి వుందని, ఏం నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి వుందని వ్యాఖ్యానించారు.

గాజాలో నెలకొన్న సంక్షోభానికి మరింత ఆజ్యం పోసేలా తప్పుడు ప్రచారం జరుగుతోందని, అందువల్ల అక్కడ పరిస్థితులు తెలుసుకునేందుకు వీలుగా అంతర్జాతీయ జర్నలిస్టులను అక్కడకు పంపించాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

బెంగాల్‌లో సిపిఎం అభ్యర్థుల విస్తృత ప్రచారం

అండాల్ : తొలి విడత ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లోని స్థానాల్లో సిపిఎం అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సిపిఎం అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే జహనారాఖాన్ అండాల్ ప్రాంతంలో నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

అమెరికాలో భారతీయ విద్యార్థి కిడ్నాప్, హత్య

వాషింగ్టన్ : అమెరికాలో మూడు వారాల క్రితం అదృశ్యమైన భారతీయ విద్యార్థి మంగళవారం శవమై కనిపించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు కోసం క్లీవ్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంలో గత సంవత్సరం చేరాడు. క్లీవ్‌ల్యాండ్‌లో అతని మృతదేహం లభ్యమైనట్లు భారత రాయబార కార్యాలయం తెలియజేసింది. అతను ఎలా చనిపోయాడో తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు. మార్చి 7వ తేదీ నుంచి విద్యార్థి ఫోన్ ఆఫ్‌లో ఉందని కుటుంబీకులు తెలిపారు. మార్చి 19న విద్యార్థిని కిడ్నాప్ అయినట్లు గుర్తు తెలియని నంబర్ నుంచి అతని తండ్రికి సమాచారం అందింది. విడుదల చేయడానికి 1,200 డాలర్ల డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా అమెరికాలో భారతీయ విద్యార్థులపై ఈ విధమైన ఘాతుకాలు పెరిగిపోతున్నాయి.

గిరిజన కమిషన్‌పై కేంద్రం వివక్ష

- నియామకాలపై ఉదాశీనత
- అరకొరగా నిధుల మంజూరు
- బిజెపి నేతలతో నిండిపోయిన ఎన్‌సిఎస్‌టి కమిషన్

న్యూఢిల్లీ : దేశ ప్రథమ పౌరురాలు ఓ గిరిజన మహిళ. అయినప్పటికీ ఆదివాసీల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లు కన్పించడం లేదు. గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఏర్పడిన నోడల్ సంస్థ జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సిఎస్‌టి) పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోంది. ఈ కమిషన్‌లో 70 నాన్-మెంబర్ (సభ్యులు కాని) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎనిమిది నెలల పాటు ఖాళీగా ఉన్న ఛైర్మన్ పదవిని ఇటీవలే భర్తీ చేశారు. గత నెల 9న మధ్యప్రదేశ్‌కు చెందిన బిజెపి నేత అంతర్‌సింగ్ ఆర్యను ఎన్‌సిఎస్‌టి ఛైర్మన్‌గా నియమించారు.

ఎన్‌సిఎస్‌టి కమిషన్‌లో కీలకమైన ఐదు పోస్టులు ఫిబ్రవరి, మార్చిలో ఖాళీ అయ్యాయి. ఆ తర్వాత ముగ్గురు సభ్యులను ప్రభుత్వం నియమించింది. వీరంతా బిజెపి నాయకులే కావడం గమనార్హం. రాంచీ నగర మాజీ మేయర్, బిజెపి నేత ఆశా లక్రా, బిజెపి ఎస్టీ మోర్చా తెలంగాణ అధ్యక్షుడు జతోతు హుస్సేన్ నాయక్, మిజోరం మాజీ మంత్రి, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు నిరుపమ్ చక్మాకు ఈ పదవులు కట్టబెట్టారు. సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, అండర్-సెక్రటరీ వంటి 70 నాన్-మెంబర్ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి.

ఎస్‌టి కమిషన్‌లో అనేక పదవులను భర్తీ చేయకపోవడంతో దాని లక్ష్యమే దెబ్బతింటోందని యుపిఎ ప్రభుత్వంలో గిరిజన వ్యవహారాల మంత్రిగా పనిచేసిన కెసి దేవ్ చెప్పారు. సభ్యులు మాత్రమే ఫైల్స్, ఉత్తర ప్రత్యుత్తరాల వ్యవహారాలను చూడలేరని ఆయన తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఏ ప్రకారం ఎన్‌సీఎస్‌టీని ఏర్పాటు చేశారు. దీనిలో ప్రధానంగా ఐదుగురు సభ్యులు... ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, ముగ్గురు సభ్యులు...ఉంటారు.

ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు మోడీ ప్రభుత్వం అరకొరగా నిధులు కేటాయిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా కేటాయింపులు తగ్గిపోతుండడంతో ఎస్‌టి కమిషన్ కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కమిషన్‌కు ఐదు సంవత్సరాల క్రితం రూ.20 కోట్లు కేటాయించగా 2022-23లో అది రూ.12 కోట్లకు తగ్గిపోయింది. కీలక సిబ్బంది లేకపోవడంతో ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసిన గ్రూపుల పనితీరు కూడా కుంటుపడుతోంది. నివేదికలను సకాలంలో రూపొందించడం సాధ్యం కావడం లేదు. గత ఛైర్మన్ హర్ష్ చౌహాన్ ఓ కార్యాచరణ గ్రూపును ఏర్పాటు చేశారు. అయితే ఆ తర్వాత నూతన ఛైర్మన్ నియామకం జరగ్గానే ఈ గ్రూపు రద్దయింది.

పదవీకాలం మరో ఎనిమిది నెలలు ఉన్నప్పటికీ హర్ష్ చౌహాన్ గత సంవత్సరం జనవరిలో రాజీనామా చేశారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖతో ఏర్పడిన విభేదాలే దీనికి కారణమని తెలుస్తోంది. 2022లో రూపొందించిన నూతన అటవీ పరిరక్షణ నిబంధనలను ఆయన వ్యతిరేకించారు. చౌహాన్‌కు అఖిల భారతీయ వనవాసి కల్యాణ్ ఆశ్రమ్ వంటి సంఘ్ పరివార్ సంస్థలతో సంబంధాలు ఉన్నాయి.

మీ కోసం

కారం ఎక్కువకాలం తాజాగా, రంగు మారకుండా ఉండాలంటే అందులో కొద్దిగా ఇంగువ కలిపి ఉంచాలి.

జీవన సౌరభం

చేసిన పొరపాటుకు చింతించే బదులు మళ్లీ చేయకుండా జాగ్రత్త పడటం ఉత్తమం.

ఇద్దరు మిత్రులు

సిరిపురం అనే గ్రామంలో రాము, సోము అనే ఇద్దరు మిత్రులు ఉన్నారు. వారిద్దరూ పదవ తరగతి చదువుతున్నారు. రాము తండ్రి రైతు. సోము తండ్రి చేనేత కార్మికుడు. రాము, సోము చదువులో చురుకుగా ఉంటూనే తల్లిదండ్రులకు పనుల్లో సాయంగా ఉంటారు. పదో తరగతి పరీక్షలు రాశాక రాము ఒక రోజు పొలానికి వెళ్లాడు. అతడి తండ్రి చాలా దిగులుగా ఉన్నాడు. 'ఏంటి నాన్న అలా ఉన్నావు?' అని రాము తండ్రిని అడిగాడు.

'చేతికి వచ్చిన పంటను ఏనుగుల మంద పాడు చేస్తుంది. ప్రతి ఏడాది ఇదే తంతు. ఊరి వాళ్లందరం ఈ ఏనుగుల గుంపు నుంచి పంటను రక్షించుకోలేకపోతున్నాం' అని తండ్రి ఆవేదన చెందుతూ చెప్పాడు. అప్పుడు ఆ సమస్యకు పరిష్కారం కనుక్కోవాలని రాము, సోము తెగ ఆలోచించారు. ఒక సర్కస్ కంపెనీ వాళ్లని కలిసి 'ఏనుగులను ఎలా బెదిరించాలో చెప్పమ'న్నారు.

'ఏనుగులు సింహానికి భయపడతాయి. ఇంకా తేనెటీగల ఝూంకారానికి భయపడతాయి' అని సర్కస్ వాళ్లుచెప్పారు.ఇంటికి వచ్చిన స్నేహితులు, "సింహాన్ని ఎలాగూ తేలేం. కాబట్టి తేనెటీగల సాయంతో ఏనుగులను తరిమికొట్టాల"ని భావించారు. తేనెటీగల ఝూంకార శబ్దాన్ని ఒక టేపు రేడియోలో బంధించారు. ఆ పంట పొలం దగ్గర సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసి, నలువైపులా శబ్దం వచ్చేలా రేడియో అమర్చారు. ఆ దెబ్బతో ఏనుగులు అటువైపు రావడం మానేసాయి. ఆ ఏడాది గ్రామంలో ఏ పొలమూ ఏనుగుల వల్ల నష్టపోలేదు. దీంతో గ్రామంలోని రైతులంతా రాము, సోముని ఎంతో మెచ్చుకున్నారు.

– బల్ల కృష్ణవేణి, పలాస.

దారి చూపండి



పిల్లలూ, బయట ఉన్న బంగారం నాణెన్ని తీసుకెళ్లి కుండలో వేయండి.

నేను గీసిన బొమ్మ



టి.మానస్ శ్రీ చరణ్,
5వ తరగతి,
తిరుమల స్కూల్,
తొర్రేడు,
తూర్పుగోదావరి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మ గౌరవం పెంచాలని ...

కష్టాలతో కాపురం చేస్తున్న ఏ అమ్మ బిడ్డైనా, తల్లిని బాగా చూసుకోవాలని, ఆమెని గౌరవంగా ఉంచాలని ఆలోచిస్తారు. ఆమె తల ఎత్తుకునే పనులే చేయాలని కంకణం కట్టుకుంటారు. అలాంటి బిడ్డే అక్షర. విజయనగరం జిల్లా ఓ మారుమూల గ్రామంలో పుట్టిన అక్షరకి చిన్నతనంలోనే నాన్న చనిపోయాడు. కుటుంబ భారమంతా తన మీద వేసుకుని తల్లే ఇద్దరు బిడ్డలనూ సాకింది. కూలి పనులు చేసింది. పెద్ద బిడ్డకు పెళ్లి చేసి ఇక అక్షర మీదే ఆశలు పెట్టుకుని జీవిస్తోంది ఆ తల్లి.. అక్షర కూడా తల్లికి చేదోడు వాదోడుగా ఉంటూ కుటుంబానికి ఆసరాగా నిలిచింది. కానీ.. అక్షర పుట్టుకతో ఆడబిడ్డ కాదు. మగబిడ్డగా పుట్టి, మానసికంగా ఆడబిడ్డగా ఎదిగిన ప్రత్యేకమైన సంతానం.

రోజు కూలీ చేసుకునే కుటుంబంలో పుట్టిన అక్షరకు బాల్యం నుండే తన పుట్టుక గురించి భిన్నమైన ఆలోచనలు ఉండేవి. కానీ ఎక్కడా, ఎప్పుడూ బహిర్గతం చేయలేదు. 'నాన్న చిన్నప్పుడే చనిపోయాడు. అమ్మ మమ్మల్ని సాకేందుకు ఎన్నో కష్టాలు పడింది. అలాంటి సమయంలో నా ఆలోచనల్లో వస్తున్న మార్పుల గురించి అమ్మతో చెప్పలేకపోయాను. స్కూలుకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు కొందరు గేలి చేసేవారు. ఎంతోకాలం భరించలేకపోయాను. చదువులో చురుకుగా ఉండేవాడ్ని. కానీ శ్రద్ధ పెట్టలేకపోయాను. అమ్మకు సాయంగా, కుటుంబానికి ఆర్థికంగా చేయూత ఇవ్వాలని నిర్ణయించుకుని, 7వ తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పేశాను' అని గతాన్ని గుర్తు చేసుకుంది అక్షర.

'ఆడపిల్లలా తయారవ్వాలని, పూలు పెట్టుకోవాలని, చీర కట్టుకోవాలని మనసు ఎంతో ఆశపడేది. కానీ నేను అలా తయారైతే అమ్మ ఎక్కడ కుంగిపోతుందోనని భయమేసేది. నాతో పాటు అమ్మ కూడా అవమానాలు పడుతుందని బెదిరిపోయాను. అమ్మ మా కోసం ఎంతో కష్టపడింది. మేం సంతోషంగా ఉండాలని తన సంతోషాలను పక్కనబెట్టింది. ఇన్ని ఆలోచనల మధ్య మనసంతా ఎంతో అలజడిగా ఉండేది. ఇంటి నుండి వెళ్లిపోవాలని కొన్నిసార్లు, చచ్చిపోవాలని మరికొన్నిసార్లు అనుకున్నాను. కానీ, అమ్మ, అక్క గుర్తుకు వచ్చి ఆ ప్రయత్నాలు చేయలేదు. నేను అబ్బాయినైనా, అమ్మాయినైనా అమ్మను బాగా చూసుకోవాలి. నేను చేసే పనుల వల్ల అమ్మ గౌరవం పెరగాలి. ఇదే మనసులో బలంగా అనుకునేదాన్ని' అని అక్షర చెబుతున్నప్పుడు ఆమె మాటల్లో ఎంతో సంఘర్షణ కనిపించింది.

యుక్త వయసు వచ్చేవరకు గ్రామంలోనే ఉన్న అక్షర, అక్క పెళ్లి తరువాత, 'సిటీలో ఏదైనా పని చేస్తా. నా కాళ్ల మీద నేను బతుకుతా' అని చెప్పి హైద్రాబాద్‌కి బయలుదేరింది. 'అమ్మకు అలా

చెప్పినా, ఉపాధి కంటే ముందు, నా ఉనికిని వెతుక్కుంటూ వెళ్లాను. ఫ్యాంటు, షర్టు వేసుకునే ఇళ్లల్లో పనులు చేశాను. నా గురించి తెలియకుండా జాగ్రత్తపడుతూ నన్ను ఆదరించే వారి కోసం వెతికాను. యాచన చేయడం, సెక్స్ వర్క్ చేయడం నాకిష్టం లేదు. గౌరవమైన పనులు చేయాలి. గౌరవప్రదంగా జీవించాలి. అదొక్కటే నా మనసులో ఉంది. అలాంటి పనులు ఇచ్చేవారి కోసం ఎదురుచూశాను. సినిమా ఇండస్ట్రీలో మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేయాలని ఎంతో ప్రయత్నించాను. నా అవసరాన్ని బలహీనతగా చేసుకుని మోసం చేసినవాళ్లని చూశాను. లాక్‌డౌన్ తరువాతే అక్షరగా నా ప్రయాణం మొదలైంది' అని తన ఉనికిని గుర్తించే క్రమంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు.

ఎన్నో ప్రయత్నాల తరువాత ట్రాన్స్‌జెండర్ హక్కుల కోసం, వారికి గౌరవప్రద జీవితాలు

అందించేందుకు పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల నీడకి అక్షర చేరుకుంది. అక్కడ ఆమెకు తనలా తమ కాళ్ల మీద తాము నిలబడిన ఎంతోమందితో పరిచయాలు ఏర్పడ్డాయి. ఆ పరిచయాలు అక్షరని అంచెలంచెలుగా పైకి ఎదిగేలా చేశాయి. ఉన్నత వ్యక్తిత్వం గల మనిషిగా ఆమెకి ప్రత్యేక గుర్తింపుని సాధించి పెట్టాయి. అలా తన సేవలు కావాలని పర్సనల్ అసిస్టెంట్‌గా నియమించుకున్న పెద్ద మనుషులూ అక్షర జీవితంలో ఉన్నారు. వారితో కలిసి రాష్ట్రాలు దాటిన అక్షర, ఆ తరువాత ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్త మాల ప్రోత్సాహంతో ప్రస్తుతం ఓ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలో ఉన్నత కొలువులో స్థిరపడ్డారు. 'మే నెల నాటికి ఈ జాబ్ పర్మినెంట్ అవుతుంది. అప్పుడే అమ్మను కలుస్తాను' అని చెబుతున్నప్పుడు అక్షర మాటల్లో ఒకింత భావోద్వేగం కనిపించింది.

హైద్రాబాద్‌కి వచ్చిన దగ్గరి నుంచి అక్షర వాళ్ల అమ్మని కలవలేదు. 'అమ్మ ఆలోచనలన్నీ నా కోసమే. నేను ఊరు వెళతానని చెప్పినప్పుడు కూడా, చిన్నప్పటి నుండి ఎన్నో కష్టాలు పడ్డావు. కుటుంబానికి ఆసరాగా నిలబడ్డావు. ఇప్పటికైనా నీ కోసం ఆలోచిస్తున్నావు. అంతే చాలు' అని ఆశీర్వదించి పంపింది. ఏ రోజూ నేను పంపించే జీతం కోసం ఆశపడలేదు. రూపాయి రూపాయి కూడబెట్టుకుని జెండర్ ఆపరేషన్ చేయించుకున్నాను. ఇప్పుడు పూర్తిగా అమ్మాయిగా మారిపోయాను. అమ్మ ఎన్నోసార్లు ఫోన్లో నన్ను చూసి మాట్లాడాలని చెప్పేది. ఏదో సాకు చెప్పి తప్పించుకునేదాన్ని. కానీ ఇంకెన్నాళ్లు? అమ్మకు నా గురించి చెప్పాలని మనసు ఉవ్విళ్లూరుతోంది. ఆ రోజు త్వరలోనే రాబోతోంది. ఆ ఉద్విగ్న క్షణాల్లో అమ్మ నా గురించి తెలుసుకుని బాధపడినా నేను జీవిస్తున్న జీవితం గురించి గర్వపడాలి. అదొక్కటే నా ఆశ' అని అక్షర అంటోంది.

పుట్టిన ప్రతి బిడ్డకు ఒకే జీవితం ఉంటుంది. అక్షర లాంటి వాళ్లకు మాత్రమే రెండు జీవితాలు ఉంటాయి. ఇప్పుడు అక్షర రెండో జీవితంలో ప్రయాణిస్తోంది. కుటుంబం, సమాజం ఆమెకు అండగా నిలవాలని కోరుకుందాం.

– జ్యోతిర్మయి

11న 'లవ్ గురు'

విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన తాజా చిత్రం 'లవ్ గురు' మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 11న విడుదల అవుతుంది. సినిమా విశేషాలను విజయ్ ఆంటోనీ ముచ్చటించారు. 'ఈ సినిమా కథ విన్నప్పుడు ఇది సాధించబోయే విజయం మీద నమ్మకం కలిగింది. ఈ చిత్రంలో ఫెంటాస్టిక్ ఫ్యామిలీ కామెడీ చూస్తారు. సినిమా చూశాక మీ జీవిత భాగస్వామిని ప్రేమించడం ఎలాగో తెలుసుకుంటారు. డైలాగులు చాలా సహజంగా ఉంటాయి. దర్శకుడు వినాయక్ న్యాచురల్‌గా రాశారు. నాకు మెమరీ పవర్ తక్కువ. తెలుగు భాష నేర్చుకోలేకపోయాను. నాకు తెలుగు వచ్చి ఉంటే తెలుగులోనే నేరుగా సినిమాలు చేసేవాడిని. అలాంటి అవకాశం ఉంటే చెన్నై వదిలి వచ్చి ఇక్కడే సినిమాలు చేస్తా. నేనొక సినిమా చేస్తే తాని నిర్మాణ బాధ్యతలు, ఎడిటింగ్, నటించడం, అన్ని భాషల్లో ప్రమోషన్ చేయడం వీటికే టైమ్ సరిపోతోంది' అని అన్నారు.

నిహారిక సమర్పణలో 'కమిటీ కుర్రాళ్లు'

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై ఉగాది రోజున 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌ను సాయి దుర్గా తేజ్ విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'ఇందులో 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. షూటింగ్ పూర్తయ్యింది' అని చిత్ర దర్శకుడు వంశీ చెప్పారు.

'బ్రాండ్ న్యూ పోస్టర్'తో నాని

వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో 'సరిపోదా శనివారం' సినిమా చేస్తున్న నాని, ఉగాది సందర్భంగా శుభాకాంక్షలను తెలియజేస్తూ నాని, సాయి కుమార్‌లతో కూడిన బ్రాండ్ న్యూ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సూర్యగా నాని, శంకరంగా సాయి కుమార్ నటిస్తున్నారు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ప్రియాంక మోహన్ కథానాయిక. ఎస్జే సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్ట్ 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

'రవన్న దావత్ ఇస్తుండు'

హీరో రవితేజ మరో సినిమాలో నటించబోతున్నారు. చిత్రబృందం ఆర్‌టి75 పేరుతో ఉగాది రోజున పోస్టర్‌ను విడుదల చేసింది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా రానుంది. రైటర్ భాను బొగ్గవరపు ఈ సినిమాతో దర్శకుడుగా ఎంట్రీ ఇవ్వనున్నారు. భారీస్థాయిలో నిర్వహించబడుతున్న ఊరి జాతరను చూపిస్తూ, సృజనాత్మకంగా రూపొందించిన పోస్టరు ఆకట్టుకుంటోంది. పోస్టర్ మీద 'రవన్న దావత్ ఇస్తుండు. రెడీ అయిపోండ్రి', 'హ్యాపీ ఉగాది రా భయ్' అని తెలంగాణా యాసలో రాసివుంది. దీనిని బట్టి చూస్తే తెలంగాణా నేపధ్యంలో సాగే చిత్రమని అర్థమవుతుంది. ఈ సినిమాలో రవితేజ పాత్రపేరు 'లక్ష్మణభేరి' అని మేకర్స్ తెలిపారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

యదార్థ సంఘటనతో 'ఎస్ఐ కోదండపాణి'

సాయి హనుమాన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై కోదండపాణి, నురేఖ రాథోడ్ జంటగా నటించిన చిత్రం ఎస్ఐ కోదండపాణి. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని మేకర్లు ప్రకటించారు. మంచి క్లాస్, మాస్ ఎలిమెంట్లతో సన్నివేశాలు తెరకెక్కించామని తెలిపారు. అన్ని తరగతుల ప్రేక్షకులను అలరించేలా అద్భుతమైన సాంకేతిక నిపుణులతో మంచి పేరు తెచ్చిపెట్టే చిత్రంగా నిలుస్తుందని వివరించారు. షూటింగ్ పూర్తయ్యిందనీ, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఈనెలాఖరులో సినిమా విడుదల చేస్తామని వివరించారు. ప్రొడ్యూసర్, దర్శకుడిగా మక్కా శ్రీను వ్యవహరిస్తున్నారు.

32 ఏళ్ల తర్వాత రజనీ సినిమాలో శోభన

'దళపతి' చిత్రం కాంబో రిపీట్ కానుంది. మణిరత్నం దర్శకత్వంలో రజనీకాంత్, మమ్ముట్టి, అరవిందస్వామి కలిసి నటించిన చిత్రమిది. శోభన కథానాయిక. 1988లో ఈ సినిమా విడుదలై ఘన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'కళుగు'. ఈ చిత్రం టైటిల్ ఈనెల 22న విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాలో శోభన నటించనుంది. దళపతి తర్వాత రజనీతో కలిసి ఆమె నటించే చిత్రమిదే కావటం విశేషం.

ఉత్కంఠ పోరులో సన్‌రైజర్స్ గెలుపు

- పంజాబ్ కింగ్స్‌పై రెండు పరుగులు తేడాతో విజయం

ఛండీగఢ్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్–17లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. ముల్లన్‌పూర్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో మంగళవారం జరిగిన ఉత్కంఠపోరులో సన్‌రైజర్స్ జట్టు రెండు పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 182పరుగులు చేయగా.. ఛేదనలో పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి ఆరు వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసి ఓటమిపాలైంది. ఉనాద్కట్ వేసిన చివరి ఓవర్‌ల్లో 29పరుగులు చేయాల్సిన పంజాబ్ జట్టు 26పరుగులే చేయడంతో సన్‌రైజర్స్‌కు విజయం ఖాయమైంది. తొలుత హైదరాబాద్ 64పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న తెలుగుతేజం నితీశ్ కుమార్‌రెడ్డి అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 182పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. రబడ వేసిన తొలి ఓవర్ మొదటి బంతికే ఔటయ్యే ప్రమాదం

నితీశ్‌కుమార్ రెడ్డి(64)

తప్పించుకున్న ఓపెనర్ ట్రావిస్ హెడ్ 21 పరుగుల వద్ద ధావన్‌కు దొరికాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన నాలుగో ఓవర్లో హెడ్ వెనుదిరిగాక వచ్చిన ఎడెన్ మర్క్‌రమ్ డకౌటయ్యాడు. ఆ తర్వాత అభిషేక్ శర్మ(16) ధాటిగా ఆడే క్రమంలో వికెట్ పారేసుకున్నాడు. ఇక ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రాహుల్ త్రిపాఠి(11)ని హర్షల్ పటేల్ వెనక్కి పంపాడు. ఓవర్లో క్లాసెన్ భారీ షాట్ ఆడి బౌండరీ వద్ద సామ్ కరన్ చేతికి చిక్కాడు. దాంతో, ఐదో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి(64; 37 బంతుల్లో 4 ఫోర్లు 5 సిక్సర్లు) చెలరేగాడు. హర్‌ప్రీత్ బ్రార్, సామ్ కరన్‌లను టార్గెట్ చేసిన నితీశ్ సిక్సర్లతో హోరెత్తించాడు. అబ్దుల్ సమద్(25) వచ్చాక మరింత రెచ్చిపోయిన నితీశ్ ఐపిఎల్‌లో తొలి అర్ధసెంచరీ బాదాడు. ఐపిఎల్‌లో తొలి అర్ధసెంచరీతో కదం తొక్కాడు. మరో ఎండ్‌లో అబ్దుల్ సమద్(25)తో విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. పంబాబ్ బౌలర్లో అర్ష్‌దీప్ సింగ్‌కు నాలుగు, హర్షల్ పటేల్, సామ్ కర్రన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ టాపార్డర్ బ్యాటర్లు నిరాశపరిచినా.. సామ్ కర్రన్(29), సికిందర్ రాజా(28) రాణించారు. చివర్లో ధాటిగా శశాంక్ సింగ్(46నాటౌట్; 25బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్), అషుతోష్ శర్మ(33నాటౌట్; 15బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సర్లు) ధాటిగా ఆడి పంజాబ్‌కు ఆశలు కల్పించారు. కానీ ఉనాద్కట్ వారి పాచికలు పారనివ్వలేదు. దీంతో ఆ జట్టు 20ఓవర్లు పూర్తయ్యేసరికి 180పరుగులే చేసింది. సన్‌రైజర్స్ బౌలర్లు భువనేశ్వర్‌కు రెండు, కమిన్స్, నటరాజన్, నితీశ్‌రెడ్డిలకు ఒక్కో వికెట్ దక్కాయి.

అంకిత, రుతుజ శుభారంభం

రుతుజ భోంసాలే

ముంబయి: బిల్లీ జీన్ కింగ్ కప్‌లో భారత మహిళా టెన్నిస్ క్రీడాకారిణులు శుభారంభం చేశారు. ఆసియా పసిఫిక్ ఓషియానాలో భాగంగా ఫిజితో మంగళవారం జరిగిన పోటీలో భారత్ తొలిరోజు 3–0 ఆధిక్యతలో నిలిచింది. రుతుజ భోంసాలే 6–1, 6–3తో ఫిజీకి చెందిన తరణి కమోయ్‌ను చిత్తుచేయగా.. మరో సింగిల్స్‌లో శ్రీవల్లి రష్మిక 6–1, 6–తో మెహితా బూషీని ఓడించింది. ఏకపక్షంగా సాగిన మూడో సింగిల్స్‌లో స్టార్ క్రీడాకారిణి అంకిత రైనా ప్రత్యర్థిని సునాయాసంగా చిత్తుచేసింది. డేవిస్‌కప్ అర్హత టోర్నీకి దక్షిణ, నైరుతి, మధ్య, పశ్చిమ పసిఫిక్ దేశాలనుంచి బిల్లీ జీన్ కప్ నుంచి రెండుజట్లు అర్హత సాధించేందుకు ఈ పోటీలు జరుగుతున్నాయి. రెండోరౌండ్‌లో భారతజట్టు చైనాతో తలపడనుంది. ఈ టోర్నమెంట్‌లో ఈ రెండు జట్లతోపాటు కొరియా, చైనీస్ తైపీ, నూజిలాండ్ జట్లు కూడా పాల్గొంటున్నాయి. మొత్తం 6జట్లలో ఆసియా/ఓషియానియా గ్రూప్ నుంచి రెండు జట్లు ప్లే–ఆఫ్‌కు చేరనున్నాయి. ఆ రెండుజట్లు గ్రూప్–2కు అర్హత సాధిస్తాయి.

సౌత్‌జోన్ 133ఆలౌట్

మహిళల ఇంటర్‌జోనల్ మల్టీ–డే ట్రోఫీ

ముంబయి: సౌత్–ఈస్ట్‌జోన్ జట్ల మధ్య జరుగుతున్న మహిళల ఇంటర్‌జోనల్ మల్టీ–డే టోర్నమెంట్‌లో సౌత్‌జోన్ బ్యాటర్లు తొలిరోజు ఆలౌటయ్యారు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఫైనల్లో ఈస్ట్‌జోన్ బౌలర్ దీప్తి శర్మ ధాటికి సౌత్‌జోన్ జట్టు 133పరుగులకే కుప్పకూలింది. సౌత్‌జోన్ కెప్టెన్ మిన్ను మణి టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు మొగ్గు చూపగా.. ఈస్ట్‌జోన్ కెప్టెన్ దీప్తి శర్మ(4/30) ధాటికి సౌత్‌జోన్ బ్యాటర్లు కకావికలమయ్యారు. అరుంధతి రెడ్డి(57) అర్ధసెంచరీతో రాణించగా.. దీప్తికి తోడు టిటాస్ సద్ధు మరో నాలుగు వికెట్లతో సత్తా చాటింది. దీంతో సౌత్ జోన్ జట్టు తొలిరోజు 54.5ఓవర్లలో 133పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్‌జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 34ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 108పరుగులు చేసింది. రీచా ఘోష్(25) టాప్‌స్కోరర్.

ఐపిఎల్‌లో నేడు

రాజస్తాన్ × గుజరాత్

వేదిక: జైపూర్; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	4	4	0	8	1.12
కోల్‌కతా	4	3	1	6	1.52
లక్నో	4	3	1	6	0.77
చెన్నై	5	3	2	6	0.66
సన్‌రైజర్స్	5	3	2	6	0.34
పంజాబ్‌కింగ్స్	5	2	3	4	-0.19
గుజరాత్	5	2	3	4	-0.79
ముంబయి	4	1	3	2	-0.70
బెంగళూరు	5	1	4	2	-0.84
ఢిల్లీ క్యాపిటల్స్	5	1	4	2	-1.37

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68